01-08Pg1exHMNWJQEBPRCKLT.qxd:01-08Pg1exHMNWJQEBPRCKLT.qxd 1/1/02 5:54 AM Page 1





తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

శ్రీకాకుళం

epaper.vaartha.com WWW.VAARTHA.COM

fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

1-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 182 పేజీలు: 16 వెల: 6.50



ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

सत्यमेव जयते

VIZAG ALLURI SITARAMA RAJU INTERNATIONAL AIRPORT GMR AERO

# ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు

భారత ప్రధానమంత్రివర్యులు

## గౌ॥ శ్రీ నరేంద్ర మోదీ గారిచే

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు

## గౌ॥ శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రివర్యులు

## గౌ॥ శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గారు

ఆంధ్రప్రదేశ్ విద్యా & ఐటీ శాఖ మంత్రివర్యులు

## గౌ॥ శ్రీ నారా లోకేష్ గారు

భారత పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు

## గౌ॥ శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు గార్ల సమక్షంలో...

# అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవం

వేదిక
భోగాపురం

తేదీ: ఆగస్టు 01, 2026
సమయం: ఉ. 10 గం॥లకు

- ₹5,641 కోట్లతో... అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం
- మొట్టమొదటి సమగ్ర సివిల్ ఏవియేషన్ హబ్
- 60 లక్షల ప్రయాణికులు (భవిష్యత్తులో 4 కోట్లు)
- 25 వేల MT కార్గో సామర్థ్యం



- గత రెండేళ్లలో ఉత్తరాంధ్రకు ₹6.13 లక్షల కోట్ల పెట్టుబడులు
- 189 పైగా పరిశ్రమలు, ప్రాజెక్టులు
- 5.57 లక్షల ఉపాధి అవకాశాలు

: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

1-8-2026
శనివారం
సంపుటి: 32
సంచిక: 182
పేజీలు: 16 వెల: 6.50

## కేంద్రమంత్రి జితేంద్రసింగ్‌పై
# హక్కుల ఉల్లంఘన నోటీసు
### లోక్‌సభలో ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్



**న్యూఢిల్లీ,జులై 31:** కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌పై కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ సభ్యుడు కె.సి. వేణుగోపాల్ సభా హక్కుల ఉల్లంఘన (ప్రివిలేజ్ మోషన్) నోటీసు దాఖలు చేశారు. ఈనెల 20న జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా నిరసనకారులపై ఎలాంటి కాల్పులు జరగలేదని లోక్‌సభలో మంత్రిచేసిన వ్యాఖ్యలు పార్లమెంట్‌ను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. వేణుగోపాల్ తన నోటీసులో మంత్రి చేసిన ప్రకటనలు వాస్తవ పరిస్థితులకు పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. మంత్రి చేసిన వ్యాఖ్యలకు భిన్నంగా కాల్పులు జరిగాయి. కాల్పుల్లో గాయపడిన వ్యక్తి ఇప్పటికీ చికిత్స పొందుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు బహిరంగంగానే అందుబాటులో ఉన్నాయి. అయినప్పటికీ లోక్‌సభలో కాల్పులు జరగలేదని చెప్పడం ద్వారా మంత్రి తెలిసీ తప్పు సమాచారం ఇచ్చి సభను తప్పుదోవ పట్టించారని ఆయన ఆరోపించారు. ఈనెల 29న ప్రజా పరీక్షలు (అక్రమ మార్గాల నివారణ) >>2

## కామన్‌వెల్త్‌క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం
## జూడోలో
# చరిత్ర సృష్టించిన అస్మితా డే



**గ్లాస్గో,జులై 31:** కామన్వెల్త్ గేమ్స్‌లో భారత క్రీడాకారిణి అస్మితా డే అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకం సాధించింది. జూడో మహిళల 48 కేజీల విభాగం ఫైనల్‌లో ఉత్కంఠభరిత పోరులో విజయం సాధించిన అస్మితా భారత్‌కు ఈ క్రీడల్లో నాలుగో బంగారు పతకాన్ని అందించింది. ఈ విజయంతో జూడో చరిత్రలో భారత్‌కు కొత్త అధ్యాయం ప్రారంభమైంది. కామన్వెల్త్ గేమ్స్ జూడో విభాగంలో భారత్‌కు తొలి స్వర్ణ పతకం అందించిన క్రీడాకారిణిగా అస్మితా డే రికార్డు సృష్టించింది. మరోవైపు జూడోలోనే హర్ష్ సింగ్, యామిని మోర్యలు కూడా నేడు స్వర్ణ పతకాల కోసం పోటీ పడనున్నారు. బాక్సింగ్ విభాగంలో ప్రీతి పవార్, అంకుష్ పంఘల్, జైస్మిన్ లాంబోరియా, జదుమణి సింగ్, అరుంధతి చౌదరి శనివారం జరగనున్న ఫైనల్స్‌కు అర్హత సాధించారు.

**టేబుల్ టెన్నిస్‌లో రెండు స్వర్ణాలు** -'ఆట'లో

# విమాన వైభోగాపురం నేడు శ్రీకారం

## చరిత్రలో ఓ అపూర్వఘట్టం ఆవిష్కరణం
## తెలుగు సంస్కృతికి అద్దంపట్టేలా ఏర్పాట్లు
## ప్రధాని మోడీకి ఘనస్వాగతం పలకండి
## సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జులై31,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రేపు (ఆగస్టు 1) ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ విమానాశ్రయ పనుల పురోగతిపై ఆయన అధికారులతో వీడియో >>2



ప్రారంభానికి సిద్ధమైన భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం



శుక్రవారం భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

# రూ.17,912 కోట్ల అభివృద్ధి పనులు
## ప్రారంభించనున్న ప్రధాని



**విజయనగరం, జులై 31 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమవుతోంది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ విజయనగరం జిల్లా భోగాపురంలో రూ.4,727కోట్లతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంను శనివారం ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు వేదికను పంచుకోనున్నారు. విమానాశ్రయ ప్రారంభోత్సవంతో పాటు రాష్ట్రంలో మొత్తం రూ.17,912 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న పలు కీలక ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

**ఉత్తరాంధ్రకు పారిశ్రామిక కాంతి:** భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి రావడం వల్ల విశాఖతో పాటు పరిసర జిల్లాల్లో పర్యాటక, పారిశ్రామిక, రవాణా రంగాలు ఊపందుకోనున్నాయి. దీనికి తోడుగా విశాఖ జిల్లా తర్లువాడ వద్ద రూ.468 కోట్లతో నిర్మించనున్న >>2

## సెమికండక్టర్ ప్యాకేజింగ్ యూనిట్‌కు
# నేడు శంకుస్థాపన

**విశాఖపట్నం, జులై 31 ప్రభాత వార్త:** దక్షిణ భారతదేశంలో సెమి కండక్టర్ తయారీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రంగా మారనుంది. రాష్ట్రాన్ని ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్ తయారీ రంగానికి చిరునామాగా మార్చే క్రమంలో మరో ప్రతిష్టాత్మక అడుగు పడింది. అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆసిప్ ) సంస్థ, దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కో లిమిటెడ్ భాగస్వామ్యంతో జిల్లాలో ఆనందపురం మండలం, తార్లువాడ గ్రామంలో ఏర్పాటు చేయనున్న సెమికండక్టర్ ప్యాకేజింగ్ ఫెసిలిటీ భూమిపూజ కార్యక్రమం శనివారం ఉద యం జరగనుంది. ఈకార్యక్రమాన్ని భారత >>2

# గోదావరి ఉగ్రరూపం
## అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్లు , నది పొడవునా ప్రత్యేక నిఘా

**ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, జులై 31:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నదికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీగా వరదనీరు దిగువకు చేరుతుండటంతో గోదావరి పరివాహక ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తమయ్యారు. ధవళేశ్వరం ప్రాజెక్టు వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన సందర్భంగా గోదావరి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖతో పాటు జిల్లా యంత్రాంగాలు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తున్నాయి. వరద పరిస్థితుల దృష్ట్యా ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. కుకునూరు, వేలేరుపాడు మండలాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షి ంచాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో తాగునీరు, ఆహారం, విద్యుత్, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు



శుక్రవారం ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మత్స్యకారులు గోదావరిలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు వద్దకు చేరుతున్న వరద ప్రవాహాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. గోదావరి నీటిమట్టంలో మార్పులను నిశితంగా గమనిస్తూ అవసరమైన చర్యలకు అన్ని శాఖలను సిద్ధంగా ఉంచారు. భద్రాచలం వద్ద కూడా గోదావరి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో దిగువ ప్రాంతాలపై ప్రభావం ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి వరద ప్రభావం దృష్ట్యా సిద్ధాంతం, నరసాపురం పరివాహక ప్రాంతాలపై కూడా అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని అధికారులు పేర్కొన్నప్పటికీ, పరిస్థితిని పశ్చిమ గోదావరి జిల్లా >>2



# ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల
## 89.22శాతం మంది ఫారాలు సమర్పించారన్న సిఇఓ వివేక్ యాదవ్

**విజయవాడ,జులై31,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 3.71కోట్ల మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారని ఏపీ ఎన్నికల సంఘం సీఈవో వివేక్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం రాజధాని అమరావతిలో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఎస్ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితాను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఇఓ వివేక్ యాదవ్ మాట్లాడారు. ఈ ముసాయిదా జాబితాను ఎలక్షన్‌కమిషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐ) నెట్‌యాప్, సిఇఓ వెబ్‌సైట్‌లలో >>2

## హరిత, సౌరశక్తి రంగంలో
# భారీ పెట్టుబడులు
## రూ.1,44,943 కోట్ల ప్రాజెక్టులు
## 9,367 మందికి ఉపాధి అవకాశాలు

**విజయవాడ,జులై31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో హరిత,సౌర శక్తిరంగంలో పెట్టుబడులకు బహుళజాతి సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఏపీ ప్రభుత్వంలో తమ పరిశ్రమల స్థాపనకు ఎంవోయూ(ఒప్పందాలు) చోటు చేసుకుంటున్నాయి. సాధారణ పరిపాలన విభాగం నుంచి అందిన సమాచారాన్ని అనుసరించి ఇదే దిశలో ఐటీ రూ.వేల కోట్లు పెట్టుబడులతో స్థాపించేందుకు పరిశ్రమలు ముందుకొచ్చాయి. ఇటీవల రాష్ట్రంలో రూ.1,44,943 కోట్లతో భారీ ప్రాజెక్టుల పెట్టుబడులకు సంబంధించిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ) నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ప్రతిపాదనలు జరిగాయని ప్రభుత్వం తెలిపింది, వీటి ద్వారా సుమారు 9,367 మందికి ఉపాధి అవకాశాలు లభించ నున్నాయి. గ్రీన్ హైడ్రోజన్, సోలార్, విండ్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడుల వరద పారుతోంది. కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండటంతో సంస్థలు అదే దిశగా అడుగులు వేస్తున్నాయి. కాకినాడలో వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.15 వేల కోట్లతో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టును ఏర్పాటు చేయనుంది. దీనివల్ల 1,500 మందికి ఉపాధి దక్కుతుంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో అగస్త్య గ్రీన్ ఎనర్జీ రూ. 7,799 కోట్లతో సోలార్ తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ రూ.1,600 కోట్లతో టాప్‌కాన్ సోలార్ సెల్ ప్లాంట్‌ను స్థాపిస్తోంది. కర్నూలు జిల్లాలో జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్ రూ.1,533 కోట్లతో విండ్, సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. డేటా సెంటర్ల ఏర్పాటుకు సంస్థలు అత్యధిక ఆసక్తి చూపుతున్నాయి. మొత్తం పెట్టుబడుల >>2



1 -8pg4.qxd:1 -8pg4.qxd 1/1/02 6:19 AM Page 1



వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివి తేటలు ఉండీ అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

న- సి.డబ్ల్యు, వెండెట్

# ఇ-ట్వంటీ ఈక్విటీతో తంటా!

ఇ-20 పెట్రోలు వినియోగంవల్ల వాహనాల మన్నికలో గణనీయమైన మార్పులు, సమస్యలు ఉత్పన్నం కావని సమగ్ర అధ్యయనాల్లో గుర్తించినట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తున్నా వాహన వినియోగదారుల్లో సందేహాలు నివృత్తమౌతున్నట్లు లేదు. అంతేకాదు పాతతరం వాహనాల్లో కూడా ఇంజిన్‌లో ఎలాంటి మార్పులు లేకుండానే ఇ-20 పెట్రోలు వాడుకోవచ్చనీ భరోసా ఇస్తోంది. ఈవిషయాలను కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖల మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం రాజ్యసభలో నిష్కర్షగా వివరించారు. వాహనంలోని లోహ, ప్లాస్టిక్ భాగాలకు నష్టం చేయదని చెబుతున్నారు. మరో తడబాటు ఏమిటంటే 2005 ఏప్రిల్ 1 తర్వాత ప్రవేశపెట్టిన 2016కు ముందు తయారైన బిఎస్-3 వాహనాలకు రబ్బరుతో తయారైన కొన్ని విడిభాగాలు, గ్యాస్కెట్లు మార్చాల్సి వస్తుందని వారే పేర్కొన్నారు. 'నీట్ పేపర్ లీక్' వ్యవహారంలో తమ మాట నెగ్గించుకున్న కాక్రోచ్ జనతాపార్టీ ఉద్యమానికి మరో ఆయుధం దొరక్కూడదని కేంద్రప్రభుత్వం విస్తృతంగా ఎత్తులు వేస్తోంది. ఈ అంశం మీద తలెత్తిన సందేహాలను తీర్చేందుకు తెహసీన్ పునావాలా నేతృత్వంలో 'టీమ్ భారత్ -ఇ 20' అమలును నిరసిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో నిరసనలు చేపట్టింది. ఈ బృందంతో కేంద్ర పెట్రోలియం నేచురల్ గ్యాస్ మంత్రి హర్దీప్ సింగ్ పురి చర్చలు జరిపినా ఫలప్రదం కాలేదు. ఇలాంటి చర్చలు ఒక ముందడుగే అయినా ఇరుపక్షాల వాదనల్లో ఎలాంటి మార్పు రాకపోవడం విశేషం. ఈసమావేశంలో టీమ్ భారత్ పెట్టిన షరతులపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. పాత వాహనాల కోసం ఇ-10 పెట్రో లుతోపాటు ప్యూర్ పెట్రోలు కూడా అందుబాటులో ఉం చాలని, ప్రస్తుతమున్న ఫ్యూర్ పెట్రోలు ధరకే కంటె 20 శాతం తక్కువ ధర ఈ పెట్రోల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఇ-20 పెట్రోలు వాడకమనేది ప్రస్తుతమున్న క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఇంధన విధానంలో సరికొత్త మార్పుగానే భావించాలి. అయితే దాని వినియోగంపై పలువురిలో రకరకాల సందేహాలుతలెత్తాయి. ఇథనాల్‌లో శక్తిసాంద్రత పెట్రోల్ కంటె తక్కువ కావడంతో పాత వాహనాల్లో మైలేజీ కొంత తగ్గే అవకాశం ఉందని వాహనదారుల అంచనా. ఈ విషయాన్ని కేంద్రప్రభుత్వంకూడా అంగీకరించింది. ఇ-20 పెట్రోల్‌తో వాహనాల ఇంధన సామర్థ్యం 2 నుంచి 6 శాతం వరకు తగ్గొచ్చని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కూడా వివరించారు. దిగుమతి చేసుకునే ముడిచమురుమీద ఆధారపడటం తగ్గించాలని, రైతులకు ఇథనాల్ మార్కెటింగ్ ద్వారా ప్రయోజనం కల్పించాలని, కార్బన్ ఉద్గారాలను తగ్గించాలనే లక్ష్యా లతో ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకొచ్చింది. ఇథనాల్ కలపడం వల్ల విదేశీ మారక ద్రవ్యం కూడా ఆదా అవుతుందని కేంద్రప్రభుత్వం వాదిస్తోంది. కాలుష్యం తగ్గుతుంది. చెరకు,మొక్కజొన్న, ధాన్యపు వ్యర్థాలవంటి పంటలకు డిమాండ్ పెరుగుతుంది. ఇంధన భద్రతకు ఇదే మూలమని కేంద్ర ప్రభుత్వం నమ్మింది. ఆచరించాలని చూస్తోంది. ఇథనాల్ ధర పెట్రోల్ కన్నా తక్కువకే లభ్యమవుతున్నప్పుడు వినియోగదారునికి భారత తగ్గలే దెందుకనే అన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇంధన భద్రత, రైతుకు ఆదాయం, దిగుమతి వ్యయం అన్ని అంశాలలోనూ మేలైన ప్రయోజనాలున్నాయి. కాగా శాస్త్రీయ ఆధారాలతో ఇ-20 పెట్రోలు వలన ఒనగూరే ప్రయోజనాల విషయంలో వినియోగదారుడు సంతృప్తి పడినప్పుడే పెట్రోలు నుంచి మరో ఇంధనానికి మారే అవకాశముంటుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ఇ-20 పెట్రోల్ వాడకంలో విజయవంతమైతే పర్యావరణ రక్షణ, ఇంధన భద్రత, గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం జరుగుతుందన్న కేంద్రప్రభుత్వం లక్ష్యం నెరవేరినట్లే. అందుకే 2025- 26 నాటికే ఇ-20 ఇథనాల్ మిశ్రమ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న సంకల్పంతో కేంద్రప్రభుత్వం ముంద డుగు వేస్తోంది. భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతులు చేసుకుంటోంది. కొత్త అన్వేషణతో రూపొందిన పెట్రోలు కావడం వల్ల సాలీనా రూ.30వేల కోట్లు విదేశీమారక ద్రవ్యం ఆదా అయ్యే అవకాశముందని అంచనాలున్నాయి. కానీ ఆదిలోనే తలెత్తిన అనుమానా లతో ఇ-20 వాడకం పూర్తిస్థాయిలో వినియోగానికి ఏర్పాట్లు చేసుకోలేకపోతోంది. దేశీయంగా ఇథనాల్ డిస్టిలరీల ఏర్పాటుతో పారిశ్రామిక ప్రగతిసాధ్యమై గ్రామాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. ఇ-20 ప్రభావాన్ని మదింపు చేసేవిషయంలో ఇథనాల్ ఉత్పత్తికి ఇప్పుడున్న వ్యవసాయఉత్పత్తులు సరిపోతాయి. బయో ఫ్యూయెల్ కంపెనీలకు మంచి ధర గిట్టుబాటవుతుంది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం కాగలదు. ఇథనాల్ కాలినప్పుడు వచ్చే కార్బన్ ఉద్గారాలు బహుతక్కువే. ఇథనాల్ క్యాలరీ విలువ పెట్రోల్ కంటే తక్కువ. ఇథనాల్ వాడితే 6శాతం నుంచి 8శాతం వరకు తగ్గుతుందని ఆటోమొబైల్ నిపుణుల అంచనా. ఇథనాల్ తేమను పీల్చుకుంటుంది. కావున ఇంజిన్ తుప్పుపట్టే అవకాశంతో కాలం మన్నిక తగ్గుతుంది. ఇథనాల్ ఉత్పత్తికి నీరు కావాలి. ఒక లీటర్ ఇథనాల్‌కు రెండువేల లీటర్ల తీరు వృథా అని నిపుణులు అంటున్నారు. వాహన మైలేజీ తగ్గుతుంది. పైగా పశ్చిమాసియా యుద్ధ తరుణంలో పెట్రోలు ధర పెంచలేదంటే దానికి ఇథనాల్ మిశ్రమం తోడవడం వల్లనేనని కేంద్రం ప్రత్యేకంగా వివరిస్తోంది. కాగా కనుక ఈ-20 ధర సాధారణ పెట్రోల్ ధర తగ్గించగలిగితే ప్రభుత్వ విధానానికి వాహనదారులు జై కొడతారు. ఈ వివాదం ఎంత త్వరగా పరిష్కారమైతే అంత మంచిది.

అన్నీ మన మేలుకోసమే అని తలిస్తే, ఎలాంటి క్లిష్టపరిస్థితి కూడా మనసును కలత పెట్టలేదు.



జెఫర్సన్

తన కోపాన్ని అదుపులో పెట్టుకోలేనివాడు తన మనస్సును, శరీరాన్ని కూడా అదుపు చేయలేడు.



బైరన్

# ఇంకెన్నాళ్లీ కంచి గరుడసేవ?

**అధికారంలో ఉన్నప్పుడు సకల సౌకర్యాలు అనుభవించి ఆర్థికంగా స్థిరపడి,అధికారం కోల్పోగానే అంతవరకు తాము విమర్శించిన, వ్యతిరేకించిన పార్టీలోకి దూకేది కార్యకర్తలు కాదు. నాయకులే. పేర్లు రాసి వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకుకానీ, వారెవరో? వారి చరిత్ర ఏమిటో? ప్రజలకు తెలియంది కాదు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలనేతలు మనసుపెట్టి ఆలోచించాలి. పార్టీనే నమ్ముకుని కార్యకర్తలుగా ఏళ్లతరబడి జెండాలు మోస్తూ పార్టీకి, ప్రజలకు సేవ చేస్తున్న కార్యకర్తలను విస్మరించడం ఏ కోణంలో చూసినా ధర్మంకాదు. కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నామినేటెడ్ పదవులకు కూడా కప్పదాట్లకు పాల్పడినవారినో, వారివారసులనో అందలమెక్కిస్తే నిజమైన కార్యకర్తల పరిస్థితిఎలా ఉంటుందో ఆలోచించాలి. కార్యకర్తల్లోనిరాశా నిస్పృహాలు పెరిగి దూరమైతే పార్టీ పరిస్థితి ఏమవుతుందో పెద్దలకు తెలియందికాదు. కార్యకర్తలు లేనిపార్టీ పునాదులు లేని భవనాల్లాగా ఎప్పటికైనా కూలిపోయి కనుమరుగుకాక తప్పదు.**

దామెర్ల సాయిబాబ

'కూడు గుడ్డ అడక్కపోతే బిడ్డను సాకినట్లు సాకుతాం' అన్నట్టుగా ఉంది కార్యకర్తల పట్ల రాజకీయ పార్టీల వైఖరి. ధర్నాలంటారు, రాస్తారోకోలంటారు, పార్టీ సమావేశాలంటారు, కార్యకర్తల మీటింగ్ లంటారు, శిక్షణా తరగతులంటారు, పార్టీ విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలంటారు, బహిరంగ సభలకుజనాన్ని తరలించుకురావాలంటారు. ఇప్పుడు కొత్తగా ఓట్ల పరిశీలన, నమోదు తదితర కార్యక్రమాలను అప్పగించారు. ఇలా ఒక్క టేమిటి యేడాది పొడుగునా ఏదో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూనే ఉంటారు. పైకి ఏమనలేక పోయినా జీతభత్యం లేని ఈ కంచిగరుడ సేవ ఇంకెన్నాళ్ల నుకునేవారి సంఖ్య ఎక్కువైపోతున్నది. ముఖ్యంగా దిగువ శ్రేణి నాయకులకు ఆర్థికభారం ఎలా భరించాలన్నదే సమస్యగా పరిణమిస్తున్నది. కొందరు కార్యకర్తలు ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. అయినా ఏనాటికైనా తమ సేవలనుగుర్తించకపోతారా? ఏదో పదవి రాకుండాపోతుందా? అనే ఆశతో కొందరు ఈ రాజకీయ యజ్ఞంలో పోరాటం చేస్తూనే ఉన్నారు. గతంలో కొందరు కార్యకర్తలకు చిన్న చితక కాంట్రాక్టులు దక్కేవి. కొంతలో కొంత ఖర్చులను పూడ్చుకునేవారు. ఇప్పుడా పరిస్థితులు లేవు. ఉన్నత స్థాయిలోనే పర్సెంటేజిలు నిర్ణయమైపోతున్నాయి. ఇలా రాజకీయ కార్యకర్తలుగా జీవనం ప్రారంభించిన వారెందరో సర్పంచులుగా, సమితి అధ్యక్షులుగా, ఎమ్మెల్యేలుగా, పార్ల మెంటు సభ్యులుగా, కేంద్ర మంత్రులుగా, ముఖ్యమంత్రు లుగా ఎదిగారు. కాంగ్రెస్ పార్టీ విడిపోయి ఇందిరా కాంగ్రెస్ ఏర్పడినప్పుడు కార్యకర్తలే నాయకత్వం వహించి పెద్దపెద్ద పదవులను అధిష్టించారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో నూతన నాయకులు పుట్టుకొచ్చారు. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ ఆనాడు వెనుకబడిన తరగతుల వర్గాల నుంచి ఎందరినో నాయకులుగా తీర్చిదిద్దింది. అలా నాయ కులుగా ఎదిగినవారెందరో అటు పాలనలోనూ, ఇటు ప్రజాభిమానం పొందడంలోనూ గుర్తింపు కలిగిన స్థానం సంపాదించుకోగలిగారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఎందరో కార్యకర్తలు రాష్ట్రం వచ్చిన తర్వాత మంత్రులుగా, పార్లమెంటు సభ్యులుగా ఎదగడమే కాదు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి ప్రజల హృదయాల్లో చోటు సంపా దించుకున్నారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని కొందరు కార్యకర్తలు ఏళ్ల తరబడి జెండాలు మోస్తూ నాయ కత్వం ఇచ్చిన ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటిస్తూ అవిరామంగా కృషిచేస్తున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు తమ సేవను గుర్తించకపోతారా? అవకాశం ఉన్నప్పుడు నామినేటెడ్ పదవుల్లో తమ తమ స్థాయిని బట్టి నియమించకపోతారా? అనేదే వారి ఆశ, ఆరాటం. కానీ పరిస్థితులు మారిపోయాయి. దాదాపు అన్ని పార్టీల్లోనూ క్షేత్రస్థాయిలో అహర్నిశలు పనిచేస్తున్న కార్యకర్తలను విస్మరి స్తున్నారేమోననిపిస్తున్నది. పార్టీల పరంగా సిద్ధాంతాలు, కొన్ని మార్గదర్శకాలను రూపొందిస్తున్నా అందులో తమకు ఎలా లాభం, అవకాశాలు దక్కించుకోవాలనేఆరాటం అధికశాతం నేతల్లో కన్పిస్తున్నది. అందుకే యువతకుప్రాధాన్యత అంటే తమ కుమారులనో, అల్లుళ్లనో కొందరు నేతలు ముందు పెడుతున్నారు. మహిళలు అంటే కుమార్తెలనో, భార్యల పేర్లనో చెబుతున్నారు. రానురాను రాజకీయ వారసులు ఎక్కువైపోతున్నారు. చివరకు సర్పంచ్ పదవులను కూడా వదిలిపెట్టడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య కార్యకర్తలకు భవిష్యత్‌లో కూడా కనుచూపుమేరలో అవకాశాలు, పెద్దపెద్ద పదవుల సంగతి దేవుడెరుగు.వార్డుమెంబర్లు లాంటి చిన్న పదవులకు కూడా ఈ సంప్రదాయం విస్తరిస్తున్నది. కార్యకర్తలందరికి పదవులు ఇవ్వడం అనేది సాధ్యమయ్యేపనికాదనేది వాస్తవం కావొచ్చు. కానీ కార్యకర్తలను పట్టించుకోకపోవడం ఇటీవల కాలంలో పెరిగిపోతుండడం దురదృష్టకరం. అసలు ప్రజాసేవ, ప్రజాభిమానం వంటి కొలమానంతో పదవులు ఎంపిక చేసే రోజులకు కాలం చెల్లిపోయింది. దాదాపు ప్రతిపార్టీ కూడా గెలుపు గుర్రాలకోసమే అన్వేషిస్తున్నారు. ఆర్థిక స్తోమత ఉందా? ఖర్చు పెట్టగలిగే శక్తిఉందా? కుల బలం ఏమిటి? ఏ నాయకుడికి తోకగా, బకాగా వ్యవహరిస్తున్నారని చూస్తున్నారే తప్ప ప్రజలకు, పార్టీకి అంకితభావంతో పనిచేసే వారిని పట్టించుకునే రోజులు పోయాయి. రాజకీయమే ఒక ఖరీదైన వ్యాపారంగా రూపుదాల్చింది. పెట్టుబడులు పెట్టడం,ఎన్నికల్లో గెలవడం, తిరిగి రాబట్టుకోవడం, మళ్లీ పెట్టుబడి ఇలా ఒక విషవలయంగా మారి ఆర్థిక, అంగబలం ఉన్నవారే ఈ విషవలయంలోకి ప్రవేశించగలుగుతున్నారు. సామాన్యులెవరూ ఆ వైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయలేకపోతున్నారు. ప్రజలతో సంబంధం లేనివారు నేరుగా మంత్రులైపోతున్నారు. ఇక్కడా, అక్కడా అని కాదు. దేశవ్యాప్తంగా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. సర్పంచ్ పదవి కూడా లక్షలాది రూపాయల డబ్బు, మద్యం వెచ్చించాల్సిన దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. కానీ ఈ సంప్రదాయం రానురాను శృతిమించిపోతున్నది. రాత్రికి రాత్రి పార్టీలు మార్చే దుస్సంప్రదాయం కూడా విస్తరిస్తున్నది. ప్రత్యర్థి పార్టీలో ఉండి విమర్శలు కురిపించి తెల్లవారేసరికి పార్టీ మార్చి అధికారం వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రజాసేవ కోసమే తాము అధికార పార్టీలోకి మారుతున్నట్లు చెప్పుకుంటున్నారు. ఇలా నేతలు పార్టీలు మారినపుడు కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. వారితోపాటు పార్టీ మారితే కొత్త పార్టీలో అక్కడ ఉన్న కార్యకర్తలతో ఇబ్బందులు. ఇక్కడ ఉంటే కొత్త నాయకునితో మరోరకం కష్టాలు. ఈ శిక్షణలు, సిద్ధాంతాలు, మానిఫెస్టోలు ఎందుకు అనే అనుమానాలు రాక తప్పదు. ఒకవేళ పార్టీ సిద్ధాంతాలను, క్రమశిక్షణ, ప్రజాసేవల గురించి శిక్షణ ఇవ్వాల్సి వస్తే ముందుగా పదవులు వెలగబెడుతూ పార్టీ పరువు, ప్రతిష్టను బజారున పెడుతున్న పెద్దలకు ఇవ్వాలి. పార్టీలోనే ఉంటూ గోతులు తవ్వే నాయకులకు ఇవ్వాలి. కేవలం అధికారం కోసం కప్పదాట్లకు సిద్ధపడే నేతలకు ఇవ్వాలి. ఎన్ని శిక్షణలు ఇచ్చినా, ఎన్ని నిబంధనలు పెట్టుకున్నా పాటించే వారే లేకుండా పోతున్నారు. దశాబ్దాల పాటు రాజకీయాల్లో ఉండి ప్రజాభిమానం చూరగొని పార్టీ ద్వారా పదవులు, అనుభవించి లక్ష్మీపుత్రులుగా మారిన వారు కూడా కప్పదాట్లకు పాల్పడుతుండడం అత్యంత దురదృష్టకరం. ఇక క్రమశిక్షణ అన్నది చాలా పార్టీలు ఏనాడో మరచిపోయాయి. పార్టీకి నష్టం తెచ్చేవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా మనవాడే కదా అని సర్దుకుపోతే మళ్లీ మళ్లీ ఇలాగే జరుగుతుంటుంటాయి. ప్రజల దృష్టిలో పార్టీ చులకన అవుతుంది. ఇంటి దీపం అనిముద్దు పెట్టుకుంటే మూతి కాలక తప్పదనే విషయాన్ని విస్మరించకూడదు. క్రమశిక్షణలో విఫలమై, ప్రజలకు దూరమైన పార్టీల నేతలు ఎందరో ఉన్నారు. ప్రజల్లో ఎంతో చైతన్యం వచ్చింది. ప్రతి నాయకుడి కదలికలను, ప్రవర్తన చర్యలను ప్రజలు వెయ్యి కళ్లతో గమనిస్తున్నారు. ముఖ్యంగా కష్టం కలిగినప్పుడు పార్టీని వదిలివెళ్లి, ఇష్టం వచ్చినప్పుడు తిరిగి రావొచ్చనే దుస్సంప్రదాయానికి అడ్డుకట్ట వేయాలి. అధికారంలో ఉన్నప్పుడు సకల సౌకర్యాలు అనుభవించి ఆర్థికంగా స్థిరపడి, అధికారం కోల్పోగానే అంతవరకు తాము విమర్శించిన, వ్యతిరేకించిన పార్టీలోకి దూకేది కార్యకర్తలు కాదు. నాయకులే. పేర్లు రాసి వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకు కానీ,వారెవరో? వారి చరిత్ర ఏమిటో? ప్రజలకు తెలియంది కాదు. ఇప్పటికైనా రాజకీయ పార్టీల నేతలు మనసుపెట్టి ఆలోచించాలి. పార్టీనే నమ్ముకుని కార్యకర్తలుగా ఏళ్లతరబడి జెండాలు మోస్తూ పార్టీకి, ప్రజలకు సేవ చేస్తున్న కార్యకర్తలను విస్మరించడం ఏ కోణంలో చూసినా ధర్మం కాదు. కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి. నామినేటెడ్ పదవులకు కూడా కప్పదాట్లకు పాల్పడినవారినో, వారివారసులనో అందలం ఎక్కిస్తే నిజమైన కార్యకర్తల పరిస్థితిఎలా ఉంటుందో ఆలోచించాలి. కార్యకర్తల్లో నిరాశానిస్పృహాలు పెరిగి దూరమైతే పార్టీ పరిస్థితి ఏమవుతుందో పెద్దలకు తెలియంది కాదు. కార్యకర్తలు లేనిపార్టీ పునాదులు లేని భవనాల్లాగా ఎప్పటికైనా కూలిపోయి కనుమరుగుకాక తప్పదు.

## ఒక్క మాట

# నిరసనల నుంచి నిర్మాణాత్మక మార్పు వైపు..

సురేష్ కాలేరు

ప్రజాస్వామ్యంలో నిరసన అనేది బలహీనతకు కాదు, బలానికి చిహ్నం. ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే అత్యంత శాంతియుతమైన ప్రజాస్వామ్య సాధనం అది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన విద్యార్థి సంఘాలు, యువజన వర్గాలు, పౌరసంఘాలు పాల్గొన్న నిరసనలు మరోసారి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. అయితే ఏ నిరసన గురించి మాట్లాడినా వాస్తవాలు, విమర్శలు, రాజకీయ ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలు ఈ నాలుగు కోణాల్లో సమగ్రంగా విశ్లేషించడం అవసరం. విద్యార్థి ఉద్యమాల చరిత్రను పరిశీలిస్తే, దేశ సామాజిక, రాజకీయ పరిణామాల్లో వాటి పాత్ర ఎంతో కీలకమైనది. అవినీతి, నిరుద్యోగం, విద్యావ్యవస్థలో లోపాలు, పరీక్షల పారదర్శకత, అవకాశాల్లో సమానత్వం వంటి అంశాలపై యువత స్వరం వినిపించడం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి సంకేతం. సమాజంలో కనిపిస్తున్న సమస్యలను ప్రశ్నించడం, ప్రభుత్వాలను జవాబుదారీగా నిలబెట్టడం ప్రజల రాజ్యాంగబద్ధ హక్కు. అయితే ప్రతి ఉద్యమం వెనుక ఉన్న సదుద్దేశాన్ని గుర్తించడంతో పాటు, దాని అమలు విధానాన్ని కూడా పరిశీలించాలి. నిరసనలు శాంతియుతంగా, చట్టబద్ధంగా సాగితే ప్రజల మద్దతు లభిస్తుంది. కానీ హింస, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, ప్రజల సాధారణ జీవితానికి ఆటంకం కలిగితే అసలు లక్ష్యం మరుగున పడే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో విభేదాలను వ్యక్తపరచే హక్కు ఉన్నట్లే, ఇతరుల హక్కులను గౌరవించే బాధ్యత కూడా ప్రతి పౌరుడిపై ఉంది. ఇటీవలి ఆందోళనలపై వచ్చి న విమర్శల సారాంశం కూడా ఇదే. కొన్నివర్గాలు ఉద్యమా లను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నాయనే ఆరోపణలు వినిపించాయి. మరోవైపు, ప్రభుత్వం ప్రజల ఆందోళనలను ప్రారంభ దశలోనే సానుకూలంగా స్వీకరించి, పారదర్శక సంభాషణకు అవకాశం కల్పించి ఉంటే ఉద్రిక్తతలు తగ్గేవని కూడా పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో సంభాషణ ఎప్పుడూ ఘర్షణ కంటే శ్రేయస్కరం. దేశ ప్రయోజనాల దృష్ట్యా మరో అంశాన్ని కూడా విస్మరించరాదు. ప్రతి ప్రజా ఉద్యమంలో తమ స్వప్రయోజనాల కోసం చొరబడే అవకాశవాద శక్తులు ఉండే అవకాశం ఉంటుంది. హింసను ప్రోత్సహించడం, విద్వేషాన్ని రెచ్చగొట్టడం, జాతీయ సమగ్రతను దెబ్బతీసే చర్యలకు పాల్పడటం వంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదు. అయితే ఇటువంటి ఆరోపణలు ఎవరిపైనా ఆధారాలు లేకుండా చేయడం కూడా సమంజసం కాదు. దేశ భద్రతను కాపాడటం ఎంతముఖ్యమో, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. విద్యార్థి ఉద్యమాలకు కూడా కొన్ని ఆత్మపరిశీలనలు అవసరం. సమస్యలను మాత్రమే ప్రస్తా వించడం కాకుండా, వాటికి ఆచరణ సాధ్యమైన ప్రత్యా మ్నాయాలను కూడా ప్రతిపాదించాలి. విధానాలపై అధ్య యనం, గణాంకాలతో కూడిన చర్చ, నిపుణులతో సంభా షణ, చట్టబద్ధమైన నిరసన పద్ధతులు ఇవే ఉద్యమాలకు మరింత విశ్వసనీయతను తెస్తాయి.సోషల్ మీడియా ప్రచా రం కంటే ప్రజల విశ్వాసమే ఒక ఉద్యమానికి నిజమైన బలం. ప్రభుత్వం కూడా విమర్శలను శత్రుత్వంగా కాకుం డా ప్రజాభిప్రాయంగా స్వీకరించాలి. యువత ప్రశ్నలను వినాలి. నియామకాలలో పారదర్శకత, విద్యారంగ సంస్కరణలు, ఉపాధి అవకాశాల విస్తరణ,అవినీతిపై కఠిన చర్యలు వంటిఅంశాల్లో వేగంగా స్పందిస్తే అసంతృప్తి తగ్గుతుంది. సమర్థవంతమైన పాలనకు ప్రజల విశ్వాసమే పునాది. దేశానికి ఈరోజు అవసరమైనది కేవలం ఉద్యమాల పరంపర కాదు. సమూల మార్పుకు దారితీసే నిర్మాణాత్మక దృక్పథం. దేశం ముందుకు సాగాలంటే యువత ప్రశ్నించాలి,

# అసమానతల అగాధంలో ఆర్థికాభివృద్ధి!



జీ. శ్రీలత

భారత ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ప్రశంసలు అందుకుంటోంది. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థదిశగా అడుగులు వేస్తున్న దేశంగా అంతర్జాతీయ వేదికలపై భారత్ పేరు మారుమోగుతోంది. స్టాక్ మార్కెట్లు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. కోట్లాది మంది డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు అవుతున్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా కలిగిన దేశంగా భారత్‌ను భవిష్యత్తు శక్తిగా అభివర్ణిస్తున్నారు. అయితే ఈ మెరుపుల వెనుక దాగి ఉన్న మరో చేదు వాస్తవాన్ని 360 వన్ వెల్త్ క్రియేటర్స్ లిస్ట్ 2026 బయటపెట్టింది. దేశంలో కనీసం రూ.425 కోట్లకు పైగా సంపద కలిగిన వారి సంఖ్య కేవలం 3,040 మంది మాత్రమే.కానీ వారి చేతుల్లో ఉన్న మొత్తం సంపద విలువ ఏకంగా రూ. 104 లక్షల కోట్లు. మరోవైపు భారత జనాభా దాదాపు147 కోట్లకు పైగా ఉంది. అంటే కోట్లాది మంది ప్రజలు జీవనోపాధి కోసం పోరాడుతుండగా, అత్యంత స్వల్ప సంఖ్యలో ఉన్న వ్యక్తుల చేతుల్లో అపారమైన సంపద కేంద్రీకృతమవుతోంది. ఈ గణాంకాలను కేవలం ధనవంతుల జాబితాగా మాత్రమే చూడలేం. ఇవి దేశంలోని ఆర్థిక అసమానతఎంత తీవ్రంగా పెరుగుతోందో చెప్పే సంకేతాలు. సంపద సృష్టి అనేది తప్పు కాదు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు దేశ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తారు. వారు పరిశ్రమలు స్థాపిస్తారు, ఉపాధి కల్పిస్తారు, పన్నులు చెల్లిస్తారు, ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తారు. కాబట్టి సంపదను సృష్టించడం లేదా విజయవంతమైన వ్యాపారాలను నిర్మించడం ఎవరూ తప్పుబట్టాల్సిన విషయం కాదు. అయితే సమస్య ఎక్కడ ప్రారంభమవుతుందంటే, దేశ సంపదలో గణనీయమైన భాగం అతి కొద్దిమంది చేతుల్లోనే నిలిచిపోవడం. సంపద సమాజంలో సమతుల్యంగా చలామణి కాకపోతే ఆర్థిక వ్యవస్థలో అసమానతలు మరింత తీవ్రమవుతాయి. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్నివర్గాలకు చేరకపోతే, దేశ వృద్ధి గణాంకాలు ఎంత ఆకర్షణీయంగా కనిపించినా సాధారణ ప్రజల జీవితాల్లో మార్పు కనిపించదు. నివేదికలో మరో ముఖ్యమైన అంశం కూడా ఉంది. అగ్రస్థానంలో ఉన్న 100 కుటుంబాల చేతిలోనే రూ.76.5 లక్షల కోట్ల సంపదఉంది. అందులో సగానికి సమానమైన సంపద కేవలం తొలి పది కుటుంబాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. ఇది సంపద పంపిణీలో ఉన్న తీవ్ర అసమానతను స్పష్టంగాచూపిస్తోంది. ఇటీవలి కాలంలో భారత్‌లో తొలి తరం పారిశ్రామికవేత్తల సంఖ్య పెరగడం, యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం, మహిళల భాగస్వామ్యం పెరగడం వంటి పరిణామాలు సానుకూల సంకేతాలే. కొత్త ఆలోచనలతో వ్యాపా





రాలు ప్రారంభించి సంపద సృష్టిస్తున్న యువత దేశ భవిష్యత్తుకు ఆశాకిరణం. అయితే అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, విద్యా అసమానతలు, ఆరోగ్య సేవల కొరత, పోషకాహార లోపంవంటి సమస్యలు ఇంకా తీవ్రంగానే కొనసాగుతున్నాయి. దేశంలో లక్షలాది మంది యువకులు ఉన్నత విద్య పూర్తి చేసినప్పటికీ తగిన ఉపాధి అవకాశాలు దొరకడం లేదు. అనేక కుటుంబాలు కనీస వైద్య సేవల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. రైతులు ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారు. పట్టణాల్లో జీవన వ్యయం పెరుగుతోంది. గ్రామాల్లోఆదాయ వనరులు పరిమితంగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కొద్ది మంది వద్ద మాత్రమే అపార సంపద పేరుకుపోవడం సహజంగానే సామాజిక చర్చకు దారితీస్తుంది. ఆర్థిక అసమానత పెరిగిన ప్రతి దేశంలో సామాజిక అసంతృప్తి కూడా పెరిగిన ఉదాహరణలు చరిత్రలో ఉన్నాయి.అవకాశాల్లో అసమానత, విద్యలో అసమానత, ఆరోగ్య సేవల్లో అసమానత, ఆదాయంలో అసమానతలు కలిసివస్తే సామాజిక స్థిరత్వంపైనా ప్రభావం చూపే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఈ అంశాన్ని కేవలం రాజకీయ కోణంలో కాకుండా దేశ దీర్ఘకాలిక అభివృద్ధి కోణంలో పరిశీలించాల్సి న అవసరం ఉంది. ప్రభుత్వాల ప్రధాన బాధ్యత కేవలం సంపద సృష్టికి అనుకూల వాతావరణం కల్పించడం మాత్రమే కాదు. ఆ సంపద ఫలాలు సమాజంలోని విభిన్న వర్గాలకు చేరేలా విధానాలు రూపొందించడం కూడా అంతే ముఖ్యమైనది. నాణ్యమైన ప్రభుత్వ విద్య, అందుబాటులో ఆరోగ్య సేవలు, నైపుణ్యాభివృద్ధి, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం, వ్యవసాయానికి విలువ ఆధారిత మార్కెట్లు, గ్రామీణ ఉపాధి, సామాజిక భద్రత వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సి న అవసరం ఉంది. అలాగే పన్నులవ్యవస్థ పారదర్శకంగా ఉండాలి. పన్ను ఎగవేతను కట్టడి చేయాలి. నల్లధనాన్ని నిరోధించాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఆర్థిక సహకారం పెంచాలి. యువతకు స్టార్టప్ అవకాశాలు విస్తరించాలి. ప్రాంతీయ అసమానతలను తగ్గించే పెట్టుబడులను ప్రోత్సహించాలి. ఈ చర్యల ద్వారా మాత్రమే సంపద మరింత విస్తృతంగా సమాజంలో చలామణి అవుతుంది. భారత్‌లో ఆర్థిక సంస్కరణలు కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలో ప్రారంభమయ్యాయి. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు కూడా వాటిని కొనసాగించాయి. వివిధ రాజకీయ పార్టీల పాలనలో ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదిగినప్పటికీ, అదే సమయంలో సంపద కేంద్రీకరణ కూడా పెరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందువల్ల ఇది ఒక్క పార్టీకి సంబంధించిన అంశం కాదు. దీర్ఘకాలిక విధానాల ప్రభావాన్ని సమీక్షించాల్సి న జాతీయ అంశం. ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన ఆర్థిక వ్యవస్థ లు పెట్టుబడులను ప్రోత్సహించడంతో పాటు సామాజిక భద్రతను కూడా బలోపేతం చేశాయి. అభివృద్ధి, సమాన అవకాశాలు రెండూ కలిసే ముందుకు నడిచినప్పుడు మాత్రమే సమాజంలో స్థిరత్వం ఏర్పడుతుంది. భారతదేశంకూడా అదే సమతుల్యతను సాధించాల్సి న అవసరం ఉంది.సంపద సృష్టిదేశానికి అవసరం. కానీ ఆసంపద సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి దోహదపడితేనే అది నిజమైన అభివృద్ధి అవుతుంది. కొద్దిమంది సంపన్నుల విజయగాథలతో పాటు కోట్లాది సామాన్య కుటుంబాల జీవితాల్లో కూడా ఆశాకిరణం కనిపించినప్పుడే భారత అభివృది పూర్తి అవుతుంది.లేకపోతే ఆర్థికవృద్ధి గణాంకాలు పెరిగినా,సామాజిక అసమానతలుదేశ

# ప్రజావాక్కు



### పోస్టులు, వయసు పెంచాలి

**తెలంగాణ** ప్రభుత్వ పోలీస్ ఉద్యోగాలలో ఖాళీల సంఖ్య పెంచుతూ వయస్సు కూడాపెంచాలి. పోలీస్ డిపార్ట్మెంట్‌లో జనరల్‌గా ఎస్సై వయస్సు38కానిస్టేబుల్ వయస్సు 35 ఉండే ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎస్సై 35 కానిస్టేబుల్ 32 ఇవ్వడం జరిగింది. దీనిని మూడు సంవత్సరాలుపెంచాలి.దాదాపు మూడు సంవత్సరముల కాలయాపన వల్ల నోటిఫికేషన్ లేకపోవడంతో కొంత మంది అభ్యర్థుల వయస్సు పెరిగింది దానిపైనే దృష్టి సారించిన విద్యార్థులు అయోమయంలో పడ్డారు.దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ పోలీస్ అభ్యర్థుల వయస్సు పెంచాలని కోరుతూ అదే విధంగా పోస్టుల సంఖ్య పెంచాలి. రుణాత్మక మార్కులు తగ్గించి దానికి సరిపడా కటాఫ్ మార్కులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలియపరుస్తూ ఉద్యోగ నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

### ఇ ఫైలింగ్ గడువు పెంచాలి

**తెలంగాణ** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇన్కమ్ టాక్స్ ఇ ఫైలింగ్గడువు తేదీని పొడగించాలి. ఆధార్, ఫాన్ కార్డ్, స్పెలింగ్ మిస్టేక్‌లు ఈ కెవైసి,ఆధార్ లింకేజి వంటి సమస్యలు, మీ సేవా టైమింగ్, సర్వర్ బిజీ, వంటి సమస్యలు ఉన్నాయి. వికలాంగులు చాలా ఇబ్బంది పడుతున్నారు. సెలవులు దొరకడం లేదు. ఆఫీస్‌ల చుట్టూ తిరగడం జరుగుతుంది. చాలా ఇబ్బందిగా మానసిక సమస్యగా ఉంటుంది. కనుక ప్రభుత్వం ఇఫైలింగ్ గడువు తేదీ జులై 31కి బదులుగా డిసెంబర్ 31 వరకు పొడగించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### ఆర్థిక వ్యవస్థకు పునాది

**పర్యాటక** రంగంకేవలం వినోదసాధనం మాత్రమే కాదు, అది ఆర్థికవ్యవస్థకు ఊపిరిపోసే శక్తివంతమైన యంత్రం. భారతదేశం పర్వతాలు,అరణ్యాలు, తీరప్రాంతాలు, చారిత్రక కట్టడాల వంటి అపారమైన వైవిధ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ,మౌలిక సదుపాయాల లోపం, కనెక్టివిటీ సమస్యలవల్ల పర్యాటక రంగం తన పూర్తిసామర్థ్యాన్ని అందుకోలేకపోతోంది. కేవలం హోటళ్లు నిర్మించడమే కాకుండా, మెరుగైన రవాణా, పారిశుద్ధం,భద్రత డిజిటల్ మార్కెటింగ్ సదుపాయాలను కల్పించినప్పుడే అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించగలం.

- కె.రామారావు, నల్గొండజిల్లా

### జెన్‌జీ ఉద్యమం

**జెంజీ** ఉద్యమం ఒక ఆశ రేఖఎందుకంటే ప్రతిపక్షం చేయలేని పని అది చేసింది కాబట్టి. అయితే ఉద్యమ జ్వాలలు ఇప్పుడే మొదలు కాలేదు. జీగ్నేష్‌మేవాని నుండి కొనసాగుతున్నాయి. అయితే ప్రజల నిరసన ఉన్నత స్థాయికి చేరింది. ఆ పర్యావసనాలు నేడు జెంజి ఉద్యమంలో కనపడ్డాయి. అయితే ఇంతటితో జెంజి ఉద్యమ జ్వాలలు ఆగిపోకూడదు. ఎందుకంటే దేశంలో రాజకీయ పార్టీల మీద నమ్మకం ఈ యువత కోల్పోయింది. ఈ పర్యావసనలు కూడా మోడీని ఎత్తుకున్న మధ్యతరగతి ప్రజలు ఈ ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనడం చూడొచ్చు. అందుకే ప్రభుత్వం పరిస్థితి చెయ్యిదాటి పోనియకుండా ప్రధాన్ రాజీనామాతో ముందుకు వచ్చింది. అయితే ప్రధాన్ రాజీనామాతో ఈ వ్యవహారం ముగిసిపోలేదు. విద్యార్థులకు పారదర్శకమైన పరీక్ష విధానం అమలు అవుతుంది అని. నమ్మకం కలిగించడం ముఖ్యం అప్పుడే ఈ జ్వాలాలు ఏమైనా తగ్గే అవకాశం ఉంది.

- భారత అవినాష్, జనగామ

### మత భావజాలం

**హిందుస్థాన్**, పాకిస్థాన్, కిజికిస్థాన్, ఉజిబెకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ ఇవన్నీ ఒకానొక కాలంలో ఒకే ప్రదేశం. పాకిస్థాన్ అంటే పవిత్రమైన స్థలం అనిఅర్థం. పాపం ప్రజలు మూర్ఖపు భావజాలంతో మిగతా మనుషులను అసహ్యించుకొని చంపాలి చావాలి అనే భావజాలంతో పేదరికంతో చచ్చిపోతున్నారు. హిందుస్థాన్‌లో ముక్కోటి దేవతలు ఉండేవారు.నిజంగా హిందువులు దేవతలు దేవుళ్లే ప్రతి హిందువు ఒక దేవుడు ఒక దేవత.నాకు ఒక కోరిక భగవంతుడు కనిపిస్తేకోరుతాను. కుల వృత్తులు నశించాయి.మత భావజాలం మతమోఢ్యం నశించాలి. రిజర్వేషన్లు లేని రోజులు ప్రభుత్వ రంగంలో రావాలి. డేరా బాబాలు,కపట సన్యాసులు వాళ్ళ ఆశ్రమాలను ప్రభుత్వాలకు అప్పజెప్పిపాకీపని చేయాలి.అది పవిత్రమైన పనిగా వారుభావించేలాంటిసద్బుద్ధివారికిభగవంతుడు ప్రసాదించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### మనిషి నడవడం అలవర్చుకోవాలి

**మనిషి** కనీసం రోజుకు రెండు నుండి మూడు మైళ్ళ దూరం నడిస్తేనే నిజ జీవితంతోపాటు భవిష్యత్ జీవితంలో ఆయురారోగ్యాలతో జీవించవచ్చు.నేడు అధునాతన సాంకేతికత వాహనాలు కలిగి ఉండడం వలనమనిషి అసలు రోజుకు కిలోమీటరు అయిన నడవలేకపోతున్నాడు. కావున వీలైనంత వరకు నడవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

1-8Pg6exHMNWJQE.qxd:1-8Pg6exHMNWJQE.qxd 1/1/02 6:16 AM Page 1



# దోషులను కఠినంగా శిక్షిస్తాం

## మహిళా ఎస్ఐపై దాడిని ఖండించిన మంత్రి లోకేశ్

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళా ఎస్ఐపై దాడి ఘటనను రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. 'ఎక్స్' వేదికగా ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. శ్రీకాకుళంలో విధుల్లో ఉన్న మహిళా ఎస్ఐపై వైఎస్సార్సీపీ నాయకులు ప్రవర్తించిన తీరు ఆక్షేపణీయమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మహిళల భద్రత, గౌరవంతో చెలగాట మాడితే అస్సలు సహించేది లేదని స్పష్టం చేశారు. మహిళలను అవమానించి రాక్షస ఆనందం పొందడం వైఎస్సార్సీపీ డిఎన్ఏలోనే ఉందని లోకేశ్ దుయ్యబట్టారు. సొంత తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసిన చరిత్ర జగన్ రెడ్డిదని విమర్శించారు. సమాజంలో కనిపించిన ప్రతి మహిళను అవమానించడం వైఎస్సార్సీపీ నాయకుల సంస్కృతిగా మారిందని ధ్వజమెత్తారు. విధుల్లో ఉన్న మహిళా అధికారిపై దురుసుగా ప్రవర్తించిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని లోకేశ్ తేల్చి చెప్పారు. మహిళా అధికారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిని కూటమి ప్రభుత్వం ఎంతమాత్రం సహించబోదన్నారు. వైఎస్సార్సీపీ నేతల వ్యవహారశైలి సభ్య సమాజం తలదించుకునేలా ఉందని విమర్శించారు. అధికారం కోల్పోయినా ఆ పార్టీ నాయకుల్లో అహంకారం, రౌడీయిజం ఏమాత్రం తగ్గలేదని ఈ ఘటనతో మరోసారి రుజువైందని మండిపడ్డారు. నేరం చేసిన వారిని పరామర్శించడానికి వచ్చి, నేరాలను నియంత్రించే పోలీసులపై దాడులకు పాల్పడటం విడ్డూరంగా ఉందన్నారు.

# ఎంబిబిఎస్, బిడిఎస్ ప్రవేశాల్లో మార్పులు

## ప్రతి దశలో వెబ్ ఆప్షన్లకు అవకాశం

**విజయవాడ, జులై 31 ప్రభాతవవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల ప్రవేశాల కౌన్సెలింగ్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న అన్ని సీట్లకూ కలిపి 'ఒకేసారి వెబ్ ఆప్షన్ల' ఇచ్చుకునే విధానాన్ని రద్దు చేసింది. ప్రతి దశకు ముందు కొత్త ఆప్షన్లు ఇచ్చుకునేలా నిబంధనలు సవరించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై అభ్యర్థులు ప్రతి కౌన్సెలింగ్ దశ ప్రారంభానికి ముందు తమకు నచ్చిన కళాశాలల్లోని ఎంబిబిఎస్, బిడిఎస్ సీట్లకు కొత్తగా ఆప్షన్లు ఎంపికచేసుకోవచ్చు. స్లైడింగ్ విధానం ఎన్ఎంసి నిబంధనల ప్రకారం ఉంటుంది. ఒకవేళ అభ్యర్థికి కేటాయించిన కళాశాలలో సీటు పొందకపోతే... వారు తర్వాత దశ కౌన్సెలింగ్‌లో అదే కళాశాలను మరోసారి ఎంచుకునేందుకు వీలుండదు. సవరించిన నిబంధనల ఆధారంగా కౌన్సెలింగ్‌కు సంబంధించిన సమగ్ర విధివిధానాల షెడ్యూలును త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.

# జాతీయ వాదానికి సంస్కృతమే ఊతం

- ఆగస్టు 25 నుండి సంస్కృత సప్తాహ వారోత్సవాలు
- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ విల్సన్‌శరత్ చంద్ర

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** సంస్కృతం పండితుల భాషగా ప్రజల్లో నానుడి ఉండిని దాన్ని చెరిపి వేసి సామాన్యులకు సంస్కృత భాష చేర్చే కార్యాచరణ అకాడమీ చేపడుతుందని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర అన్నారు. వడ్లెక్కరులోని తెలుగు, సంస్కృత అకాడమీ కార్యాలయంలో శుక్రవారం అకాడమీ సిబ్బంది, సంస్కృత పండితులతో కలిసి ప్రాతినిధ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సంస్కృత అకాడమీ ఏర్పాటు తర్వాత ఏ ప్రభుత్వం కూడా నిధులు కేటాయించలేదని, సంస్కృత భాష వ్యాప్తికి నిధులు అవసరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయిస్తే తప్పా సంస్కృత భాషాభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. హైదరాబాద్‌లో ఉన్నట్టు ఆంధ్రప్రదేశ్‌లో వున్న సంస్కృత అకాడమీ అభివృద్ధికి నిధులు కేటాయించమని కోరుతూ ఆగస్టు 3, 4, 5 తేదీల్లో ఢిల్లీలోని కేంద్ర సంస్కృత యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ వరకేదిని, భారతీయ భాష సమితి చైర్మన్ కృష్ణస్వామిని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద జోషిని సంప్రదిస్తున్నట్టు తెలియచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగే సంస్కృత సప్తాహం కార్యక్రమ వివరాలు తెలియచేశారు.

# తిరుమల సమాచారం



## తిరుమలలో భారీగా పెరిగిన భక్తులు

- స్వామివారి దర్శనానికి 24గంటలు

**తిరుమల, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** సాధారణ రోజుల్లోనూ తిరుమలలో భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. గత వారం రోజుల నుండి తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ కనిపిస్తోంది. సామాన్య భక్తులు తిరుమలలో స్వామివారి దర్శనానికి 24గంటలుపాటు నిరీక్షించాల్సిన అవసరం ఏర్పడింది. తిరుమలకు చేరుకున్న భక్తులకు నిజంగా క్యూలైన్లలోనే దేవుడు కనిపిస్తున్నాడని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టోకెన్లులేని భక్తులను కృష్ణతేజ కాటేజీల వద్ద నుండి క్యూలైన్లలోనికి అనుమతినిస్తున్నారు. కంపార్టు మెంట్లలోనికి చేరుకున్న భక్తులకు 16గంటలు సమయం పడు తుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. స్వామివారిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. సర్వదర్శనం కోసం భక్తులు బారులు తీరారు. వైకుంఠం-2లో 32 కంపార్టు మెంట్లలో నిండిపోయి సర్వదర్శనానికి భక్తులు బాటగంగమ్మ ఆలయం వరకు రోడ్డుపై బారులు తీరారు. సర్వదర్శనానికి 24గంటలు సమయం పడుతోంది. తిరుమలలో వున్న భక్తులకు క్యూలైన్లలో అన్నప్రసాదాలు, టీ, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 43వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.

## సెప్టెంబర్ 15 నుండి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

**తిరుమల, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది రెండు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. భక్తులను ఆధ్యాత్మిక ఆనందంలో పరవశింప చేయనున్నాయి. సెప్టెంబర్ 15 నుండి 23వ తేదీ వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 12 నుండి 20 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం 8 నుండి 10 గంటల వరకు ,సాయంత్రం 7 గంటల నుండి 9 గంటల వాహన సేవలు ఉంటాయి.

## తిరుమలలో భక్తురాలు మెడలో చైన్ స్నాచింగ్

**తిరుమల, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు కాలినడకన వచ్చే చంద్రగిరి శ్రీనివాస మంగాపురం శ్రీవారి మెట్లమార్గంలో ఓ యాత్రికురాలి మెడలో బంగారు గొలుసు దొంగతనం జరిగింది. సంఘటన జరిగిన వెంటనే బాధితురాలి ఫిర్యాదుతో తిరుమల పోలీసులు అప్రమత్తమయ్యారు. గంటల వ్యవధిలోని నిందితున్ని అరెస్టు చేశారు. తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరుకు చెందిన సురేష్ కుమార్ ఈ చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. శ్రీవారి మెట్ల మార్గంలో నిందితుని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

## తిరుపతిలో అక్రమాలను అడ్డుకునే మేయర్ కావాలి

**తిరుపతి, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ ప్రసిద్ధ గాంచిన ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలు, రౌడీయిజం, డ్రగ్స్ మాఫియాపై కఠినచర్యలు తీసుకునే ధైర్యవంతమైన మేయర్ అవసరమని చైతన్య వేదిక కన్వీనర్ డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి వంటి పవిత్ర నగరానికి అభ్యర్థులను ఎంపికచేసే విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సేవకు అంకితభావం, నిజాయితీ, నేరచరిత్ర లేని వ్యక్తిత్వం, పరిపాలనా సామర్థ్యం కలిగిన ప్రజా నాయకులకే టికెట్లు ఇవ్వాలని కోరారు.

# 750 విద్యుత్ బస్సులు వస్తున్నాయ్!

- ఆగస్ట్ 17 నుంచి దశల వారీగా ప్రవేశ పెడతాం
- 'స్త్రీ శక్తి' పథకం రద్దీ తట్టుకునేందుకు అదనంగా 500 సిఎన్‌జి బస్సులు కొనుగోలు
- ఆర్టీసి ఎండి బాలసుబ్రహ్మణ్యం
- విజయవాడలో జెఏసి నాయకులతో సమావేశం



**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసీలో విద్యుత్ బస్సులు ప్రవేశ పెట్టడం వల్ల వచ్చే సమస్యలు, ఇబ్బందులు అధిగమించేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తామని ఆ సంస్థ ఎండి బాలసుబ్రహ్మణ్యం ప్రకటించారు. ఉద్యోగ సంఘాల జెఏసి ప్రతినిధులు లేవనెత్తిన అంశాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం మూసివేసిన డిపోల్లో నుంచి ఇతర డిపోల్లోకి సర్దుబాటు చేసిన సిబ్బందిని అవి తెరిచిన తర్వాత తిరిగి తీసుకొస్తామని ఎండి తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది సహనం, ఓపికతో సేవలు అందిస్తుంటారని అలాంటి వారిపై దాడులు చేయడం ఏ మాత్రం సరికాదని దాడులు చేసే వారిపై కేసులు పెట్టాలని, ఛార్జిషీట్ దాఖలు చేయాలని డిజిపి, జిల్లా ఎస్పీల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అలాగే ఖాళీల భర్తీ అంశంపైనా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రెండు వారాల్లో ప్రకటిస్తామని ఎండి చెప్పారు. విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణ సహా వివిధ సమస్యలు పరిష్కరించాలంటూ ఆర్టీసీ ఉద్యోగులు రెండు నెలలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన క్రమంలో ఆర్టీసీ యాజమాన్యం స్పందించింది. సంస్థ ఎండి బాలసుబ్రహ్మణ్యం విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో జెఏసి నాయకులతో సమావేశమయ్యారు. చర్చలు మూడున్నర గంటలసేపు సుదీర్ఘంగా సాగాయి. సమావేశం తర్వాత ఎండి, జెఏసి ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. 90శాతం అంశాలపై సానుకూల స్పష్టత వచ్చిందని, విద్యుత్ బస్సుల కొనుగోలు, నిర్వహణకు సంబంధించిన ఇబ్బందులు, సమస్యలపై ముఖ్యమంత్రి, ఐటి, రవాణా మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని ఎండి చెప్పారని జెఏసి ప్రతినిధులు తెలిపారు. విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, మంగళం డిపోలలో విధిగ మరమ్మత్తు పనులు జరుగుతున్నాయని, పూర్తయిన తర్వాత విద్యుత్ బస్సులతోపాటు సాధారణ బస్సులు కూడా నడుపుతామని హామీ ఇచ్చారన్నారు. 750 విద్యుత్ బస్సులు ఆగస్ట్ 17 నుంచి ఈ ఏడాది చివరి నాటికి దశల వారీగా సంస్థలో ప్రవేశ పెడతామని, అలాగే స్త్రీ శక్తి పథకం రద్దీ తట్టుకునేందుకు అదనంగా 500 సిఎన్‌జి బస్సులు కూడా కొనుగోలు చేసే ప్రతిపాదన ఉందని సంస్థ ఎండి తెలిపారు. ఆర్టీసీని ప్రైవేటీకరించబోవడం, అది ప్రభుత్వ పరిధిలోనే కొనసాగుతుంది, ఏ ఒక్క డ్రైవర్‌ని కానీ, కండక్టర్‌ని కానీ, ఇతర ఉద్యోగిని కానీ విధుల నుంచి తొలగించబడరని, ఇతర డిపోలకు బదిలీ చేయవద్దని జెఏసి నాయకుల డిమాండ్ చేశారని ఎండి తెలిపారు. అన్ని అంశాలపై జరిపిన చర్చలు సఫలం అయ్యాయని జెఏసి నాయకులు అన్నారు.

# ఆగస్టు, సెప్టెంబరులో రైతులకు గడ్డుకాలమే

## భారత వాతావరణ శాఖ అంచనా

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతులు పంటలు వేసే వేళ భారత వాతావరణ శాఖ (ఐఎండి) శుక్రవారం తన నెలవారీ అంచనాలు వెల్లడించింది. వీటిని అనుసరించి ఆగస్టు, సెప్టెంబరులో ఎపిలో రైతులకు గడ్డుకాలమే కానున్నది. ఇక మలిదశ రుతుపవన వర్షాలు సాధారణంగా కంటే తక్కువగా కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అంటే ఆగస్టు, సెప్టెంబర్ వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదువుతుందని అంచనా వేసింది. ఆగస్టు- సెప్టెంబర్ కాలంలో దేశవ్యాప్త వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ)లో 94 శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఒక నిర్దిష్ట ప్రాంతంలో ఒక నెల లేదా సీజన్‌లో నమోదైన వర్షపాతాన్ని, సాధారణంగా 30 నుంచి 50 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి సగటుగా లెక్కించడాన్ని ఎల్పిఎ అంటారు. 1971 నుంచి 2020 వరకు చారిత్రక డేటా ప్రకారం, ఆగస్టు- సెప్టెంబరు కాలానికి దేశవ్యాప్త సగటు వర్షపాతం (ఎల్పిఎ) 422.8 మి.మీ.గా ఉంది.

**ప్రాంతాలవారీగా ప్రభావం ఎలా ఉంటుందంటే?:** వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర మాట్లాడుతూ, 'ఆగస్టు- సెప్టెంబర్ కాలంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది. అయితే దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు, మధ్య, వాయువ్య భారతదేశంలోని ఉత్తర ప్రాంతాలు, తూర్పు, ఈశాన్య భారతదేశాల్లో మాత్రం సాధారణం నుంచి సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉండ్డి అని తెలిపారు.

**ఎపిలో విపత్తు నిర్వహణ వ్యవస్థలపై కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల సమీక్ష:** ఎపిఎస్‌డిఎంఎ కార్యాలయాన్ని ఎన్‌డిఎంఎ, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం శుక్రవారం సందర్శించింది. విపత్తుల ముందస్తు సన్నద్ధత బలోపేతంపై కేంద్ర ప్రభుత్వ అధికారులు సమీక్షించారు. వడగాలులు, పిడుగుపాట్ల నివారణ కార్యాచరణపై అధికారులతో చర్చించారు.

ఎస్‌డిఆర్‌ఎఫ్ బెటాలియన్ల సామర్థ్య పెంపుపై కేంద్ర బృందం దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. ఆధునిక పరికరాల సమీకరణ, అగ్నిమాపక సేవల విస్తరణపై సమీక్షించారు.

విపత్తు నిర్వహణ ప్రణాళికల నవీకరణపై ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు మాట్లాడారు. అలాగే, ఎన్‌డిఎంఐఎస్ పోర్టల్‌లో సమాచార నమోదు తీరును పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఐడిఆర్ఎన్ పోర్టల్ వినియోగంపై కీలకంగా చర్చించారు. జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విపత్తు నిర్వహణ బలోపేతమే లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ అధికారులు తెపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో విపత్తు నిర్వహణ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని నిర్ణయించామని అన్నారు. ప్రజలకు వేగవంతమైన విపత్తు సేవలందించేందుకు చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్ర హోంశాఖ ఆదేశాలతో ఎపిలో పర్యటించామని వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో సాంకేతికత వినియోగం పెంపుపై కార్యాచరణ చేపడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ అధికారులు పేర్కొన్నారు.

# వ్యాసాశ్రమంలో రాజకీయ జోక్యం వద్దు




**తిరుపతి(హెల్త్), జులై 31 ప్రభాతవార్త:** ఎంతో ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన వ్యాసాశ్రమం విద్యార్థులకు విద్యను, జ్ఞాన దానం చేసిన ఆశ్రమం వేదాశ్రమం అని శ్రీనివాసనంద సరస్వతి స్వామి అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేదాశ్రమంలో చిన్నచిన్న తప్పులు జరిగి ఉంటాయని, వేదాశ్రమ పరిరక్షణ సమితి, పూర్వ విద్యార్థులతో కలిపి దక్షిణ భారతదేశ సాధు సంతులతో, విశ్వహిందూ పరిషత్, హిందూ ధార్మిక సంస్థలతో కలిపి త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకొని, చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆశ్రమంలో రాజకీయ జోక్యం వద్దు అని కోరారు. ఏర్పేడు ఆశ్రమం హిందూ సనాతన ధర్మానికి కేంద్ర బిందువుగా ఉన్నదని పేర్కొన్నారు. స్వామి సమస్యలు స్వాములే పరిష్కరించుకుంటామని చెప్పారు. ఎపి సాధు పరిషత్ గౌరవ అధ్యక్షులు అట్లూరి నారాయణరావు మాట్లాడుతూ అవినీతి ఆరోపణలతో మన ఆశ్రమాన్ని మనమే కించపరచుకోవడం, ఒకరి మీద ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలతో సనాతన ధర్మం సన్నగిల్లితుందన్నారు. తొందరలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రతిదీ చర్చించుకొని సమస్య పరిష్కరించు కుందామని హితవు పలికారు. శివానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ వ్యాసాశ్రమం 100సంవత్సరాల చరిత్ర కలిగి శతాబ్ది ఉత్సవాలు జరుపుకుం టున్నదని అన్నారు. అందరం కలిసి ఆశ్రమాన్ని కాపాడుకోవాలని, సమస్యల ను చర్చల ద్వారా పరిష్కరించుకుందామని పరిరక్షణ సమితి సభ్యులకు, పూర్వ విద్యార్థులు, స్వామీజీలను కోరారు. ఈ సమావేశంలో సాంబశివానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు 'మిషన్ చలో గావ్ కీ ఔర్' రథయాత్ర

## అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్‌సింగ్

**జగ్గయ్యపేట, జులై 31 ప్రభాతవార్త:** ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు దేశవ్యాప్త 'మిషన్ చలో గావ్ కీ ఔర్' రథయాత్ర చేపట్టినట్లు అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్‌సింగ్ జాదోన్ అన్నారు. రెండు రోజుల ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా శుక్రవారం ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పంచాయితీలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కుల అమలు, గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలను మేల్కొలిపేందుకు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు దేశవ్యాప్త 'మిషన్ చలో గావ్ కీ ఔర్' రథయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కాగా ఈకార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, పరిషత్ ఎపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముల్లంగి రామకృష్ణారెడ్డి, టిడిపి నేతలు కట్టా వెంకటనరసింహారావు, అడుసుమల్లి ప్రభాకరరరావు, సర్పంచ్ నెమలి ఏసమ్మ, బండి శ్రీకాంత్, తాటి రామారావు, ఫీల్డ్ సహాయకులు నెమలి లత రమేష్, సీనియర్ మేట్ శారద తదితరులు పాల్గొన్నారు.



మిషన్ చలో గావ్ కీ ఔర్ రథయాత్రలో బండిపాలెం సందర్శించిన అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోక్‌సింగ్ జాదోన్

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



**కళ్యాణదుర్గం, జులై 31 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ సిసి రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఐదో రోజు బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామస్థుల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎన్‌టిఆర్ విగ్రహ కట్టకు మెరుగులు దిద్దేందుకు తన స్వంత నిధుల నుంచి రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. వైసిపి పాలనలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రహదారులు, మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని, గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందు లు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# పదవీ విరమణ రోజే ఆంధ్ర వర్సిటీ మాజీ విసి ప్రసాదరెడ్డి సస్పెన్షన్

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) మాజీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ పివిజిడి ప్రసాదరెడ్డి పదవీ విరమణ రోజే సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన శుక్రవారం పదవీ విరమణ చేయాల్సి ఉండగా ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై వచ్చిన తీవ్రమైన అవినీతి, అధికార దుర్వినియోగ ఆరోపణలపై విజిలెన్స్, విచారణ కమిటీలు సమర్పించిన నివేదికల ఆధారంగా ఎయు పాలకమండలి సమావేశంలో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఎయు విసిగా నియమితులైన ప్రసాదరెడ్డిపై మొదటి నుంచి అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధుల దుర్వినియోగం, అధికార దుర్వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి పలు అంశాలపై ఫిర్యాదులు అందాయి. దీనిపై విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, ఆయన అక్రమాలకు పాల్పడినట్లు తేల్చింది. నిధుల దుర్వినియోగం, అక్రమాస్తుల ఆరోపణలపై ఎసిబితో విచారణ జరిపించాలని, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తన నివేదికలో ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. విసిగా తన పదవీకాలంలో ప్రసాదరెడ్డి ఒక విద్యావేత్తగా కాకుండా వైసిపి కార్యకర్తలా వ్యవహరించారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. విశ్వవిద్యాలయాన్ని పూర్తిగా రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా మార్చారని, విసి కార్యాలయాన్ని పార్టీ ఆఫీసుగా నడిపారని ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా, జివిఎంసి ఎన్నికల సమయంలో వైసిపి కార్పొరేటర్ అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాల రూపకల్పన వంటివి విసి ఛాంబర్ నుంచే జరిగాయని పలువురు ఆరోపించారు. విద్యార్థులతో రాజకీయ సర్వేలు చేయించారని కూడా విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ ఆరోపణలు, విజిలెన్స్ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన ఏయూ పాలకమండలి, ప్రసాదరెడ్డిని సస్పెండ్ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. పదవీ విరమణ చేసే రోజునే సస్పెన్షన్ వేటు పడటం ఎయు చరిత్రలో చర్చనీయాంశంగా మారింది.

# అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆరోగ్య పరిశోధన రంగం అభివృద్ధి

- విజయవాడ ఎంపి కేశినేని చిన్ని ప్రశ్నకు సమాధానమిచ్చిన కేంద్రమంత్రి ప్రతాప్‌రావు జాదవ్

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో ఆరోగ్య పరిశోధన రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తుంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వైద్య కళాశాలలు, పరిశోధనా సంస్థల్లో అత్యాధునిక పరిశోధన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తుందని స్పష్టం చేసింది. ప్రజారోగ్య సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను అందించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య పరిశోధన ప్రోత్సాహం కోసం మౌలిక సదుపాయాల అభివృద్ధి కేంద్ర రంగ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపింది. ఈ మేరకు విజయవాడ లోక్‌సభ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కేంద్ర రంగ పథకం కింద మల్టీ యూనిట్లలో ఏర్పాటైన స్థానిక పరిశోధన సలహా కమిటీలు పరిశోధన ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం పరిశీలించి ఆమోదిస్తున్నాయని తెలిపారు ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మొత్తం 4,925పరిశోధన ప్రాజెక్టులు ఆమోదించబడ్డాయి. వీటిలో 1,796 ప్రాజెక్టులు విజయవంతంగా పూర్తికాగా, 1,801 ప్రాజెక్టులు అమలులో ఉన్నాయి. మరో 1,282 ప్రాజెక్టులు ప్రారంభ దశలో ఉండగా, 46 ప్రాజెక్టులు వివిధ కారణాలతో విరమించబడ్డాయి అని అన్నారు.

# పద్మావతి వర్సిటీ నూతన కార్యనిర్వాహక మండలి



**తిరుపతి, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి నూతన కార్యనిర్వాహక మండలి శుక్రవారం ప్రభుత్వం నియమించింది. మూడు సంవత్సరాల కాలానికి విద్యావిభాగంలో నిపుణులైన ఆరుగురు మహిళలను నూతన కార్యనిర్వాహక మండలిగా ఏర్పాటు చేసింది. నూతనంగా ఏర్పాటు చేసిన కార్యనిర్వాహక మండలిలో విశ్వవిద్యాలయంకు చెందిన సీనియర్ ప్రొఫెసర్ ప్రతినిధిగా కమ్యూనికేషన్, జర్నలిజం విభాగం ప్రొఫెసర్ ఆచార్య సి.వాణి, విశ్వవిద్యాలయం తరఫున ప్రిన్సిపాల్/ డీన్ ప్రతినిధిగా సామాజిక శాస్త్రాలు, హ్యూమానిటీస్ మేనేజ్‌మెంట్ పాఠశాల డీన్ ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి మని ప్రభుత్వం నామినేట్ చేసింది. వివిధ వృత్తి పరమైన విద్యారంగాలకు చెందిన నలుగురు ప్రముఖులను కార్యనిర్వాహక మండలి సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకురాలు, ఎండి డాక్టర్ సుచిత్ర కె. ఎల్లా, స్విమ్స్ విశ్వవిద్యాలయంకు చెందిన కార్డియాలజీ విభాగం డాక్టర్ వి.వనజాక్షమ్మ, చీఫ్ డేటా సైన్స్ ఇంజినీరింగ్ ఆఫీసర్ సాస్కెన్ టెక్నాలజీస్ లిమిటెడ్ నిర్మల దాట్ల, మాజీ ఉపకులపతి, కర్ణాటక రాష్ట్ర మహిళా విశ్వవిద్యాలయం చైర్మన్ డాక్టర్ మీనా రాజీవ్ చంద్రవార్కర్ ఉన్నారు.

# కొత్తూరు కెజిబివిలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**కొత్తూరు (శ్రీకాకుళం జిల్లా), జులై 31 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండల కేంద్రంలోని టైప్-4 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కెజిబివి) వసతి గృహంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం లక్కయ్యగూడ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (బైపిసి) చదువుతోంది. శుక్రవారం ఉదయం ఆమె తన గది నుంచి బయటకు రాకపోవడంతో సహచర విద్యార్థులు, సిబ్బంది వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. విషయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న కొత్తూరు సిఐ చింతాడ ప్రసాద్, ఎస్ఐ వెంకటేశ్వర్లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి నిశితంగా ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. గ్రామస్థులు, గిరిజన సంఘాల నాయకులు కెజిబివి వసతి గృహం వద్దకు భారీగా చేరుకుని ఆందోళనకు దిగారు. తమ బిడ్డ ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఈ మరణం వెనుక ఖచ్చితంగా కుట్ర దాగి ఉందంటూ బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతికి దారి తీసిన అసలు కారణాలను తక్షణమే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఒంగోలులో యువకుడి దారుణ హత్య

**ఒంగోలు (క్రైమ్), జులై 31 ప్రభాతవార్త:** ఒంగోలు నగరంలోని రాజాపానగల్ రోడ్ ఎనిమిదో లైన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన కత్తిపోట్ల ఘటన తీవ్ర విషాదానికి దారితీసింది. అదే ప్రాంతానికి చెందిన విష్ణుమూర్తిపై ఎదురింట్లో నివాసం ఉండే సిద్దు కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే రిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ఆయన ప్రాణాలు నిలవలేదు. ఘటనపై సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అనంతరం రిమ్స్ ఆసుపత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, టూ టౌన్ సిఐ వీరనాయక్ ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఘటన జరిగిన సమయంలో అక్కడ ఉన్న వారి వాంగ్మూలాలను నమోదు చేస్తూ సిసిటివి కెమెరాల దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తూ హత్యకు గల అసలు కారణాలను వెలికితీసే పనిలో నిమగ్నమయ్యారు. పూర్తి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలను వెల్లడిస్తామని డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు.

# మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు రూ.16.92 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త:** మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు మ్యాచింగ్ గ్రాంట్ రూ.16.92 కోట్లు న్యాయవాదుల కుటుంబాలకు పంపిణీ చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ (తాత్కాలిక కమిటీ) సమావేశం నిర్ణయించింది. శుక్రవారం అమరావతిలోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్ రెడ్డి అధ్యక్షతన సమావేశంలో ఇప్పటికే ఆమోదించిన 423మంది మృతి చెందిన న్యాయవాదుల కుటుంబాలకు పంపిణీ చేయాలని తీర్మానించింది. ఈ తాత్కాలిక కమిటీలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఆలూరి రామిరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు బి.వెంకటరమణమూర్తి, ఉప్పలపాటి శ్రీనివాసరాజులు సభ్యులుగా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ (తాత్కాలిక) కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. ఈ ఆర్థిక సహాయం అడ్వకేట్ల కుటుంబాలకు క్లిష్ట పరిస్థితుల్లో గణనీయమైన భరోసాను కల్పిస్తుందని కమిటీ పేర్కొంది. అదే విధంగా మిగిలిన 727మంది మృతిచెందిన న్యాయవాదుల కుటుంబాలకు సంబంధించిన రూ.29.8 కోట్ల మ్యాచింగ్ గ్రాంట్‌ను కూడా వీలైనంత త్వరగా విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కమిటీ కోరింది. ఈ నిధుల విడుదల ద్వారా ఆ కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా లభించి, వారు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకు తోడ్పడుతుందని కమిటీ అభిప్రాయపడింది.

# అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరిపించండి

**జగ్గయ్యపేట, జులై 31 ప్రభాతవార్త:** జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార కూటమి, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్లు అవినీతి పనులు జరిగాయని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగిన కౌన్సిల్‌లో టిడిపి, జనసేన కౌన్సిలర్ల మధ్య పలు అవినీతి పనలపై వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్ష వైఎస్ఆర్‌సిపి వైస్‌చైర్‌పర్సన్ పఠాన్ హాఫీజున్నీసా ఫిరోజ్, కౌన్సిలర్ వట్టెం మనోహర్ కూడా అవినీతి పనులు జరిగాయంటూ బాధ్యులైన అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని చైర్మన్‌ను కోరగా, చర్యలు తప్పవని పేర్కొన్నారు.






భోగాపురం విమానాశ్రయంతో పాటు

రూ.17,912 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం

# ఉత్తరాంధ్ర అభివృద్ధికి

# నేడు చారిత్రక ఘట్టం



**విశాఖపట్నం, జూలై 31, ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో మరో కీలక అధ్యాయం శనివారం ఆవిష్కృతం కానుంది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల కలగా నిలిచిన భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ఇదే వేదికగా రాష్ట్రవ్యాప్తంగా రూ.17,912 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో రూ.4,727 కోట్లతో నిర్మించిన ఈ అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు కొత్త అభివృద్ధి ద్వారాలను తెరవనుంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పారిశ్రామిక పెట్టుబడులు, పర్యాటకం, ఐటీ, ఎగుమతులు, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లా తర్లువాడలో రూ.468 కోట్లతో ఏర్పాటు (తరువాయి 8వ పేజీలో)



**ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా..**

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నేడు భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయాన్ని ప్రారంభించనున్నారు. ఈ ప్రాజెక్టు ఉత్తరాంధ్ర ప్రజల పెద్ద కలను సాకారం చేయనుంది.



**సీఎం చంద్రబాబు దూరదృష్టి ఫలితం**

భోగాపురం విమానాశ్రయం నిర్మాణం రాష్ట్రానికి గర్వకారణం. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది కొత్త వేదిక. యువతకు ఉపాధి, పరిశ్రమలకు మరింత అవకాశాలు లభిస్తాయి.



విశాఖపట్నం విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కు స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ అభిషేక్ కిషోర్



**భోగాపురం చేరుకున్న విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్**

లోకేష్ కు స్వాగతం పలికిన టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారథి, ఎంపీ అప్పలనాయుడు.

## ఘనంగా విమానాశ్రయ ప్రారంభోత్సవం ఉండాలి

**సీఎం వీడియో కాన్ఫరెన్స్**



**విశాఖపట్నం, జులై 31 ప్రభాతవార్త**

అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమంపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. ఏఎస్ఆర్ విమానాశ్రయానాన్ని ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని మోదీకి ఘనంగా స్వాగతం పలికేలా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. విమానాశ్రయ ప్రాంగణాన్ని తెలుగు సంస్కృతి, వారసత్వ వైభవం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని (తరువాయి 8వ పేజీలో)

## తర్లువాడలో 'అసిప్ ' సెమికండక్టర్ ప్యాకేజింగ్ యూనిట్‌కు

# నేడు ప్రధాని శంకుస్థాపన

**వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ**

**విశాఖపట్నం జూలై 31 ప్రభాత వార్త :**

దక్షిణ భారతదేశంలో సెమికండక్టర్ తయారీకి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కేంద్రంగా మార నుంది.రాష్ట్రాన్ని ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్ తయారీ రంగానికి చిరునామాగా మార్చే క్రమంలో మరో ప్రతిష్టాత్మక అడుగు పడింది. అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్



ప్రైవేట్ లిమిటెడ్ (ఆసిప్) సంస్థ, దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కో లిమిటెడ్ భాగస్వామ్యంతో జిల్లాలో ఆనందపురం మం డలం, తార్లువాడ గ్రామంలో ఏర్పాటు చేయనున్న సెమికండక్టర్ ప్యాకేజింగ్ ఫెసిలిటీ భూమిపూజ కార్యక్రమం శనివారం ఉదయం జరగనుంది. ఈ (తరువాయి 8వ పేజీలో)

## భీమిలి జనసమీకరణ ఏర్పాట్లపై

# మంత్రులతో గంటా చర్చ



**భీమిలి, జులై 31, ప్రభాతవార్త :**

భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి జనసమీకరణ ఏర్పాట్లపై టీడీపీ ముఖ్యనాయకులు భీమిలి పార్టీ ఆఫీస్ లో శుక్రవారం సమీక్షించారు. భీమిలి నుంచి బయలుదేరే బస్సులు, భోజన ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యం తదితర అంశాలపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంత్రులు పి. నారాయణ, గొట్టిపాటి రవికుమార్, ఎం.రాంప్రసాద్ రెడ్డి, కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలతో (తరువాయి 8వ పేజీలో)

## విశాఖ రైల్వే స్టేషన్‌కు

# రూ.299 కోట్ల వరం

**కోచింగ్ యార్డు ఆధునికీకరణకు రైల్వే బోర్డు ఆమోదం**

**విశాఖపట్నం, జూలై 31, ప్రభాతవార్త:**

దేశంలోని అత్యంత రద్దీ రైల్వే స్టేషన్లలో ఒకటైన విశాఖపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దక్షిణ తీర రైల్వే (సౌత్ కోస్ట్ రైల్వే) పరిధిలోని విశాఖపట్నం కోచింగ్ యార్డు పునర్వ్యవస్థీకరణకు రూ.299 కోట్లను భారతీయ రైల్వేలు మంజూరు చేశాయి. ఈ ప్రాజెక్టుతో స్టేషన్ సామర్థ్యం పెరగడంతో పాటు ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రోజుకు సగటున 80 వేల మంది ప్రయాణికులు, 113 రైళ్ల రాకపోకలు (తరువాయి 8వ పేజీలో)

## "వైజాగ్ స్టీల్ మ్యాచ్

# విన్ అవ్వడానికి పిచ్ రెడీ'

**నన్ను నమ్మండి.. మంచి భవిష్యత్తు ఉంది**

**ఉద్యోగులు రాజీనామాలు చేసి వెళ్లొద్దు**

**పదవీ విరమణ సభలో ఆర్ఐఎన్ఎల్ సీఎండీ ఎంఎస్వీఎస్ ప్రభాకర్**

**గాజువాక,జూలై 31,ప్రభాతవార్త :**

విశాఖ ఉక్కు కర్మాగారానికి అత్యుత్తమ భవిష్యత్తు ఉందని, ఆర్ఐఎన్ఎల్ ను లాభాల బాట పట్టించేందుకు తగిన వాతావరణం సిద్ధమైందని సీఎండీ ఎంఎస్వీఎస్ ప్రభాకర్ స్పష్టం చేశారు. మ్యాచ్ నెగ్గడానికి క్రికెట్ పిచ్ సిద్ధమైనట్లే..(తరువాయి 8వ పేజీలో)




## ఫ్యూజన్ ఏఐ సమ్మిట్ లాంటి వేదికలతో

# యువత ఆలోచన పరిధి పెరుగుతుంది

- ఘనంగా ప్రీమియర్ ఏఐ సదస్సు...
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విశాఖపట్నం, జూలై 31 ప్రభాతవార్త**

ఫ్యూజన్ ఏఐ సమ్మిట్ 2026' 2వ ఎడిషన్ విశాఖపట్నంలోని విఎంఆర్డిఏ చిల్డ్రన్స్ ఎరీనాలో శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏఐ రంగాన్ని (తరువాయి 8వ పేజీలో)

## ఘనంగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ 5కె రన్ విజయవంతం

**1,500 మంది పాల్గొన్న మహా క్రీడా వేడుక**

**విశాఖపట్నం, జూలై 31ప్రభాత వార్త :**

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్ ) ఆధ్వర్యంలో నిర్వహించిన "భోగాపురం ఎయిర్‌పోర్ట్ 5కె రన్" కార్యక్రమం విశాఖపట్నం పామ్ బీచ్ రోడ్డుపై అంగరంగ వైభవంగా జరిగింది. పామ్ బీచ్ నుంచి తేనేటి పార్క్ వరకు నిర్వహించిన ఈ రన్‌లో విద్యార్థులు, విద్యార్థినులు, యువత, మహిళలు, క్రీడాకారులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా 5కె సైక్లింగ్ ఓపెన్ కేటగిరీ, 5కె రన్ ఓపెన్ బాయ్స్, 5కె రన్ ఓపెన్ గర్ల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా, (తరువాయి 8వ పేజీలో)



## విశాఖలో ఘనంగా

# 'ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు' కార్యక్రమం

**అట్టహాసంగా అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ వేడుకలు ప్రారంభం**




**విశాఖపట్నం, జూలై 31ప్రభాత వార్త :**

భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విశాఖ బీచ్ రోడ్డులో "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు" అనే పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అత్యంత అట్టహాసంగా, (తరువాయి 8వ పేజీలో)

## జిల్లాలో నేడు పాఠశాలలకు సెలవు

**విశాఖపట్నం, జూలై 31 ప్రభాత వార్త :**

ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా విశాఖపట్నం జిల్లాలో పాఠశాలలకు శనివారం సెలవు ప్రకటించారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచే స్కూళ్లకు సెలవు ఇచ్చారు. అయితే ఈ సెలవులకు బదులుగా మరోరోజు స్కూల్స్ పనిచేయాలని డిఇఓ సూచించారు.ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల అధిపతులు ఈ సూచనలు కచ్చితంగా పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

## పంచదార్ల అక్రమ గ్రావెల్ తవ్వకాల వ్యవహారంలో

# రాంబిల్లి తహసీల్దార్ సస్పెన్షన్

- ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం..
- విధుల నిర్వహణలో వైఫల్యంపై చర్యలు

**రాంబిల్లి, జూలై 31, ప్రభాతవార్త:**

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని పంచదార్ల ఫణిగిరి కొండపై వెలుగుచూసిన అక్రమ గ్రావెల్ తవ్వకాల వ్యవహారం తీవ్ర పరిణామాలకు దారితీసింది. ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించడంతో పాటు అక్రమ తవ్వకాలను అరికట్టడంలో విఫలమైన రాంబిల్లి మండల తహసీల్దార్ పి. సత్యనారాయణ



ను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన భూ పరిపాలన కమిషనర్ (సి సి ఎల్ ఎ) మరియు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. అధికారిక సమాచారం ప్రకారం, రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలోని సర్వే నెంబర్-01లో ఉన్న 2.153 హెక్టార్ల గ్రావెల్ క్వారీ (తరువాయి 8వ పేజీలో)



విశాఖకు వచ్చిన సిఎం చంద్రబాబునాయుడుకు స్వాగతం పలుకుతున్న ప్రముఖ రాజకీయ నాయకులు

## ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికిన పవన్ కళ్యాణ్

**విశాఖపట్నం, ఆగస్టు 1 (ప్రభాతవార్త):**

ఆంధ్రప్రదేశ్ పర్యటనకు విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఘన స్వాగతం పలికారు. భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ప్రారంభం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కీలక ఘట్టమని ఆయన పేర్కొన్నారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని తెలిపారు. ఎన్‌డీఏ ప్రభుత్వ కృషి వల్ల రాష్ట్రంలో కనెక్టివిటీ మెరుగుపడటంతో పాటు పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల సృష్టికి కొత్త దిశ లభిస్తుందని పవన్ కళ్యాణ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. "వికసిత ఆంధ్రప్రదేశ్ – వికసిత భారత్" లక్ష్యాల సాధన దిశగా రాష్ట్రం మరో చారిత్రక అధ్యాయంలోకి అడుగుపెడుతోందని పేర్కొంటూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక స్వాగతం తెలిపారు.

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి నేడు చారిత్రక ఘట్టం..

(7వ పేజీ తరువాయి)

చేయనున్న సెమీకండక్టర్ ప్యాకేజింగ్, టెస్టింగ్ ఫెసిలిటీకి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. అలాగే విద్యుత్ రంగంలో రూ.9,920 కోట్ల విలువైన గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు, జాతీయ రహదారుల అభివృద్ధికి రూ.1,883 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొనను న్నారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో పాటు వివిధ రంగాల్లో భారీ పెట్టుబడులతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకురావడంతో పాటు ఉత్తరాంధ్రను పారిశ్రామిక, వాణిజ్య, రవాణా రంగాల్లో కీలక కేంద్రంగా తీర్చిదిద్దనున్నాయని ప్రభుత్వం పేర్కొంది.

## ఘనంగా విమానాశ్రయ ప్రారంభోత్సవం ఉండాలి

(7వ పేజీ తరువాయి)

అన్నారు. ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు చేపడుతున్న గిరిజన సంప్రదాయ థింసా నృత్యం ప్రపంచ రికార్డు సృష్టించేలా నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు విమానాశ్రయ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి అయ్యాయని ముఖ్యమంత్రికి తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, సీఎస్ సాయి ప్రసాద్, ఐఅండ్ ఐ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, జిల్లా కలెక్టర్లు

### ఫ్యూజన్ ఏఐ సమ్మిట్ లాంటి వేదికలతో
## యువత ఆలోచన పరిధి పెరుగుతుంది

(7వ పేజీ తరువాయి)

కేవలం ఆలోచనల స్థాయి నుంచే కాకుండా ఆచరణాత్మకంగా వేగవంతం చేసేందుకు పాలసీదారులు, గ్లోబల్ టెక్ నాయకులు పరిశ్రమల నిపుణులు ఈ వేదికపైకి రావడం హర్షణీయమని కొనియాడారు. ఫ్యూజన్ ఏఐ సమ్మిట్ లాంటి వేదికలు యువత ఆలోచనా పరిధిని పెంచుతాయని వాట్సాప్ ద్వారా ప్రభుత్వ విధానాలను తెలుసుకోవడం, ప్రభుత్వ సేవలు పొందడం లాంటి ఏఐ అధారిత సేవలను ఏపీ ప్రభుత్వం రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా అందిస్తోందని మంత్రి విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాలు వెతుక్కునే వారిగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చే వ్యవస్థాపకులుగా ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఐటీ, విద్యుత్ శాఖల మంత్రి నారా లోకేష్ నాయకత్వం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని... పలు సవాళ్లను అధిగమిస్తూ, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు వీరు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నట్టు మంత్రి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కేవలం ఐటీ రంగానికే పరిమితం కాకుండా, అనేక రకాల అధునాతన సాంకేతిక రంగాలలో పెట్టుబడులను ఆకర్షిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 3 కోట్ల మంది తెలుగు ప్రవాసాంధ్రుల అనుభవంతో పాటు వారి పెట్టుబడులను రాష్ట్ర అభివృద్ధిలో భాగం చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా తమ జ్ఞానం, నైపుణ్యాలతో పరిశ్రమలకు కీలక ఆస్తిగా మారాలని మంత్రి కొండపల్లి కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ డి టి ఐనెట్‌వర్క్ ఛైర్మన్ కొసరాజు శ్రీధర్ , ఎస్ టి పి ఐ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ బాతా , టాలెంట్ ఏపీ ప్రెసిడెంట్ నర్రా సురేష్ , ఐ టి ఏ పి ప్రెసిడెంట్ దాసరి కిషోర్ , పలు కంపెనీల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తర్లువాడలో 'అసిప్ ' సెమికండక్టర్ ప్యాకేజింగ్ యూనిట్‌కు నేడు ప్రధాని శంకుస్థాపన

(7వ పేజీ తరువాయి)

కార్యక్రమాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఏపీ సమాచార సాంకేతిక శాఖ (ఐటీ ) మంత్రి నారా లోకేష్ తదితరులు పాల్గొనున్నారు.ఇండియా సెమికండక్టర్ మిషన్ (ఇసం ) ఆమోదం పొందిన దక్షిణ భారతదేశపు మొట్టమొదటి అవుట్‌సోర్స్ సెమికండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్ (ఓసాట్ ) ఫెసిలిటీ అయిన ఈ ప్రాజెక్ట్ రెండు దశల్లో మొత్తం రూ.2,387.81 కోట్ల పెట్టుబడితో రూపుదిద్దుకోనుంది. తొలి దశ రూ.542.19 కోట్లు, రెండో దశ రూ.1,845.61 కోట్లు పెట్టుబడి పెట్టడం జరుగుతుంది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా రాబోయే రోజుల్లో 1,000 కంటే ఎక్కువ ప్రత్యక్ష నైపుణ్య ఉద్యోగాలు 1,600 పైగా పరోక్ష ఉద్యోగాలు లభిస్తాయి. ఈ పరిశ్రమ ద్వారా సెమికండక్టర్ ప్యాకేజింగ్ రంగంలో విదేశీ దిగుమతులపై ఆధారపడటం తగ్గడమే కాకుండా, దేశీయంగా ఆధునిక ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థ మరింత బలోపేతం కానుంది. ఈ ప్రాజెక్ట్ కోసం దక్షిణ కొరియాకు చెందిన అపాక్ట్ కో లిమిటెడ్ కంపెనీ . తో సాంకేతిక భాగస్వామ్యం కుదుర్చుకున్నారు. దీని ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్ సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. ఈ ప్రాజెక్ట్ కేంద్ర ప్రభుత్వ 'ఆత్మనిర్భర్ భారత్' మరియు 'మేక్ ఇన్ ఇండియా' ఆశయాలకు అనుగుణంగా రూపుదిద్దుకుంది.

## విశాఖ రైల్వే స్టేషన్‌కు రూ.299 కోట్ల వరం

(7వ పేజీ తరువాయి)

సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న యార్డు నిర్మాణం కారణంగా రైళ్ల రాకపోకల్లో జాప్యం, ప్లాట్‌ఫారమ్‌ల లభ్యత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త ప్రాజెక్టు అమలుతో ఈ సమస్యలకు పరిష్కారం లభించనుంది.

ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం ఉన్న ఆరు ప్లాట్‌ఫారమ్‌లను విస్తరించడంతో పాటు మరో ఆరు కొత్త ప్లాట్‌ఫారమ్‌లు, ఆరు అదనపు రైల్వే లైన్లు నిర్మించనున్నారు. కొత్త ప్లాట్‌ఫారమ్‌లలో ప్రయాణికుల కోసం ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే ర్యాంపులు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, స్టేషన్ తూర్పు వైపున కొత్త ప్రవేశ ద్వారం, ప్యాసింజర్ రిజర్వేషన్ కేంద్రం (పీఆర్ఎస్) మార్పు, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ ఏర్పాటు, ఉపరితల పార్కింగ్, మెరుగైన వాహనాల రాకపోకల ప్రణాళికను కూడా ఈ ప్రాజెక్టులో అమలు చేయనున్నారు. ఈ పునర్వ్యవస్థీకరణతో రైళ్ల నిలిపివేత సమయం తగ్గి, ప్లాట్‌ఫారమ్‌ల వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు మరిన్ని రైళ్లను నిర్వహించే అవకాశం కలుగుతుంది. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సేవలను విస్తరించడంతో పాటు సమయపాలన కూడా మెరుగుపడుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

## "వైజాగ్ స్టీల్ మ్యాచ్‌విన్ అవ్వడానికి పిచ్ రెడీ'

(7వ పేజీ తరువాయి)

ప్లాంట్ మళ్లీ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోందన్నారు. శుక్రవారం ఉక్కునగరం క్లబ్ లో జరిగిన ఉద్యోగుల నిష్క్రమణ (విశ్రాంతి) అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ తన ప్రసంగంతో ఉద్యోగుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. "నేను బాధ్యతలు స్వీకరించి రెండు నెలల 15 రోజులైంది. ప్రతీ విభాగాన్ని పరిశీలిస్తున్నా. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు ఉద్యోగులు అందిస్తున్న సహకారం అభినందనీయం. సంస్థలో శుభకార్యానికి సంకేతంలా మార్పులు మొదలయ్యాయి. చాలామంది ఆందోళనతో రాజీనామాలు చేస్తున్నారు, కానీ తొందరపడొద్దు" అని విజ్ఞప్తి చేశారు.

'ఐ లవ్ వైజాగ్ స్టీల్' బోర్డును చూసినప్పుడు ఈ ప్లాంట్ తో ప్రజలకు ఉన్న భావోద్వేగం అర్థమైందని ప్రభాకర్ అన్నారు. భగవంతుడి సంకల్పంతోనే తాను ఇక్కడికి వచ్చానని, ప్లాంట్ ను మళ్లీ దేశంలోనే మేటి స్టీల్ ఇండస్ట్రీగా నిలబెడతానని ధీమా వ్యక్తం చేశారు. ఉద్యోగులందరూ పాజిటివ్ మైండ్ సెట్ తో ఉండాలని, భవిష్యత్తు పట్ల ఆశాభావంతో ఉంటే తప్పకుండా విజయం సాధిస్తామని పిలుపునిచ్చారు.

## ఘనంగా భోగాపురం ఎయిర్‌పోర్ట్ 5కె రన్ విజయవంతం

(7వ పేజీ తరువాయి)

అన్ని విభాగాల్లో కలిపి సుమారు 1,500 మంది పాల్గొన్నారు.

**5కె రన్ - ఓపెన్ గర్ల్స్ విభాగం విజేతలుగా**

జి. గాయత్రీ (గోల్డ్ పతకం)
ఏ . ఆకాంక్ష (సిల్వర్ )
జె . స్వర్ణ రత్న ( రాజతం )
సోమ్య, పి . లావణ్య నాలుగు,ఐదు స్థానాల లో నిలిచారు.

**5కె రన్ - ఓపెన్ బాయ్స్ విభాగం విజేతలుగా**

జి . కేశవ రావు గోల్డ్ పతకం
బి . శ్యామ్ కుమార్ సిల్వర్
ఎస్.దుర్గా ప్రసాద్ రాజతం
ఏ . చరణ్ నాలుగు
పి. సాయి కుమార్ ఐదు స్థానాలను కైవసం చేసుకొన్నారు.
లిమెన్ – 5కె రన్. విభాగంలో ఎం.కోదండ రావు గోల్డ్ పతకం,
ఉమెన్ – 5కె రన్ విభాగంలో
దంతులూరు శ్రీ దేవి వర్మ గోల్డ్ పతకం సాధించారు. ఓపెన్ బాయ్స్ విభాగంలో సైనిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్‌తో పాటు నాలుగో, ఐదో స్థానాలను కూడా కైవసం చేసుకు న్నారు. అలాగే శాప్ విశాఖపట్నం అకాడమీ లో శిక్షణ పొందుతున్న సైక్లింగ్ క్రీడాకారులు సైక్లింగ్ విభాగంలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్‌తో పాటు నాలుగో, ఐదో స్థానాలను సాధించి అకాడమీకి మంచి పేరు తీసుకువచ్చారు. గర్ల్స్ విభాగంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాముఖ్యతను ప్రజల్లో చాటిచెప్పడంతో పాటు, ఆరోగ్యకర జీవనశైలి, ఫిట్‌నెస్, క్రీడాస్ఫూర్తిపై అవగాహన కల్పించడంలో ఈ భోగాపురం ఎయిర్‌పోర్ట్ 5కె రన్ విశాఖ పట్నంలో విజయవంతమైన క్రీడా వేడుకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్,జి. విద్యా ధరి ఆర్డీఓ సునీల్ చక్రవర్తి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గాయలేట్, జిల్లా డిఎస్ఏ కోచ్‌లు, ఇతర అధికారులు పాల్గొని విజేతలను అభినందించారు.

ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ, "భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర కలలకు కొత్త రెక్కలు ప్రాజెక్టు ఉత్తరాంధ్ర అభివృద్ధికి నూతన దిశను చూపడమే కాకుండా యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిస్తుందన్నారు . క్రీడలు ప్రతి విద్యార్థి జీవితంలో ఒక అవిభాజ్య భాగమని,క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు కనీసం ఒక క్రీడను అలవాటు చేసుకొని ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని నిర్మించుకోవాలని,రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని క్రీడాకార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దేందుకు శాప్ నిరంతరం కృషి చేస్తుంది" అని అన్నారు.

## విశాఖలో ఘనంగా 'ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు' కార్యక్రమం

(7వ పేజీ తరువాయి)

ఉత్సాహంగా శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ ముఖ్య అతిథిగా విచ్చేసి సందడి చేశారు.గత వారం రోజులుగా ఉత్తరాంధ్ర వ్యాప్తంగా జరిగిన వివిధ కార్యక్రమాల కు పతాక స్థాయిగా ఈ మెగా ఫ్లాష్‌మాబ్, మెగా బీచ్ వాక్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ చారిత్రాత్మక ఘట్టంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రజలకు సౌకర్యార్థం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ మాట్లాడుతూ, " అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రావడం వల్ల ఈ ప్రాంతంలో పారిశ్రామిక ప్రగతికి, ఉపాధి అవకాశాలకు కొత్త ద్వారాలు తెరుచుకుంటాయన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో భాగంగా రాబోయే రోజుల్లో మరిన్ని భారీ ప్రాజెక్టులు ఇక్కడ స్థాపించబడతాయి," అని పేర్కొన్నారు.ముఖ్యంగా విశాఖను సెమీ కండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో, గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సెమీ కండక్టర్ పరిశ్రమకు శంకుస్థాపన జరగనుందని ఆయన వెల్లడించారు. ఇప్పటికే విశాఖ జిల్లాలో డేటా సెంటర్ ఎకోసిస్టం బలంగా ఉందని, సెమీ కండక్టర్ పరిశ్రమతో విశాఖ అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక నగరంగా అవతరిస్తుందని కలెక్టర్ ధీమా వ్యక్తం చేశారు.

## ఏయూ మాజీ వీసీ ప్రసాద్ రెడ్డి సస్పెన్షన్

### పదవీ విరమణకు పది నిమిషాల ముందు మెయిల్ ద్వారా ఉత్తర్వులు జారీ
### విజిలెన్స్ విచారణ లో అక్రమాలు రుజువే కారణం

**విశాఖపట్నం, జూలై 31 ప్రభాత వార్త :**

ఆంధ్రా విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రసాదరెడ్డి శుక్రవారం సాయంత్రం తను పదవీ విరమణ చేయనున్న సమయానికి సరిగ్గా పది నిమిషాల ముందు ఏయూ యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు ను మెయిల్ ద్వారా ప్రస్తుత వీసీ రాజశేఖర్ పంపారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు మాజీ వీసీ ప్రసాద రెడ్డి ఉద్యోగ విరమణ చేయాల్సిఉండగా



3.40నిముషాల కు సస్పెన్షన్ ఉత్తర్వులు ను మెయిల్ ద్వారా యాజమాన్యం అయనకు పంపింది. వైసీపీ ప్రభుత్వం హయాంలో వీసీగా నియమితులైన ప్రసాద్ రెడ్డి తాను వీసీగా ఉన్న సమయంలో నిబంధన లుకు విరుద్ధంగా పలు అక్రమాలు, అవకత వకలు కు పాల్పడినట్టు ఆరోపణలు రావడం తో కూటమి ప్రభుత్వం ఆయన పై విజిలె న్స్‌తో విచారణ జరిపింది. దాంతో ప్రసాద రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. అయితే ఆయన మీద వచ్చిన అవినీతి ఆరోపణలు విజిలెన్స్ విచారణ నివేదిక లో రుజువు కావడం తో ప్రసాద్ రెడ్డిని ప్రభు త్వం తన ఉద్యోగ విరమణ చేసే రోజు నే నిర్ణయం తీసుకొని అయన పై సస్పెన్షన్ వేటును వేసింది.

## 'సంజీవని' నిధుల సమాచారం తక్షణం ఇవ్వండి

### జిల్లా అధికారులకు సమాచార కమిషన్ ఆదేశాలు

**విశాఖపట్నం, జూలై 31, ప్రభాత వార్త :**

నిరుపేదలు, అభాగ్యులను ఆదుకోవడమే లక్ష్యంగా అట్టహాసంగా ప్రారంభమైన 'సంజీవని నిధి' (డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్) వ్యవహారం ఇప్పుడు అధికారుల మెడకు చుట్టుకుంటోంది. లక్షల్లో విరాళాలు సేకరించిన ఈ నిధికి సంబంధించిన ఖాతా వివరాలు, లబ్ధిదారుల జాబితాను బహిర్గతం చేయకుండా జిల్లా యంత్రాంగం ఆడుతున్న దాగుడుమూతల వ్యవహారంపై రాష్ట్ర సమాచార కమిషన్‌లో శుక్రవారం విచారణ జరిగింది. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారు కోరిన పూర్తి వివరాలను తక్షణం అందజేయాలని కమిషన్ జిల్లా అధికారులకు అల్టిమేటం జారీ చేసింది.

**అసలు ప్రశ్నలు ఇవే ...**

విశాఖపట్నం జిల్లాలో మూడేళ్ళ క్రితం అప్పటి కలెక్టర్ అమలు చేసిన 'సంజీవని నిధి'కి సంబంధించి సమాచారం కోసం ఆర్టీఐ ఉద్యమకర్త, ఇన్‌ఫ్లుయెన్సర్ కాండ్రేగుల వెంకటరమణ 2023 అక్టోబర్ 4న కలెక్టర్ కార్యాలయానికి దరఖాస్తు చేశారు. ప్రజా ధనానికి సంబంధించిన సంజీవని నిధి ఏర్పాటుకు సంబంధించిన ప్రభుత్వానుమతి పత్రాలు, బైలాస్ కాపీలు, నిధి ప్రారంభం నుంచి సమాచారం ఇచ్చు తేదీ వరకు అందిన విరాళాలు, జమ చేసిన బ్యాంకు ఖాతా వివరాలు, లబ్ధిదారుల జాబితా. సొసైటీ సర్వసభ్య, కార్యవర్గ సమావేశాల వివరాలు, ఆమోదించిన తీర్మానాల కాపీలు. సంజీవని నిధి కింద ఆర్థిక సాయం పొందేందుకు ఉండాల్సిన అర్హతలు, ప్రామాణికాలను దరఖాస్తుదారు కోరారు.

**దాటవేత ధోరణి., తప్పని అప్పీలు**

దరఖాస్తుదారు అడిగిన ఈ ప్రాథమిక సమాచారాన్ని ఇవ్వడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. సమాచారం ఇవ్వకుండా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌కు కలక్టర్ కార్యాలయం దరఖాస్తును బదిలీ చేసింది. ఆర్టీఐ సెక్షన్ 6 (1), 19 (1) కింద దరఖాస్తు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో స్పందించలేదు. పైగా పొంతనలేని సమాధానాలతో కాలయాపన చేస్తూ, వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. అధికారుల తీరుపై కాండ్రేగుల వెంకటరమణ నేరుగా రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించారు.

**విచారణలో అధికారులకు అక్షింతలు**

వర్చువల్ విధానంలో శుక్రవారం ఆర్టీఐ అప్పీల్ నెం.9538/2024 పై విచారణ జరిగింది. ఈ సందర్భంగా దరఖాస్తుదారు తన వాదనలు వినిపించారు. 'పారదర్శకత, జవాబుదారీతనం లేకపోతే అధికార దుర్వినియోగానికి ఆస్కారం ఉంటుంది. కోరిన సమాచారాన్ని తక్షణమే ఇప్పించడమే కాకుండా, సమాచారం ఇవ్వడంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై జరిమానాలు విధించాలి' అని ఆయన డిమాండ్ చేశారు. ఇదే సమయంలో విచారణకు హాజరైన సంబంధిత అధికారులు పొంతనలేని, సహేతుకమైన సమాధానం ఇవ్వకపోవడంతో సమాచార కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై మండిపడిన ఆయన దరఖాస్తుదారు కోరిన సమగ్ర సమాచారాన్ని తక్షణం అందజేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విచారణలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

**విరాళాలు ఎంతొచ్చాయి ... ఎవరికిచ్చారు ?**

ఈ సందర్భంగా కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ 2023 జనవరి 1న అప్పటి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లిఖార్జున ప్రారంభించిన 'సంజీవని నిధి డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ' పథకం తొలి రోజే రూ. 10,92,928 విరాళంగా సమకూరింది. అయితే ఆ తర్వాత నిధులు ఏమయ్యాయి? ఎంత వసూలు అయ్యింది ? ఎవరికి సాయం అందింది? అసలు అర్హులెవరు? అన్న వివరాలు అధికారుల వద్దే గోప్యంగా ఉండటం పలు అనుమానాలకు, విమర్శలకు తావిస్తోందని ఆయన అన్నారు. తాజాగా సమాచార కమిషన్ ఇచ్చిన కచ్చితమైన ఆదేశాలతోనైనా 'సంజీవని' రహస్యాలను బయటపెడతారా? లేక మళ్లీ దాటవేత ధోరణి ప్రదర్శించి కఠిన చర్యలు ఎదుర్కొంటారా? అనేది వేచిచూడాలన్నారు.

### పంచదార్ల అక్రమ గ్రావెల్ తవ్వకాల వ్యవహారంలో
## రాంబిల్లి తహసీల్దార్ సస్పెన్షన్

(7వ పేజీ తరువాయి)

లీజు పరిధిలో జరిగిన తవ్వకాలపై రెవెన్యూ, గనులు-భూగర్భశాఖ (మైన్స్ అండ్ జియాలజీ)తో పాటు ఇతర శాఖల అధికారులు సంయుక్తంగా జాయింట్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో లీజు ప్రాంతం లోపల 1,67,280.793 మెట్రిక్ టన్నుల గ్రావెల్ తవ్వకాలు జరిగినట్లు గుర్తించారు.

అయితే, లీజు పరిమితిని దాటి వాయువ్య దిశలో ఉన్న ప్రభుత్వ భూమిలోనే 1,39,622.235 మెట్రిక్ టన్నుల గ్రావెల్ అక్రమంగా తవ్వినట్లు అధికారులు నిర్ధారించారు. లీజుదారు అధికారికంగా 1,04,000 మెట్రిక్ టన్నుల గ్రావెల్‌కు మాత్రమే డిస్పాచ్ పర్మిట్లు పొందినప్పటికీ, ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండానే అదనంగా 63,280.793 మెట్రిక్ టన్నుల గ్రావెల్‌ను తవ్వినట్లు విచారణలో తేలింది.

ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత ఉన్న తహసీల్దార్ పి. సత్యనారాయణ, మైనింగ్ శాఖతో సమన్వయం చేసుకొని అక్రమ తవ్వకాలను అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా, ఈ అక్రమాలను సకాలంలో పై అధికారుల దృష్టికి తీసుకురాకపోవడం వల్ల ప్రభుత్వ భూమికి, ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం వాటిల్లినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తహసీల్దార్ వ్యవహారాన్ని విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం (డేర్లిక్షన్ ఆఫ్ డ్యూటీ)గా పరిగణించిన ప్రభుత్వం, ఇది ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్--1964లోని రూల్--3కు విరుద్ధమని స్పష్టం చేసింది. దీంతో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (సి సి ఏ) రూల్స్--1991లోని రూల్ 8(1) ప్రకారం ఆయనను తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేసింది.

సస్పెన్షన్ కాలంలో ఆయనకు ఎఫ్.ఆర్.--53 నిబంధనల ప్రకారం జీవన భృతి (సబ్సిస్టెన్స్ ఎలవన్స్) చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే, సంబంధిత ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా తన ప్రధాన కేంద్రాన్ని (హెడ్ క్వార్టర్స్) విడిచి వెళ్లరాదని కూడా ఆదేశించారు.

పంచదార్ల అక్రమ గ్రావెల్ తవ్వకాల వ్యవహారంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో ఇప్పటికే అక్రమ తవ్వకాలపై విచారణ కొనసాగుతుండగా, సంబంధిత ఇతర అధికారులు, లీజుదారులు మరియు బాధ్యులపై కూడా మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ అక్రమ తవ్వకాల్లో భాగంగా విఆర్ఓ ఎమ్. రమణను కూడా సస్పెండ్ చేసినట్టు తెలుస్తుంది.

## ఆంధ్రా యూనివర్సిటీ పరీక్షలు వాయిదా

**విశాఖపట్నం, జూలై 31ప్రభాత వార్త :**

భోగాపురంలో శనివారం జరగనున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు, భద్రతా ఏర్పాట్లు, రవాణా అంతరాయాలను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) పరిధిలో ఆగస్టు 1 న నిర్వహించాల్సిన కొన్ని యూజీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షలను వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు.ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ నుంచి వచ్చిన విజ్ఞప్తి పరిశీలించి విజయనగరం జిల్లా కలెక్టర్ ఆదేశాలు, వైస్-చాన్సలర్ అనుమతితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటన లో పేర్కొన్నారు. సవరించిన పరీక్షల షెడ్యూల్:

బి.ఏ., బి.కాం., బి.ఎస్సి., బి.బి.ఏ., బి.హెచ్.ఎం.సి.టి., బి.సి.ఏ. (సప్లిమెంటరీ) ఆగస్టు 1 ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు జరగాల్సిన పరీక్షను ఆగస్టు 24 కు వాయిదా వేశారు.

ఎంబీఏ, ఎంహెచ్ఆర్ఎం : ఆగస్టు 1 మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 వరకు జరగాల్సిన పరీక్షను ఆగస్టు 5 కు మార్చారు.

పీ.జీ. డిప్లొమా ఇన్ కౌన్సెల్లింగ్ అండ్ గైడెన్స్ : ఆగస్టు 1 ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 1.00 వరకు నిర్వహించాల్సిన పరీక్షను ఆగస్టు 5 కు వాయిదా వేశారు.

బి.ఫార్మసీ : ఆగస్టు 1 ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3 కు మార్చారు.

ఏయూ వెల్లడించిన వివరాల ప్రకారం, పై పేర్కొన్న పరీక్షలు మినహా మిగతా అన్ని పరీక్షల షెడ్యూల్ యథాతథంగా కొనసాగుతుంది. అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత విద్యార్థులు సవరించిన షెడ్యూల్‌ను గమనించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని పరీక్షల నియంత్రణాధికారి సూచించారు.

### భీమిలి జనసమీకరణ ఏర్పాట్లపై
## మంత్రులతో గంటా చర్చ

(7వ పేజీ తరువాయి)

కలిసి చర్చించారు. భీమిలి నియోజకవర్గం నుంచి బయలుదేరే 640 బస్సులు రూట్లు ఖరారు చేశామని నారాయణ తెలియజేశారు. 29 వేల మందిని సభకు తరలించడానికి బస్సులు సిద్ధం చేశామని గంటా చెప్పారు. పద్మనాభం పరిసర ప్రాంతాల వారికి భోగాపురం వెళ్లి రావడానికి ఇబ్బంది లేకుండా తాటితూరు దగ్గర్లో బస్సు పార్కింగ్ సదుపాయం కల్పించాలని ఆర్డీఓ సంగీత్ మాథుర్ కు సూచించారు. యాప్ ద్వారా బస్సుల కదలికలు విశ్లేషిస్తారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర గ్రోత్ ఇంజన్ భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని మంత్రులు కోరారు. నియోజవర్గ పరిశీలకులైన ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భాష్యం ప్రవీణ్, అశోక్ రెడ్డి, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, భీమిలి పార్టీ ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**బస్సు పార్కింగ్ స్థలాల పరిశీలన**

అంతకుముందు భోగాపురం ఎయిర్ పోర్టు జనసమీకరణ కోసం ఉద్దేశించిన బస్సులను భోజన సౌకర్యం కల్పించడానికి నిలుపు చేసే పార్కింగ్ స్థలాలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. అమనాం, పోలిపిల్లి, సవరవల్లి, తగరపువలస, చిట్టివలస, దొరతోట, బొడ్డపాలెం తదితర ప్రాంతాల్లో పార్కింగ్ కు అనువైన లే అవుట్లు, ఖాళీ స్థలాలను పరిశీలించారు.

## పెన్ డౌన్ నిరసన కార్యక్రమాన్ని విరమించిన దస్తావేజులేఖర్లు

**నక్కపల్లి, జూలై 31, ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విషయంలో జారీ చేసిన జీవో నెంబర్ 396 ను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ దస్తావేజులేఖరులు రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు గత 12 రోజులుగా చేసిన పెన్ డౌన్ సమ్మె నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం విరమించారు. దస్తావేజులేఖర్లు నక్కపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలోని తమ వృత్తిని కాపాడాలని దస్తావేజులేఖరులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నుంచి విధుల్లో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దస్తావేజులేఖరుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాతారం మురళీకృష్ణ , ఉపాధ్యక్షుడు ఎన్. వి రమణ, లోవరత్నం, సాయి తేజ, కూరపాటి సూర్యనారాయణ, నూకరాజు, గోవిందు, చిరంజీవి, బొంతు రాజు, లక్ష్మి, ధారబాబు, రమేష్, నవీన్, లోకేష్, అశోకు తదితరులు ఉన్నారు.

## స్కీం వర్కర్స్ కు వేతనాలు పెంచాలి

**విశాఖపట్నం, జూలై 31ప్రభాత వార్త :**

రాష్ట్రంలో పనిచేస్తున్నటువంటి ఆశ, అంగనవాడి, మధ్యాహ్నం భోజనం పథకం, వివోఏ, ఆర్ పి, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ కు ప్రభుత్వం కనీస వేతనాలు పెంచాలని, పెరిగిన ధరల కనుకగునంగా కనీస వేతనం రూ.26,000 గా నిర్ణయించి అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని, అనవసరపు యాపులను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ విశాఖ జిల్లా కన్వీనర్ పి.మణి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం ఉదయం సరస్వతీ పార్క్ నుండి డాబా గార్డెన్స్, ప్రకాశరావుపేట, జగదాంబ సెంటర్, వాచ్ హౌస్ మీదుగా కలెక్టర్ ఆఫీస్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.ఈ ప్రదర్శనలో అంగనవాడి, ఆశ, మధ్యాహ్నం పథకం, ఆర్పి, వివోఏ స్కూల్ శానిటేషన్ కార్మికులు వందలాదిమంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగిన సభలో పి. మణి మాట్లాడుతూ ప్రభుత్వం స్కీం వర్కర్స్ చేత వెట్టి చాకిరి చేయించుకుంటున్నన్నారు. స్కీం వర్కర్స్ కు గత 7 సంవత్సరాల నుంచి జీతాలు పెంచలేదన్నారు. మార్కెట్లో నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగాయి అన్నారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రవాణా చార్జీలు, విద్యుత్ చార్జీలు పెరిగాయి గాని వేతనాలు మాత్రం ఒక్క రూపాయి కూడా పెరగలేదన్నారు. వేతనాలు పెంచమని అనేక ఉద్యమాలు చేసినప్పటికీ ప్రభుత్వం పెంచకపోవడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యేల జీతాలు పెంచుకుంటున్నటువంటి ఈ ప్రభుత్వం కార్మికుల జీతాలు పెంచడానికి అంగీకరించడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు కొట్లాది రూపాయలు పన్నులు రాయితీలు ఇస్తుందన్నారు. . వేతనాలు పెంచే వరకు ఎలాంటి పోరాటాల కైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్కే ఎస్ వి కుమార్ మాట్లాడుతూ స్కీం వర్కర్స్ కు ఈ కాలంలో పని భారం, వేధింపులు బాగా పెరిగాయన్నారు. అనవసరమైన యాప్లను తీసుకుని వచ్చి విపరీతంగా వేధిస్తున్నారన్నారు. అనవసర మైన యాప్లను వెంటనే రద్దు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి సభలకు జనాలను తరలించడమే వీరి పనిగా మారిందన్నారు. గతంలో స్కీమ్ వర్కర్స్ పోరాడినప్పుడు త్వరలో తమ ప్రభుత్వం వస్తుందని కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు.మహిళా అభ్యున్నతే మా ధ్యేయమని చెప్తున్నటువంటి ప్రభుత్వం మహిళలుగా ఉన్న స్కీం వర్కర్లకు వేతనాలు మాత్రం ఊపెంచట్లేదన్నారు. వేతనాలు పెంచే వరకు ఈ పోరాటం కొనసాగు తుందని తెలిపారు ప్రభుత్వం తక్షణమే వేతనాలు పెంచాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కోకన్వీనర్ ఏ సీతాలక్ష్మి అధ్యక్షత వహించగా అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్ పద్మ, మధ్యాహ్నం భోజనం పథకం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి మంగశ్రీ, ఆర్పీ యూనియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ . ఝాన్సీ, వివో ఏ సంఘం జిల్లా కార్యదర్శి అపర్ణ, స్కూల్ శానిటేషన్ యూనియన్ నాయకులు లక్ష్మీ లతో పాటు సిఐటియు జిల్లా కార్యదర్శి బి జగన్ ప్రసంగించారు. మీరు పోరాటానికి మద్దతుగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్. ఎన్.మాధవి వై సత్యవతి తమ సంఘీభావం తెలిపారు. ఇంకా ఇంటి పని వారు సంఘం కార్యదర్శి కే కుమారి, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు సత్యవతి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అనసూయ వీరికి మద్దతుగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు వా. దేవి, బృందా, తులసి, చిన్నమ్మలు, కోమలి, ఆశ యూనియన్ నాయకులు ఙ. మేరీ, సీతారత్నం, కుమారి, దయానా, లక్ష్మి, ఆర్పీ యూనియన్ నాయకులు లక్ష్మి, సత్య, హిమ బిందు, మ. భో. కా. సం. నాయకులు భవాని, సావిత్రి, రవణమ్మ, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నుండి యల్లా యమ్మ, లక్ష్మి లతోపాటు పెద్ద ఎత్తున స్కీమ్ వర్కర్లు పాల్గొన్నారు.




# కూటమి పాలనపై ఆప్యాయత పలకరింపులు

## అరకులోయ కొండవీటి కాలనీల్లో ఇంటింటికి టీడీపీ కార్యక్రమం

## నిర్వహించిన డాక్టర్ సియ్యారి దొన్ను దొర



**అరకు రూరల్, జులై 31, ప్రభాతవార్త:**

అరకులోయ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా సియ్యారి దొన్ను దొర టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో కలిసి శుక్రవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటూ పరిష్కారాలు చూపుతూ సాగింది. అరకు లోయ మండలం కొండ వీధి కాలనీ -1, కొండ వీధి కాలనీ-2 లలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అక్కడ ప్రజల వద్దకు వెళ్లి ముందుగా ఈ రెండేళ్ల నమ్మకం సంక్షేమం- అభివృద్ధి పై రూపొందించిన కరపత్రాలను అందిస్తూ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఒక తల్లికి తనకి ఉన్న ముగ్గురు పిల్లల్లో తల్లికి వందనం ఒకరికే పడిందని మిగిలిన ఇద్దరికీ పడలేదన్న దానిపై దొన్ను దొర స్పందిస్తూ ఆగస్టు 5వ తేదీ లోపు సచివాలయంలో గ్రీవెన్స్ లో మళ్ళీ అప్లై చేసుకుంటే కచ్చితంగా వస్తుందని బదులించారు. దీనికి ఆమె సంతృప్తి చెందారు. మరొకచోట అధ్వానంగా ఉన్న డ్రైనేజీని పరిశీలించి వెంటనే డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కు ఆదేశించారు. మరొకచోట డెలివరీ అయిన మహిళతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆస్పత్రిలో ఆర్థిక సాయం అందించిందా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. దానికి ఆమె బదులిస్తూ ఆర్థిక సాయం అందించడమే కాకుండా ఇంటి వద్దకే ప్రభుత్వ వాహనంలోనే దించారని చెప్పారు. మరొకరు నారా లోకేష్ పరిశ్రమల స్థాపన కోసం చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. ఇలా ఏ చోటకెళ్ళినా ప్రజలంతా కూటమి ప్రభుత్వంపై సానుకూల భావనతో ఉన్నారని, సరైన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నామని భావనను వ్యక్తం చేస్తున్నారని దొన్ను దొర పేర్కొన్నారు. ఈ సందర్భంగా దొన్ను దొర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్ల కాలంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించిందన్నారు. ఈరోజు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తామంతా ఇంటింటికి తిరుగుతున్నప్పుడు ఆ విషయం మాకు స్పష్టంగా తెలుస్తుందన్నారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగానే చంద్రబాబు నాయుడు పాలిస్తున్నారన్న విషయం స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ఆప్యాయపు పలకరింపులు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా పొందిన సాయం గురించే మాట్లాడుతున్నారని తెలిపారు.

# గ్రీవెన్స్ సమస్యలను తక్షణమే పరిష్కరించండి : దొన్నుదొర



**అరకు రూరల్, జులై 31, ప్రభాతవార్త :**

గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించడానికి ప్రయత్నించాలని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం అరకు వేలీలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజా వేదిక గ్రీవెన్స్ నిర్వహించారు. అరకు లోయ టౌన్ లో కొండ వీధి, చేపల మార్కెట్ వద్ద సిసి రోడ్డు అత్యంత అధ్వానంగా తయారయిందని వెంటనే నూతన రోడ్డు నిర్మాణానికి సహకరించాలని వినిపించారు. దీనిపై వెంటనే ఎస్టిమేట్ తయారుచేసి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదల పంచాయతీ బట్టివలసలో బోరు వేశారు గాని మోటారు గాని విద్యుత్ కనెక్షన్ గాని ట్యాం క్ గాని నిర్మించకుండా వదిలేసారని ఆ గ్రామస్తులు గ్రీవెన్స్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఈ సమస్యపై ఆర్డబ్ల్యూఎస్ డీ ఈఈతో మాట్లాడి బోరుకు కనెక్షన్ వేయించి ట్యాంక్ , టాపులు నిర్మించి వెంటనే తాగునీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని డీ ఈ ఈ గారు హామీ ఇచ్చారు. ఇవి కాకుండా నూతన పెన్షన్ల కోసం సంబంధించి వినతులు, ఇంకా గ్రామాలలో కొన్నిచోట్ల తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న విషయం గ్రీవెన్స్ దృష్టికి వచ్చింది. మరికొన్ని వ్యక్తిగత సమస్యలపై కూడా గ్రీవెన్స్ ను ఆశ్రయించారు. ప్రజలనుంచి దొన్ను దొర అర్జీలు స్వీకరించి కొన్నింటిని అక్కడకు అక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని అధికారులకు సిఫారసు చేశారు.

# సమస్యలు పరిష్కరించండి - హామీలు నెరవేర్చండి

## జిల్లా రెవెన్యూ అధికారి లోకేష్‌కు వినతిపత్రం అందజేత



**అరకు రూరల్, జులై 31, ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ సంయుక్తంగా ఇచ్చిన పిలుపుమేరకు జూలై 31న రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు డిమాండ్స్ డే శుక్రవారం నిర్వహించారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలలో, రెవిన్యూ డివిజన్ కేంద్రాలలో, నియోజకవర్గాల్లో, జిల్లాలలో మండల కేంద్రాల్లో జర్నలిస్టులు డిమాండ్స్ డే నిర్వహించారు.. ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏ సంఘాల ప్రతినిధులు విశాఖపట్నంలో సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధికి వినతి పత్రాన్ని సమర్పించారు. కర్నూలు జిల్లాలో ఫెడరేషన్ ప్రతినిధి వర్గం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. విజయవాడలో రాష్ట్ర నాయకత్వం సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ భాషాకు వినతి పత్రాన్ని అందజేయగా, ఎన్టీఆర్ జిల్లా ప్రతినిధి వర్గం జిల్లా డిఆర్ఓ కు వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఆర్డీవో కార్యాలయాలలో నియోజకవర్గ కేంద్రాలలో ఫెడరేషన్ ఏపీ బీజేఏ ఆధ్వర్యంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున డిమాండ్స్ డే నిర్వహించారు. జిల్లా కలెక్టర్లకు ప్రజాప్రతినిధులకు ఆర్డిఓకు మండల కార్యాలయాల్లో వినతి పత్రాలను సమర్పించి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. విజయవాడలో జరిగిన జర్నలిస్టు ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించిన సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఇచ్చిన హామీల నేపథ్యంలో కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ ప్రధానమైన సమస్యలు ఇంకా పెండింగ్లోనే ఉన్నాయి. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, జర్నలిస్టులకు కార్మిక భీమా సదుపాయం, వర్కింగ్ జర్నలిస్ట్ సంక్షేమ నిధి ఏర్పాటు, జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ, జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీతోపాటు జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు, సి ఆర్ మీడియా అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు, కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో తదనుగుణంగా జిల్లాల్లో సమాచార శాఖను బలోపేతం చేసి జర్నలిస్టులకు అవసరమైన సదుపాయాల కల్పన, జర్నలిస్టుల స్థితిగతుల అధ్యయనం కోసం మీడియా కమిషన్ ఏర్పాటు, ప్రభుత్వ సారథ్యంలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక పునరుద్ధరణ, వృద్ధాప్యంలోని జర్నలిస్టులకు వృద్ధాశ్రమ నిర్మాణం సమస్యల పరిష్కరించాలని అల్లూరి జిల్లా రెవిన్యూ అధికారి లోకేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. అధ్యక్ష కార్యదర్సులు పి.డి.చక్రవర్తి, షేక్ రహీంతుల్లా, ఉపాధ్యక్షుడు కొర్రా కృష్ణారావు, మిన్నా నాయక్, రమణ, నాని, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

# బత్తునూరు వాగుపై వంతెన నిర్మించాలి

## 10 గ్రామాల ప్రజల డిమాండ్



**గూడెంకొత్తవీధి, జూలై 31, ప్రభాతవార్త :**

మండలం గాలికొండ పంచాయతీ బత్తునూరు గ్రామానికి చెందిన ప్రజలు బత్తునూరు వాగుపై వంతెన నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు గడిచినా తమ సమస్యకు పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వాగు ఉప్పొంగడంతో బత్తునూరుతో పాటు సుమారు 10 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని తెలిపారు. అత్యవసర వైద్య సేవలు, గర్భిణుల తరలింపు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది రాకపోకలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం కలెక్టర్, ఐటీడీఏ పీఓ, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇటీవల గూడెం నుంచి తిరిగి వస్తుండగా వాగు ఉప్పొంగి ప్రాణాలను పణంగా పెట్టుకుని దాటాల్సి వచ్చిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బత్తునూరు వాగుపై శాశ్వత వంతెన నిర్మించి, 10 గ్రామాల ప్రజల సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమంలో ప్రభుత్వం ముందంజ

## టీడీపీ మండల అధ్యక్షురాలు, మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు గ్రహీత కిల్లో సన్యాసమ్మ



**ముంచంగిపుట్టు, జూలై 31, (ప్రభాతవార్త)**

అరకు నియోజకవర్గం ముంచంగిపుట్టు మండలం మండల కేంద్రంలో శుక్రవారం నాడు నిర్వహించిన “రెండేళ్ల నమ్మకం - సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటికీ తెలుగుదేశం” కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ (సంధ్య) పార్టీ నాయకులు,పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి మరియు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లను దేశంలో ఎక్కడ లేని విదంగా పెంచి ప్రతి నెల లబ్ధిదారులకు అందిస్తున్నామని, గృహిణులకు గ్యాస్ సిలిండర్లపై రాయితీలు కల్పిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం తల్లికివందనం పథకాన్ని ఒక కుటుంబానికి ఎంతమంది పిల్లలు ఉంటే అంత మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇంస్తున్నం, రైతులకు సబ్సిడీకి అవసరమైన పని ముట్లు అందిస్తున్నాం , ఆటో డ్రైవర్- సేవలో,ఎన్టీఆర్ గృహాలు, అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఎలాంటి వివక్ష లేకుండా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులను కూడా పారదర్శకంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరిస్తున్నారని, ఎవరైనా అర్హులు పథకాల నుంచి దూరంగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సన్యాసమ్మ సంధ్య ప్రజలను కోరారు. మాజీ అరకు పార్లమెంట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ దారెల పంచాయతీ మాజీ ఎంపీటీసీ పాంగి శాస్త్రిబాబు, మాజీ మండల ఆంధ్యక్షులు కిల్లో బలరాం,మాజీ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ రాణాసింగి నీలకంఠం పాత్రో, ఈఎన్‌టియు కార్యదర్శి గొల్లోరి రఘునాథ్, బూత్ ఇంచార్జ్ నాయకం తరుణ్,యువ నాయకుడు అనిల్ కుమార్, గోపాల స్వామి పాల్గొన్నారు.

# 1/70 చట్ట పరిరక్షణకు 7న ఆదివాసుల అరణ్య గర్జన



**గూడెంకొత్తవీధి, జూలై 31, ప్రభాతవార్త :**

గిరిజనుల భూములు, రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించనున్న “ఆదివాసుల అరణ్య గర్జన”సభకు వేలాదిగా ఆదివాసులు తరలిరావాలని ఆదివాసీ జేఏసీ, గిరిజన ఉద్యోగ సంఘాలు, మహిళా సంఘాలు, పీసా కమిటీలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాడేరులో ఆగస్టు 7న జరగబోయే “ఆదివాసుల అరణ్య గర్జన”సభకు విచ్చేసి జయప్రదం చేయాలని,1/70 చట్టమే గిరిజనుల భూములకు రక్షణ కవచమని, అదే ఆదివాసుల ఆత్మ గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. గిరిజనుల భూముల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వాలు చిత్తశుద్ధితో గిరిజనుల చట్టాలు, రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించాలని కోరుతూ, అరణ్య గర్జన సభను విజయవంతం చేయడానికి అన్ని గ్రామాల నుంచి ఆదివాసులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# అల్లూరి జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల



**పాడేరు,జూలై 31, ప్రభాతవార్త:**

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.నిశాంతి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం లో భాగంగా 31.07.2026 నాటికి తుది ముసాయిదా ఓటరు జాబితాను సిద్ధం చేసి, గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు సాఫ్ట్ కాపీలను అందజేసినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుండి అర్హులైన ఓటర్లందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, వాటి డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంటింటి సర్వే అనంతరం బూత్ లెవల్ అధికారులు బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి, సమావేశాల మినిట్స్‌ను నమోదు చేసి, ఎన్నికల సంఘం యాప్‌లో అప్లోడ్ చేసి నిర్దేశించిన అన్ని ప్రక్రియలను పూర్తి చేసిన అనంతరం తుది ముసాయిదా ఓటరు జాబితాను రూపొందించి గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలకు సాఫ్ట్ కాపీలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 624 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. హేతుబద్ధీకరణలో భాగంగా 27 కొత్త పోలింగ్ స్టేషన్లను ప్రతిపాదించారు. దీంతో ఎన్నికల సంఘం ఆమోదానికి లోబడి జిల్లాలో మొత్తం 651 పోలింగ్ స్టేషన్లు ఉండనున్నాయి.

# పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**పాడేరు,జూలై31,ప్రభాతవార్త:**

పేదరికం లేని సమాజమే కూటమి ప్రభుత్వ లక్ష్యం కార్యక్రమంలో. భాగంగా. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమాన్న పదవ క్లస్టర్ ఇంచార్జి. డప్పోడి వెంకట రమణ ఆధ్వర్యంలో పాడేరు మండలం లగిసపల్లి పంచాయతీ కాడలి పంచాయతీ.గురుపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి పాంప్లెట్ ఇచ్చి పథకాలు తెలియజేయడం జరిగింది. తల్లికి వందనం శ్రీ శక్తి. 2.0 హౌసింగ్. అన్నదాత సుఖీభవ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్ని అడిగి తెలుసుకుని వారికి ప్రభుత్వం చేసే కార్యక్రమాలు తెలియజేయటం జరిగింది. కార్యక్రమానికి పదవ కో క్లస్టర్ కూడా రాజేష్ లగిసపల్లి, మాజీ సర్పంచ్ లకె పార్వతమ్మ, 285 బూత్ కన్వీనర్, పాడేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుద్ధ జ్యోతి కిరణ్, మహిళలు , తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు అన్న సమారాధన



**పాడేరు,జూలై31,ప్రభాతవార్త:**

గిరిజన ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ ,పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మే రకు శుక్రవారం విశాఖపట్నం వాస్తవ్యులు లాల్ జన్మదిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఏఎస్ఐ నారాయణరావు దంపతుల ఆర్థిక సహాయంతో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సుదీర్ఘ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. కార్యక్రమానికి మాజీ జెడ్పిటిసి రొబ్బ ఉషారాణి, కరాటే మాస్టర్ బాకురు పాండురాజు మరియు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు ఆలయ కమిటీ సభ్యులు చల్ల రామకృష్ణ బోనంగి వెంకటరమణ కిల్లు చంద్రమోహన్ కుమార్ కొణతాల సతీష్ దన్నెటి పలాసి రాము గూడెపు సూర్య ప్రకాష్ బింగనపల్లి హరిబాబు కూర రాము జంపారంగి సత్తిబాబు కురసా లక్ష్మయ్యలకీ రత్నబాయి దిలీప్ తమ్మర్భ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# వంతెనపై నిలువ ఉండిపోతున్న వర్షపు నీరు



**డుంబ్రిగూడ, జులై 31, ప్రభాతవార్త:**

మండలంలోని ఆంధ్ర ఒడిస్సా రహదారిలో శరత్‌నగర్ వంతెన వద్ద వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉండిపోతుం డడంతో ప్రయాణించే వాహనదారులు బాటస చారులు పలుబందులకు గురవుతున్నారు. శుక్రవారం కురిసిన వర్షానికి ఆ వంతెన వద్ద వర్షం నీరు నిల్వ ఉండడంతో చెరువు ను తలపించింది. వర్షం నీరు నిల్వ ఉండడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని, వాహనదారులు భాటచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు , ప్రయాణికులు కోరుతున్నారు.

# అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవ వేడుకలకు గిరిజన ఆశ్రమ విద్యార్థుల థింసా నృత్యం



**ముంచంగిపుట్టు, జూలై 31, (ప్రభాతవార్త):**

రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భోగాపురంలో నిర్మించిన విమానాశ్రయం అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేడుకలు ఆగస్టు 1, 2026న ఘనంగా జరుగుతున్నాయి. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి మన గిరిజన ప్రాంత థింసా నృత్యం రాష్ట్ర దేశం మరియు భవిష్యత్తును తెలియజేసేలా ముంచంగిపుట్టు మండలం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో భాగంగా మన రాష్ట్ర గిరిజన సంస్కృతిని చాటిచెప్పేలా వేలాది మంది విద్యార్థినులు ప్రసిద్ధ ‘థింసా’ నృత్య ప్రదర్శనలో పాల్గొని అద్భుతంగా ప్రదర్శించారు. దేశ ప్రగతికి ప్రతీకగా నిలిచే ఇలాంటి గొప్ప ప్రాజెక్ట్ ప్రారంభాన్ని స్వయంగా చూడటం విద్యార్థులకు ఒక అద్భుతమైన అనుభవంగా నిలిచింది. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో విమానాశ్రయాల పాత్ర ఎంత ముఖ్యమో ముంచంగిపుట్టు మండలం ఆశ్రమ గిరిజన విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

# పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి



**పాడేరు,జూలై 31,ప్రభాతవార్త :**

కార్మిక స్కీం వర్కర్ల లోకం, జీతాలు పెంచడం తప్ప మరో మార్గం లేదని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు, బోనంగి చిన్నయ్య పడాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, శుక్రవారం పాడేరు జూనియర్ కళాశాల నుండి మెయిన్ రోడ్ మీదుగా కలెక్టరేట్ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా నిర్వహించారు. కార్మికులు గేటు ముందు కూర్చొని ధర్నా చేస్తుండగానే సంబంధిత కలెక్టర్ వాహనం వచ్చింది బైక్ నుండి వచ్చిన వాహనం లోనకు వెళ్లడానికి అంగీకరించలేదు పోలీసులు సిబ్బంది ఎంత చెప్పినా వాహనాన్ని వెనకలకి పంపించారే తప్ప ముందుకు కార్మిక లోకం పోనివ్వలేదు, అనంతరం జరిగిన నిరసన సభలో, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, లింగేరి సుందర్ రావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటి జిల్లా అధ్యక్షులు, చిన్నయపడాల్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న, అంగన్వాడి ఆశ సిహెచ్ డబ్ల్యు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకెపి సిబ్బందికి జీతాలు పెంచక చాలీచాలని జీతాలతో తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు, ధరలు పెరుగు దలకు అనుగుణంగా జీతాలు పెంచవలసి ఉండగా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని మండపడ్డారు, ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు కూడా స్కీమ్ వర్కర్లకు ఇవ్వలేదని ఆరోపించారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, భాగ్యలక్ష్మి, మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, సోమ్ దేవి పసుపులేటి లక్ష్మి, ఆశ సిహెచ్ డబ్ల్యూల సంఘం నాయకులు, రేణుక, దాసమ్మ,సరస్వతి,ఐకెపిజిల్లా నాయకులు, రాజ్ కుమార్, ఐటిడిఏ లైసెన్ వర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు శ్రీను,వాలంటీర్ల జిల్లా అధ్యక్షులు ఏం. ప్రసాద్ రావు, సత్యారావు, సి ఐ టి యు నాయకులు మోస్య, శంకర్ పాల్గొన్నారు. సంబంధిత డిఆర్ఓ, అంగన్వాడి పీడి లకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తమతో రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

# పాడేరులో వినూత్న డ్రోన్ వీడియో చిత్రీకరణ



**పాడేరు,జూలై31,ప్రభాతవార్త:**

అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జిల్లాలో నిర్వహించిన వినూత్న డ్రోన్ వీడియో చిత్రీకరణ కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. జిల్లా చరిత్రలో తొలిసారిగా ఇంత భారీ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమం విశేష ఆదరణ పొందింది. పాడేరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ టి. నిశాంతి పాల్గొన్నారు. ఈ షోకిప్రజాప్రతినిధులు పోలీసు శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం పాడేరు, తలరాసింగిలోని సి.ఏ.హెచ్. పాఠశాల విద్యార్థులు ఈ వినూత్న డ్రోన్ వీడియో చిత్రీకరణను ఎంతో ఆసక్తిగా, ఆనందంగా వీక్షించారు. ఆకాశంలో డ్రోన్‌ల సమన్వయంతో సాగిన చిత్రీకరణ వారిని విశేషంగా ఆకట్టుకుంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూనే అల్లూరి సీతారామరాజు జిల్లా సహజసౌందర్యం, గిరిజన సంస్కృతి, పర్యాటక విశిష్టత, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా ఈ డ్రోన్ వీడియో చిత్రీకరణ అత్యంత ఆకర్షణీయంగా నిర్వహించబడింది. ఈ వినూత్న కార్యక్రమాన్ని తిలకించిన ప్రతి ఒక్కరూ ప్రశంసలు కురిపిస్తూ, జిల్లా యంత్రాంగం చేపట్టిన ఈ ప్రత్యేక ప్రయత్నాన్ని అభినందించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ప్రచారానికి ఈ డ్రోన్ వీడియో చిత్రీకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## టీడీపీ డివిజన్ నాయకుడు మాజీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి



**ముంచంగిపుట్టు , జూలై 31, (ప్రభాతవార్త):**

సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ముంచంగిపుట్టు మండలం దారెలా పంచాయతీ పంచాయతీ పరిధిలో డింగూడ గ్రామంలో శుక్రవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ డివిజన్ నాయకుడు మాజీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి ముఖ్యఅతిథిగా హాజరై ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన మేలుని వివరించారు. ఏ సంక్షేమ పథకంలో ఎవరెవరికి ఎంత లబ్ధి చేకూరిందో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నమ్మకం రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమంపై రూపొందించిన కరపత్రాలను వారికి అందించారు. టీడీపీ డివిజన్ నేత మాజీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిరిజన సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వంలోని గిరిజన ప్రాంతంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. ప్రతి గ్రామానికి రహదారులు, సిసి రోడ్లు మంజూరు చేస్తూ నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత పాటిస్తున్నారన్నారు. పార్టీలకు ప్రత్యేకంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు పథకాల అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని కుటుంబాలకు మేలు జరిగిందన్నారు . కార్యక్రమంలో టీడీపి నాయకులు చవిటియ గోపాలం, తాంగుల మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేద్దాం

## క్యాడర్ సమావేశంలో డాక్టర్ సియ్యారి దొన్ను దొర



**అరకు రూరల్, జూలై 31, ప్రభాత వార్త :**

అత్యంత వేడుకగా జరగబోయే భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. అరకు లోయలోని తన క్యాంపు కార్యాలయంలో క్యాడర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రకే భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు ఎయిర్పోర్ట్ మణిహారం అని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఇది ప్రత్యేకమైనదని అన్నారు. వలసల ప్రాంతంగా ఉన్న ఉత్తరాంధ్ర ఈరోజు పదిమందికి అన్నం పెట్టే ప్రాంతంగా మారిపోతుందని తెలిపారు. ఒకపక్క భోగాపురం ఎయిర్ పోర్టు మరోపక్క విశాఖపట్నంలో గూగుల్ వంటి కంపెనీలను తీసుకొచ్చి ఇక్కడ యువతకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఉత్తరాంధ్ర వలసల ప్రాంతం నుంచి ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా ఎదగబోతుందన్నారు.

1-8Pg7exHMNWJQE.qxd:1-8Pg7exHMNWJQE.qxd 1/1/02 7:18 AM Page 1



# మొరాకో నుంచి స్యూటాలోకి 60వేల మంది చొరబాటు

● వలసజీవుల కట్టడి కోసం సైన్యం మొహరింపు ● తొక్కిసలాటలో 34 మంది మృతి



**మాడ్రిడ్, జులై 31:** మొరాకో నుంచి స్పెయిన్‌కు చెందిన ఉత్తర ఆఫ్రికా స్వయం ప్రతిపత్తి ప్రాంతమైన స్యూటాలోకి వేలాది మంది వలస దారులు ఒక్కసారిగా ప్రవేశించడం తో అక్కడి పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. స్థానిక పోలీసు బలగాలు పరిస్థితిని అదుపులోకి తీసుకు రాలేక పోవడంతో స్పెయిన్ ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించింది. సరిహద్దు భద్రతను బలోపేతం చేయడంతో పాటు పోలీసులకు సహా యంగా సైనిక బలగాలను మోహరించింది. వలసదారుల్లో చాలామంది సరిహద్దు కంచెను ఈదుకుంటూ సముద్ర మార్గంలో స్యూటాలోకి చేరగా, మరికొందరు బ్రేక్‌వాటర్ల ద్వారా కాలినడకన ప్రవేశించారు. ఒక్కసారిగా భారీ సంఖ్యలో వలసదారులు రావడంతో ఆశ్రయ కేంద్రాలు కిక్కిరిసి పోయాయి. తొక్కిసలాటలో 34 మంది చనిపోయారు. ప్రభుత్వ డేటా ప్రకారం సుమారు 60వేల మందికిపైగా వలసజీవులు ఒక్కసారిగా క్యూటాలోకి చొచ్చుకుని వచ్చినట్లు స్పెయిన్‌ప్రధాని పెట్రో శాంచెజ్ ప్రకటించారు. స్థానిక అధికారులు దీనిని మానవతా, సామాజిక అత్యవసర పరిస్థితిగా అభివర్ణించారు. స్యూటాలో భద్రతా పరిస్థితిని మెరుగుపర్చేందుకు సివిల్ గార్డుకు సైన్యం సహకరిస్తోందని స్పెయిన్ ప్రభుత్వం వెల్లడించింది. అదనంగా కోస్ట్‌గార్డ్ నౌకలు, డైవింగ్ బృందాలను కూడా మోహరించారు. పరిస్థితిని ప్రత్యక్షంగా సమీక్షించేందుకు స్పెయిన్ అంతర్గత వ్యవహా రాల మంత్రి ఫెర్నాండో గ్రాండేమార్లాస్కా స్యూటా పర్యటించనున్నారు. స్యూటా, మెలిల్లా స్పెయిన్‌కు చెందిన ఉత్తర ఆఫ్రికాలోని రెండు స్వయంప్రతిపత్తి ప్రాంతాలు. ఇవే యూరోపియన్ యూనియన్‌కు ఆఫ్రికాతో ఉన్న ఏకైక భూసరిహద్దులు కావడంతో యూరప్ చేరాలనుకునే వలసదారులకు ప్రధాన ప్రవేశ ద్వారాలుగా మారాయి. 1580 నుంచి స్పెయిన్ ఆధీనంలో ఉన్న స్యూటాలో సుమారు 85 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ క్రైస్తవులు, ముస్లింలతో పాటు స్పానిష్, మొరాకో మూలాల ప్రజలు నివసిస్తున్నారు. అయితే మొరాకో మాత్రం స్యూటా, మెలిల్లాలను స్పెయిన్ భూభాగాలుగా అధికారికంగా గుర్తించకుండా, ఆక్రమిత ప్రాంతాలుగా పేర్కొంటోంది. స్పెయిన్ భూభాగంలోకి నేరుగా ప్రవేశించే అవకాశం ఉండటంతో మెరుగైన ఉపాధి, భద్రత కోసం యూరప్‌కు చేరాలనుకునే వలసదారులు స్యూటాను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మొరాకో తీర ప్రాంతాల నుంచి ఈదుకుంటూ రావడం, కంచెలను దాటేందుకు ప్రయత్నించడం తరచుగా జరుగుతోంది. ఇప్పటికే 1,500మందికిపైగా వలసదారులు స్యూటాకు చేరగా, గురువారం మరోసారి వేలాది మంది రావడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఆశ్రయ కేంద్రాల్లో ఖాళీ లేకపోవడంతో కొత్తగా వచ్చిన వారికి వసతి కల్పించడం అధికారులకు సవాల్‌గా మారింది. ముఖ్యంగా తల్లిదండ్రులు లేని మైనర్ బాలల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలు తమ సామర్థ్యానికి 2,400 శాతం మేర అధికంగా నిండిపోయినట్లు అధికారులు తెలిపారు. స్థానిక భద్రతా సిబ్బంది పరిస్థితిని నియంత్రించలేకపోవడం తోనే సైన్యాన్ని రంగంలోకి దించాల్సి వచ్చిందని స్పెయిన్ ప్రభుత్వం పేర్కొం ది. సివిల్ గార్డ్ ప్రతినిధులు పరిస్థితిని "పూర్తి గందరగోళం"గా అభివర్ణిస్తూ, సరిహద్దు వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని వ్యాఖ్యానించారు.

## డా. నోరి దత్తాత్రేయుడికి పద్మభూషణ్

# దేశానికే గర్వకారణం

### కేంద్రహోంమంత్రి అమిత్‌షా అభినందన లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 31:** ప్రముఖ కేన్సర్ వైద్య నిపుణులు డా. దతా త్రేయుడు నోరికి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేయడం పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హర్షం వ్యక్తం చేశారు. వైద్యరంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా దక్కిన ఈ పురస్కారం పట్ల సంతోషం వ్యక్తంచేస్తూ, డా. నోరికి హోంమంత్రి ఒక ప్రత్యేక అభినందన లేఖ పంపారు. కేన్సర్ చికిత్స, పరిశోధన రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలు నెలకొల్పి, ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించిన డా. నోరి సేవలను అమిత్‌షా ఈ లేఖలో విశేషంగా కొనియాడారు. విజ్ఞానం, సేవ, సహానుభూతి కల బోసిన ఆయన వైద్య ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో పద్మ పురస్కారాలకు సరికొత్త అర్థం చేకూరిందని హోంమంత్రి స్పష్టం చేశారు. కేవలం ప్రశంసల కోసం కాకుండా, సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసే నిజమైన మౌనసాధకులకు, కర్మయోగులకు నేడు జాతీయ పురస్కారాలు దక్కుతున్నాయని పేర్కొన్నారు. రోగుల సం క్షేమం పట్ల డా. నోరి కనబరుస్తున్న అంకితభావం కేవలం వ్యక్తిగత విజయం కాదని, అది స్వార్థరహిత విలువలపై నిలబడి దేశప్రగతికి దిశానిర్దేశంచేసే దేశభక్తికి నిదర్శనమని హోంమంత్రి అన్నారు. పరోపకారం విశిష్టతను తెలిపే సంస్కృత శ్లోకాన్ని ఉదహరించిన అమిత్‌షా.. డా. నోరి సంపూర్ణ ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో మరింత కాలంపాటు సమాజానికి తన అమూల్యమైన సేవలను అందించాలని ఆకాంక్షిస్తూ తన లేఖను ముగించారు.

# కుప్పకూలిన భవనం.. 9 మంది మృతి



**భివాండి, జులై 31:** ముంబైకి దగ్గరలో ఉన్న భివాండిలోని బాలాజీనగర్ ప్రాంతంలో గురువారం రాత్రి సుమారు 11:30 సమయంలో నాలుగు అంతస్తుల భవనం కూలింది. ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. ఈ భవనంలో ప్రతి అంతస్తుకు 12 గదుల చొప్పున మొత్తం 48 గదులు ఉన్నాయి. ఈ భవనం కూలిపోయే ప్రమాదం ఉందని అధికారులు తెలిపారు. దీంతో అక్కడ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సమయంలో భవనం కూలిపోయింది. రాత్రి 9 గంటల సమయంలో భవనం నుంచి విరిగిపడుతున్న శబ్దం రావడంతో స్థానికులు అధికారులకు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి భవనంలోని కొన్ని కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఇంకా కొంతమందిని తరలించే క్రమంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. అగ్నిమాపక సిబ్బంది శిథిలాలు తొలగించి మృతదేహాలను వెలికితీశారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. నాలుగు అంతస్తుల కోహినూర్ భవనంలో ఒక్కో అంతస్తులో 12 గదుల చొప్పున మొత్తం 48గదులు ఉన్నాయి. పాత భవనం కావడంతో మున్సిపల్ అధికారులు ఇప్పటికే దానిని నివాసయోగ్యం కానిదిగా ప్రకటించారు.

# షూటింగ్‌లో నటి రష్మికకు గాయం



**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త :** ప్రముఖ సినీనటి రష్మిక మందన్న గాయపడ్డారు. సినిమా షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుం డగా ఈ ఘటన చోటుచేసుకుంది. తుంటి భాగంలో బలమైన గాయమై నట్లు వైద్యులు గుర్తించారు. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వారు సూచించారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో ఆమె నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' కథానాయిక ప్రాధాన్యమున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న 'మైసా'కు సంబంధించిన కీలక యాక్షన్ సన్నివేశాలతో పాటు అండర్ వాటర్ స్వీక్వెన్స్‌ను ఇటీవల పూర్తి చేశారు. తాజాగా ఓ పాటను షూట్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఆమెకు పూర్తిగా ఆరు వారాలు విశ్రాంతి సూచించారు డాక్టర్లు. దాంతో, తెలుగింటి కోడలు కొన్ని వారాలు షూటింగ్‌కు దూరం కానుంది. మరోవైపు విజయ్ దేవరకొండతో కలిసి రష్మిక 'రణబాలి'లో నటిస్తున్నారు. రాహుల్ సాంకృత్యన్ దర్శకుడు. ఈ ఏడాది సెప్టెంబరు 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

**టాలీవుడ్‌ను వెంటాడుతున్న గాయాలు..**

ఈ యేడాది తెలుగు సినీనటులు వరుసగా గాయాల పాలవుతున్నారు. ఇటీవల అగ్ర కథానాయకుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 'ఎన్‌బికె 111' షూటింగ్‌లో గాయపడగా, ఆయనకు హైదరాబాద్‌లో ఎఐజీ ఆస్పత్రి వైద్యులు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాలకృష్ణ కోలుకుంటున్నారు. నందమూరి జూనియర్ ఎన్టీఆర్ భుజానికి కూడా గాయమైంది. ఆయన గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల విశ్రాంతి అవసరమని వైద్య బృందం సూచించింది. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'డ్రాగన్' చేస్తున్నారు. 'పెద్ది' షూటింగ్‌లో ప్రముఖ నటుడు రామ్‌చరణ్ మణికట్టుకు గాయమవగా, ఇటీవల కోయంబత్తూర్ వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రముఖ నటుడు మెగాస్టార్ చిరంజీవి కూడా చేతికి బెల్ట్‌తో కనిపించారు. గత కొంతకాలంగా భుజం గాయంతో బాధపడుతున్న ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ నటుడు పవన్‌కల్యాణ్ ఇటీవల ముంబయిలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే.

# దుర్గమ్మకి భక్తిశ్రద్ధలతో ఆషాఢం సారె

**ఇంద్రకీలాద్రి, జులై 31 ప్రభాతవార్త:** ఆషాఢం సారె తెచ్చిన భక్తజనం భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకి సమర్పించారు. శుక్రవారం కావడంతో రద్దీ పెరిగింది. శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్ర కీలాద్రికి 18వ రోజు పెద్దఎత్తున మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. భక్తుల రద్దీ ఎక్కువగా వుండడంతో ఇఓ వికె శీనా నాయక్ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2.30 వరకు రు.500 అంతరాలయ దర్శనం, విఐపి దర్శనాలను రద్దు చేశారు. దీంతో భక్తులకు త్వరితంగా దర్శనమయింది. భక్తులందరికి క్యూలైన్లలో త్రాగడానికి మంచినీరు, దర్శనం అనంరం ఉచిత భోజనం, ఉచిత ప్రసాద వితరణ అందేలా ఇఓ చర్యలు తీసుకున్నారు. దుర్గమ్మని సిసిఎల్ఎ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి. జయలక్ష్మి కుటుంబంతో సహా దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదము, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేద ఆశీర్వచనం పలికారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన ఎం.వెంకట్రావు రూ.1,00,000 విరాళము శుక్రవారం సమర్పించారు. వారికి వేద పండితులు వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

**ఆనంద డోలికల్లో ఊగిసలాడిన భక్తసంద్రం:** ఇంద్రకీలాద్రిపై శుక్రవారం భరత నృత్య ప్రదర్శన భక్తులను ఆనంద డోలికల్లో ముంచెత్తింది. ఆధ్యాత్మిక భావనను పెంపొందించేలా నిర్వహిస్తున్న 'ధర్మపథం' సాంస్కృతిక కార్యక్రమాల్లో గుడివాడకు చెందిన సరితా నెహ్రూ బృందం శాస్త్రీయ నృత్య రీతులతో దేవతా మూర్తులను కీర్తిస్తూ పలు ఆధ్యాత్మిక, భక్తిరసపూరిత కీర్తనలకు అద్భుతమైన అభినయాన్ని, నృత్య రీతులను ప్రదర్శించగా భక్తులు ఆద్యంతం ఆసక్తిగా తిలకించి, కళాకారుల ప్రతిభను కరతాళ ధ్వనులతో అభినందించారు. ఆలయ అధికారులు ప్రదర్శన ఇచ్చిన కళాకారులను ఘనంగా సత్కరించి, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

**ఆగస్టు 13నుండి శ్రావణమాసం ఉత్సవాలు:** దుర్గమ్మ ఆలయంలో ఆగస్టు 13 నుండి శ్రావణమాసం ఉత్సవాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఆగస్టు 21న శ్రీవరలక్ష్మి వ్రతం, 4వ శుక్రవారం సామూహిక శ్రీవరలక్ష్మి వ్రతాలు (ఉచితం, ఆర్జితం సేవలుగా) నిర్వహిస్తామన్నారు.

**పవిత్రోత్సవాలు:** ఆగస్టు 27 నుండి 29 వరకు దుర్గమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. జ్ఞాతాజ్ఞాత సంబంధమైన స్పర్శాదోష నివారణకు నిర్వహించే ఈ పవిత్రోత్సవంలో మొదటిరోజు ఆగస్టు 26వ తేదీన సాయంత్రం 4 గంటలకు ఉదకశాంతి, 27వ తేదీ ఉదయం3 గంటలకు సుప్రభాతం, స్నపనాభిషేకం, పవిత్ర మాలధారణ జరిపిస్తామని ఉదయం 8 గంటల నుండి సర్వదర్శనం వుంటుందన్నారు. 27 ఉదయం గణపతి పూజతో ప్రారంభించి 27, 28 తేదీల్లో మండపారాధన, అగ్నిప్రతిష్టాపన, సర్వప్రాయశ్చిత్తవిధి, దేవతారాధన, సాయంత్రం 4 గంటలకు మూలమంత్ర హవనములు, వేదపారాయణ, నీరాజనం, మంత్రపుష్పం, 29వ తేదీన పై పూజాదికాలతో పాటు శాంతి పౌష్టిక హోమాలు, కూష్మాండబలి, ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. ఈ ఆర్జిత సేవల 3రోజుల్లో ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలు అర్చకస్వాములు ఏకాంతంగా నిర్వహిస్తారన్నారు.

**సెప్టెంబర్ 4న శ్రీకృష్ణ జన్మాష్టమి:** సెప్టెంబర్ 4వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు దుర్గమ్మ సన్నిధిలో నిర్వహిస్తామని ఇఓ తెలిపారు. ఉదయం 8 గంటలకు అనివేటి మండపంలో శ్రీకృష్ణునికి పూజలు, సాయంత్రం దేవస్థానపండితులతో పురాణ ప్రవచనం, ఉట్టి కొట్టుట నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొనాలన్నారు.



దుర్గమ్మకు ఆషాఢం సారెను తీసుకొచ్చిన భక్తులు

# 19 యేళ్ల తర్వాత కోల్‌కతాకు వచ్చిన బంగ్లా రచయిత్రి తస్లీమా నస్రీన్



**కోల్‌కతా, జులై 31:** బంగ్లాదేశీ రచయిత, సామాజిక కార్యకర్తర తస్లీమా నస్రీమ్ సుమారు 19 యేళ్ల తర్వాత మళ్లీ కోల్‌కతాకు చేరుకున్నారు. తస్లీమా రచనలను వ్యతిరేకిస్తూ 2007లో బెంగాల్‌లో నిరసనలు జరి గాయి. ఆ సమయంలో ఆమెను నగరం నుంచి బలవంతంగా వెళ్ల గొట్టారు. 19 యేళ్ల బ్రేక్ తర్వాత ఇవాళ ఆమె కోల్‌కతాకు వచ్చారు. భారీ భద్రత నడుమ నేతాజీ సుభాష్ చంద్రబాస్ విమానా శ్రయానికి ఆమె చేరుకున్నారు. మానవ హక్కుల సంఘాలు నిర్వహించే కార్యక్రమాల్లో ఆమె పాల్గొన నున్నారు. బంగ్లాదేశ్‌లోని మిమెన్‌సింగ్‌లో ఆమె 1962లో జన్మించారు. ఫిజీ షియన్ అయిన ఆమె రచయిత కూడా. నవలలు, వ్యాసాలు, మెమోయిర్స్ రాశారు. మహిళల హక్కులు, సెక్యూలరిజం, భావ స్వేచ్ఛ, మత ఛాందసవాదులను విమర్శిస్తూ ఆమె చాలా రాశారు. 1993లో తస్లీమా రాసిన లజ్జ అనే నవల చాలా ఫేమస్ అయ్యింది. దాంతో ఆమెకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చింది.

# పర్యాటకంగా ఆకట్టుకునేలా అమరావతి

● ప్రత్యేక ఆకర్షణగా స్నో వరల్డ్, ప్లానెటేరియం



**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి రాజధానిని పర్యాటక ఆకర్షక నగరంగా ప్రభుత్వం తీర్చిదిద్దుతున్నది. ఎక్కడిక్కడ టూరిజం స్పాట్లను అమలు చేస్తోంది. శాఖమూరు సెంట్రల్ పార్కులో 50 ఎకరాల్లో ఎడ్వంచర్ పార్క్, ఎమ్యూజ్‌మెంట్ పార్క్, ఎకో టూరిజం రిసార్ట్‌లను అభివృద్ధి చేయనుంది. ఎడ్వంచర్ పార్క్‌కి 15, ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌కి 25, ఎకో టూరిజం రిసార్ట్‌కి పది ఎకరాల చొప్పున ఇప్పటికే కేటాయించింది. ఎడ్వంచర్ పార్క్‌లో స్నో వరల్డ్, 8కె రిజల్యూషన్‌తో అత్యాధునిక ప్లానెటేరియం వంటివి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసీ) పర్యవేక్షణలో ఈ ప్రాజెక్టులు చేపడుతున్నారు. ఈ మూడు ప్రాజెక్టులకు 2019కి ముందు ఒప్పందం చేసుకున్న డెవలపర్లనే కొనసాగిస్తున్నారు. వెట్, డ్రై రైడ్‌లు, వాటర్ స్పోర్ట్స్‌తో ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌ను అభివృద్ధి చేయనున్నారు. రివర్‌బే అమరావతి ఎంటర్‌టైన్‌మెంట్స్ అనే సంస్థ డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డిబిఎఫ్ఓటి) విధానంలో ఈ ప్రాజెక్టు చేపట్టింది. దీనిలో 29-30 వరకు వాటర్ స్లైడ్‌లు రైడ్‌లు, వేవ్ పూల్ వంటి ప్రత్యేక ఆకర్షణలు ఉంటాయి. ఈ ప్రాజెక్టుకు వంద కోట్లకు పైగా వ్యయమవుతుందని అంచనా. ఏడాదిలో ప్రాజెక్టు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పిల్లలకు ఇంటరాక్టివ్ ఎడ్యుకేషన్ గేమ్స్, వినోదం కోసం 15 ఎకరాల్లో ఎడ్వంచర్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దీనిలో 20-35 ఆటలు ఉంటాయి. ఏడాది పొడవునా 5 డిగ్రీల ఉష్ణోగ్రతతో స్నో వరల్డ్, జిప్‌లైన్ టూర్లు, క్లైంబింగ్ వాల్స్, హై రోప్ కోర్సు, స్కైవాక్ ఛాలెంజ్, నెట్ క్లైంబ్ ఫన్, జెయింట్ స్వింగ్, బంగీ జంప్, బంపర్ కార్స్ ఎరీనా, కిడ్స్ పార్టీ జోన్, కార్నివాల్ సిస్టమ్స్ వంటివి పిల్లల్ని అలరిస్తాయి. దీనికి సుమారు రూ.40 కోట్ల నుంచి రూ.45 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. దీన్ని ఏడాదిలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

పది ఎకరాల విస్తీర్ణంలో ఎకో టూరిజం రిసార్ట్ ప్రాజెక్టు చేపట్టారు. శారద రోడ్‌వేస్ సంస్థ ఈ ప్రాజెక్టు డెవలపర్‌గా ఉంది. రిసార్ట్ పనులు 2019కి ముందే మొదలు పెట్టారు. లండన్ 'ఐ' తరహాలో భారీ జెయింట్‌వీల్ నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పిలిచింది. ఈ క్రమంలోనే శాఖమూరు సెంట్రల్ పార్కులో 50 ఎకరాల్లో ఎడ్వంచర్ పార్క్, ఎమ్యూజ్‌మెంట్ పార్క్, ఎకో టూరిజం రిసార్ట్‌లను అభివృద్ధి చేయనుంది. 64 సూట్ రూమ్స్ సహా 100కు పైగా గదులతో రిసార్ట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో 16 సూట్ రూమ్‌లు రెండు నెలల్లో శ్లాబ్ దశకు చేరుకుంటాయి. ఈ ప్రాజెక్టుకు రూ.50 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా. దీనిలో కట్టడాల నిర్మాణానికి పర్యావరణ అనుకూల సామగ్రినే వినియోగిస్తున్నారు.

# పోలవరం ఎడమకాలువ పనులు వేగవంతం

### పిబిసి మోడరైజేషన్, ఏలేరు ఆధునీకరణ ఫేజ్-2కి నిధులు

### రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, జులై 31 ప్రభాతవార్త:** గోదావరి మోడరైజేషన్‌తో పాటు, ఏలేరు ఫేజ్-2 పనులకు సంబంధించిన నిధులను త్వరలో మంజూరు చేస్తామని, జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. సాగునీటి సంక్షోభ పరిస్థితులలో కాకినాడ జిల్లా పిఠాపురం వచ్చిన ఆయనకు పర్యటనలో భాగంగా గోకులం గ్రాండ్ వద్ద స్థానిక రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజక వర్గంలో కాలువల అభివృద్ధి పనులకు త్వరితగతిన నిధులు విడుదల చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. సాగునీటి సంక్షోభ పరిస్థితులలో ప్రతి నీటి బొట్టును పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఆయన విరవ, విరవాడ, దివిలి కాలువలను పరిశీలించారు. కాలువల్లో గుర్రపు డెక్క పెరిగిపోయిందని, తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అధికారులంతా నిత్యం కాలువ గట్ల పైనే కనిపించాలని, ఎసి గదుల్లో పడుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏలేరు, పిబిసి కెనాల్ ద్వారా వచ్చే నీటిని వృథా కాకుండా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని మంత్రి రామానాయుడు కలెక్టర్‌కు సూచించారు. పోలవరం ఎడమ కాలువ పనులు వేగవంతం చేస్తున్నామని మంత్రి రామానాయుడు పేర్కొన్నారు.

# సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక యాప్

● త్వరలో అందుబాటులోకి తీసుకురానున్న ఎపి పోలీసులు

**విజయవాడ, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** సైబర్ నేరాలను నియంత్రించేందుకు ఎపి పోలీసు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక విధానాలను అందుబాటులోకి తీసుకుని వస్తోంది. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో వాటిని అరికట్టేందుకు అమలులో ఉన్న విధానాలతో పాటు నూతన సాంకేతిక యాప్‌లను పోలీసు రూపొందిస్తుంది. వీటి లక్ష్యం సైబరగాళ్ళ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడమే. ఈ క్రమంలో విజయవాడ నగర పోలీసులు ఒక ప్రత్యేక యాప్‌ను రూపొందించనున్నారు. ప్రజల వివిధ అవసరాలను తీర్చేలా ఈ యాప్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల ట్రాఫిక్ సంబంధిత అవసరాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు 'అస్త్రం' యాప్‌ను గతంలో ప్రారంభించారు. అది నగరవాసులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచింది. దీనిని స్ఫూర్తిగా తీసుకుని, సైబర్ మోసాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు సైబర్ క్రైమ్ విభాగాన్ని ఆదేశించారు. అనేక ప్రత్యేకతలతో కూడిన ఈ యాప్ నెల రోజుల్లో అందుబాటులోకి రానుంది. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సహాయపడే అనేక రకాల అంశాలు ఈ వ్యవస్థలో ఉంటాయి.

'అస్త్రం' యాప్ మాదిరిగానే, సైబర్ అంశాలపై దృష్టి సారించే ఈ యాప్‌లో ప్రజలకు ఉపయోగపడే అనేక ఫీచర్లు ఉంటాయి. వివిధ రకాల మోసాలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకునేలా దీనిని రూపొం దిస్తున్నారు. ఇటీవల పెట్టుబడులకు సంబంధించిన మోసాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇందులో భాగంగా మోసగాళ్లు లింక్‌లను పంపి, బాధితులను డబ్బు పెట్టుబడి పెట్టేలా ప్రేరేపిస్తుంటారు. మోసగాళ్లు పంపిన లింక్‌లు నిజమైనవా లేక నకిలీవా అని నిర్ధారించుకోవడంలో ఈ యాప్ సహాయపడుతుంది. కేవలం లింక్‌ను కాపీ చేసి ఇందులో పేస్ట్ చేయడం ద్వారా వివరాలు తక్షణమే తెలుస్తాయి. కస్టమర్ కేర్ కేంద్రాల పేరుతో వచ్చే కాల్స్ నిజమైన సంస్థ నుంచే వస్తున్నాయా లేక నకిలీ నంబర్ల నుంచా అని తనిఖీ చేసే ఫీచర్‌ను కూడా ఇందులో జోడిస్తున్నారు. 'డిజిటల్ అరెస్ట్' లాంటి పేరుతో జరిగే మోసాల కోసం ఉపయోగించే ఫోన్ నంబర్లు మోసపూరితమైనవా కాదా అని కూడా వినియోగదారులు తనిఖీ చేసే అవకాశం దీని ద్వారా లభిస్తుంది. అదనంగా, సైబర్ నేరాలపై అవగా హన కల్పించడానికి పోలీసులు ప్రత్యేకంగా ప్రారంభిం చిన 'సాక్షి స్టూడియో' పొందించిన వీడియోలు కూడా ఇందులో అందుబాటులో ఉంటాయి.

సైబర్ మోసాలకు సంబంధించిన వివిధ అంశాలపై సందేహాలను నివృత్తి చేయడానికి ఒక చాట్‌బాట్ ఫీచర్‌ను కూడా ప్రవేశపెడు తున్నారు. వినియోగదారులు తమ ప్రశ్నలను టెక్స్ట్ లేదా వాయిస్ సందేశం ద్వారా పంపి, తక్షణ సమాధా నాలను పొందవచ్చు. అమరావతి కమిషనరేట్ పరిధిలో ప్రతిరోజూ సగటున 10కి పైగా సైబర్ సంబంధిత ఫిర్యాదులు నమోదవుతున్నాయి. కేసు నమోదుకు ముందే, మోసం ఎక్కడ మొదలైందో తెలుసుకోవడానికి ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ, మ్యాపింగ్ నిర్వహి స్తారు. సైబర్ కేసుల విచారణను పర్యవేక్షించడానికి ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమిస్తున్నారు. అలాగే ఎస్ఐకి సహాయపడేందుకు ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ ఒక మహిళా సంరక్షణ కార్యదర్శిని కేటాయిస్తున్నారు. ఇవి మంచి ఫలితాలను ఇస్తాయని పోలీసు యంత్రాంగం భావిస్తోంది.





# అన్నమయ్య కాలిబాట.. డిపిఆర్‌కే పరిమితం?

**తిరుమల, జులై 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రియభక్తుడైన వాగ్గేయకారుడు 'అన్నమయ్య' శేషాచలం అటవీమార్గంలో కాలినడకన వచ్చిన బాటను అభివృద్ధి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం 2020నుండి 2024వరకు తీసుకున్న నిర్ణయం నేటికీ డిపిఆర్‌కే పరిమితమైంది. ఇప్పుడు ఈ అంశం కాగితాల్లోనే మిగిలింది. అన్నమయ్య కాలిబాట అభివృద్ధికి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) కూడా తయారు చేయాలని అటవీశాఖ, టిటిడి ఇంజనీరింగ్ అధికారులకు 2021లో అప్పటి పాలకమండలి ఆదేశించింది. అప్పట్లోనే వేగంగా ఇంజనీరింగ్ అధికారులు, అటవీ అధికారులు అటవీప్రాంతంలోని కాలిబాటను కూడా సంయుక్తంగా పరిశీలించారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు ముప్పు వాటిల్లకుండా కాలిబాటను తీర్చిదిద్దాలని ప్రతిపాదనలు చేశారు. తిరుమలకొండపై పార్వేటమండపం వద్ద నుంచి మామండూరు మీదుగా పూర్తిగా దట్టమైన అటవీ ప్రాంతంలోనే ఈ కాలిబాట ఉండటంతో తిరుమలకు మూడవ ఘాట్ రోడ్డుగా ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్దాలనే ఆలోచన చేశారు. అన్నమయ్య కాలిబాట మార్గాన్ని పూర్తిగా నడకదారి భక్తులకు వీలుగా నిర్మించాలనే యోచన దాదాపు తొమ్మిదేళ్ళుగా ఉంది. అన్నమయ్య జిల్లా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాధరెడ్డి 'అన్నమయ్య కాలిబాట' మార్గం అభివృద్ధి చేయాలని అకుంఠిత దీక్షతో ప్రతి ఏడాది రాజంపేట పరిసరాల్లోని గ్రామస్థులతో, వెంకన్న భక్తులతో కలసి తిరుమలకు నడచివస్తున్నారు. ఈ కాలిబాట అభివృద్ధిపై 2021లో టిటిడి పాలకమండలి సమావేశంలోనూ చర్చించి నిర్ణయించారు. అయితే అప్పట్లోనే ఆ మూడేళ్ళు డిపిఆర్‌తోనే కాలం వెల్లబుచ్చేశారు. తిరుమలకు ప్రస్తుతం తిరుపతి అలిపిరి నడకదారి, శ్రీవారి మెట్లమార్గం నడకదారులుగా ఉన్నాయి. కొన్ని వందల సంవత్సరాల క్రిందట నుండి ఈ మార్గాలే భక్తులకు నడకదారులుగా ఖ్యాతి.

2021వ సంవత్సరంలో సంభవించిన బలమైన వరదల సమయంలో తిరుమల ఘాట్‌రోడ్డులో రోడ్లు కోతకు గురవడం, రక్షణగోడలు ధ్వంసమవడం జరిగిపోయింది. కాలినడక మార్గాల్లో బండరాళ్ళు జారిపడ్డాయి. టిటిడికి తీవ్ర నష్టం వాటిల్లింది. మొదటిఘాట్‌పైనే రాకపోకలు సాగించేలా చూశారు. ఈ సమయంలో మూడో ఘాట్‌రోడ్డు (కాలిబాట) అవసరాన్ని టిటిడి గుర్తించింది. ఇందుకు అన్నమయ్య కాలిబాటను తీర్చిదిద్దే యోచనతో ప్రతిపాదనలు రూపొందించింది. అన్నమయ్య కాలిబాట మార్గం ఉపయోగపడేలా చూడాలని భక్తుల విశ్వాసం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు మారింది.

# గోదావరి వరదలపై అప్రమత్తం

### ప్రజలు జాగ్రత్తలు పాటించాలి: కోనసీమ జిల్లా కలెక్టర్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 31 ప్రభాతవార్త:** ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోందని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డా. ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద పరిస్థితిని జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షి స్తోందన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ చాంబర్ నందు జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్ నైడియా దేవితో కలిసి మీడియాతో మాట్లాడారు. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశామని, సుమారు 10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 2న సాయంత్రం 7.00 నుంచి 8.00 గంటల మధ్య సుమారు 13 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారు. కోనసీమ జిల్లాలోని 19 మండలాల్లో, ముఖ్యంగా సెంట్రల్ డెల్టా పరిధిలోని 16-17 మండలాలు వరద ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తమై ఉండాలన్నారు. వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారుల, సిబ్బంది సెలవులను రద్దు చేసినట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని గర్భిణులు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని, బియ్యం, నిత్యావసర సరుకులు, తాగునీటిని లంక గ్రామాలకు ముందుగానే పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పింఛన్ల పంపిణీకి కూడా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని, సమాచారం అందిన వెంటనే సహాయక బృందాలు స్పందించి అవసరమైన చర్యలు చేపడతాయని జిల్లా కలెక్టర్ డా. ఆర్.మహేష్ కుమార్ తెలిపారు.

1vzm13:1vzm13.qxd 01-08-2026 00:02 Page 1



## విద్యార్థులను పరామర్శించిన డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు

శృంగవరపుకోట,జూలై 31, ప్రభాతవార్త :



మండలంలోని తాటిపూడి ఏపీ ఆర్జేసీ మహిళ జూనియర్ కళాశాలలో వైరల్ జ్వరాలతో బారిన పడిన విద్యార్థినీలను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గడి బంగారునాయుడు శుక్రవారం పరామర్శించారు.వారికి పండ్లు,రొట్టెలను పంపిణీ చేశారు.విద్యార్థినీలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరగా కోలుకునేలా చూడాలని కళాశాలలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న కొట్టాం పీహెచ్ సీ వైద్యాధికారిణి హరిక, సిబ్బందికి ఆయన సూచించారు. విద్యార్థినీలు మెరుగైన చికిత్సలు పొందుతున్నారని త్వరలో పూర్తి స్థాయిలో కోలుకుంటారని కళాశాల ప్రిన్సిపాల్ శారదాబాయి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మువ్వల శ్రీనువాసరావు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సీహెచ్ ఈశ్వరరావు,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి హెచ్.నానాజీ, నాయకులు చీమల అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సినినటి కంగనా రనౌత్‌వి మతిలేని వ్యాఖ్యలు : గొంప



సాలూరు, జూలై31, ప్రభాతవార్త :

కాంక్రోచ్ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు ఇంకా విద్యార్థులు అలాగే ప్రజలను చాలా నీచంగా వ్యాఖ్యలు చేసిన సినినటి కంగనా రనౌత్ ను మానసిక వైద్యులకు చూపించాలని రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ కార్యదర్శి గొంప. ప్రకాశరావు విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతు విద్యార్థి నాయకుడు సౌరవ్ దాస్ ను నీవు అని సంభోదిస్తు పనిపాట లేనివ్యక్తి అని అనడం అలాగే విద్యార్థి లోకాన్ని మురికి కాలువ తరమని అజ్ఞానంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు.అంతే కాకుండా దేశవ్యాప్తంగా ఉప్పెనలా ఉద్యమం నీకు పట్టదా! విద్యార్థులు ప్రజలు ఇంకా రాజకీయ పక్షాలన్నీ నీకు ఏ విధంగా కనబడుతున్నాయని ప్రశ్నించారు.అలాగే బీజేపి ఆర్ఎస్ఎస్ మత్తులో పడితే నీలాగే ప్రవర్తిస్తారని పనిలేని వ్యాఖ్యలు చేస్తారని వాటిని గొంప.ప్రకాశరావు తీవ్రంగా ఖండించారు.

## ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవానికి హాజరు కావాలి

రామభద్రపురం, జులై 31,ప్రభాత వార్త:



బొబ్బిలి నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుంచి భోగాపురం విమానాశ్రయం చూసేందుకు బస్సులపై ప్రజలను తరలిస్తున్నట్లు సూర్యారావు అన్నారు రామభద్రపురం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విమానాశ్రయం చూసేందుకు ప్రజలను జాగ్రత్తగా తరలించాలని సూచించారు భోగాపురంలో విమానాశ్రయం ఏర్పాటు చేయడంతో ఉత్తరాంధ్ర ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు ప్రభుత్వం ఎంతో అభివృద్ధి చేస్తుందని ప్రజలంతా అండగా నిలవాలని కోరారు సమావేశంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక మాజీ కార్యదర్శి మండల అధ్యక్షుడు కరణంవిజయ భాస్కర్ రావు, మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి,మండల తెదేపా నాయకులు చింతల రామకృష్ణ,చిన్నమ్మ తల్లి కే, వెంకటి నాగేశ్వరరావు కటిక శ్రీనివాసరావు నల్ల నారాయణ , తదితరులు పాల్గొన్నారు.

## 'గట్టు మీద చెట్టు'అనే ప్రోగ్రాంలో మొక్కలు నాటారు : ఏఓ



సాలూరు, జూలై31, ప్రభాతవార్త :

మండలం తోణాం రైతుసేవ కేంద్రం పరిధి మెట్టవలస గ్రామంలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి కె శిరీషా ఆధ్వర్యంలో గట్టు మీద చెట్టు అనే వ్యవసాయ కార్యక్రమం సిబ్బంది నిర్వహించారు.అందులో భాగంగా ఆ గ్రామానికి చెందిన బలరామ్ అనే రైతుపొలం గట్టుపై బొప్పాయి,జామ,నిమ్మా ఇంకా కరివేపాకు మొక్కలను నాటారు.అనంతరం ఏఓ మాట్లాడుతు డ్రం సీడ్ విధానంలో వరి వేయించడం జరిగిందని అలాగే ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో రైతుల పంటలకు ఇన్సూరెన్స్ ఈరోజు తప్పనిసరిగా చేయించుకోవాలని స్పష్టం చేశారు.అంతే కాకుండా ఎకరా వరికి 800 ఇంకా మొక్కజొన్నకి 330,పత్తి పంటకు 19వేలు అలాగే అరటి పంటకు 3 వేలు ప్రీమియం చెల్లించాలని క్లారిటీ ఇచ్చారు.అలాగే వరి సాగుచేయలేని పరిస్థితిలో ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని పలు సూచనలు చేశారు.ఏఈఓ టి. తిరుపతిరావు,విహెచ్ఏ వినోద్,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై ఎన్సిసి విద్యార్థులకు అవగాహన

చీపురుపల్లి ,జూలై 31, ప్రభాత వార్త:



చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్సిసి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పై చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చీపురుపల్లి జడ్పీ హైస్కూల్లో ఎన్సిసి విద్యార్థులకు మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కొరకు ఏం చేయాలో ఎలా చేయాలో ముందు అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రమాణం పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత. భావితరాలకు మేమే మార్గదర్శకులుగా ఉండి మంచి పర్యావరణ అందించడానికి గాను ఈ క్షణం నుండి సింగిల్ యూస్ ప్లాస్టిక్ను నిషేధిస్తాము. మొక్కలు నాటి వాటిని పరిరక్షిస్తాం మరియు ముఖ్యముగా రేపు రాబోయే వినాయక చవితికి రంగురంగుల ప్లాస్టర్ ప్యారిస్ తో తయారుచేసిన విఘ్నేశ్వరుని బొమ్మలు కాకుండా మట్టి బొమ్మలు లేదా పసుపు బొమ్మలు వాడుతాం, మాతో భాగస్వామ్యము అవ్వమని పదిమందికి అవగాహన కల్పిస్తాం, దానికి మేము కట్టుబడి ఉంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎన్సిసి మాస్టారు మామిడి శ్రీను వాసరావు, అధ్యక్షులు గోవిందరాజులు పాఠశాల ఎన్సిసి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన నాగభూషణ్ సేవలు మరువలేనివి

దత్తిరాజేరు ,జూలై 31, ప్రభాత వార్త :

పెదమానాపురం ఉప తపాలాశాఖలో జిడిఎస్ ఉద్యోగం చేసి 45 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకుని వృత్తిని నమ్మకంతో సేవచేసి పదవి విరమణ పొందిన మానాపురం నాగభూషణరావు సేవలు మరువలేమని ఐపిఓ బొద్దల ఉపేంద్ర అన్నారు మానాపురం ఉపతపాల శాఖ కార్యాలయ ఆవరణంలో పదవీ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు ప్రజాప్రతినిధులు అయిన మండల జడ్పిటిసి సభ్యురాలు రైతు రాజేశ్వరి పోస్టల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొని నాగభూషణరావుకి బొకే ఇచ్చి సాల్వాతో సన్మానం చేశారు ఈ సన్మాన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐపిఓ మాట్లాడుతూ మీరు ఎంచుకున్న వృత్తిపట్ల మీరు చూపిన నిబద్ధత క్రమశిక్షణ మరియు బాధ్యతాత్మ మైన ప్రవర్తన మా అందరికీ ఎల్లప్పుడూ ఆదర్శప్రాయంగా నిలుస్తుంది అన్నారు కార్యాలయ పురోభివృద్ధికి మీరు అహిర్నిశలు శ్రమించి తోటి ఉద్యోగస్తులతో మరియు ఉన్నతాధికారులతో ఎంతో స్నేహపూర్వకంగా మెలిగారు. మీ అమూల్యమైన అనుభవంతో మీలాంటి ఎందరో సహ ఉద్యోగులకు మరియు సిబ్బందికి మార్గదర్శకత్వం వహించి వారి దగ్గరప ప్రశంసలు అందుకున్నారు నిరాడంబరత నిగర్వతనం ఎల్లప్పుడు చిరునవ్వుతో పలకరించి మీ ఆత్మీయతే మా గుండెల్లో జరగని ముద్ర వేసిందన్నారు మీరు అధికారిక విధుల నుండి మాత్రమే విరమణ పొందుతున్నారు కానీ మా హృదయాలనుండి కాదు మీ శేష జీవితం అంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ప్రశాంతంగా, సంతోషంగా సాగాలని ఎల్లప్పుడూ భగవంతుని మీకు తోడుగా ఉంటారన్నారు

## భోగాపురానికి 30 బస్సులు, రెండువేలు జనాభా



గరివిడి, జూలై 31, ప్రభాత వార్త:

భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి గరివిడి మండలం నుండి 30 బస్సుల్లో రెండు వేలమంది జనాభా తరలిస్తున్నారు. మండలం లో 30 పంచాయతీ లకు 30 బస్సులు ఏర్పాటు చేశారు. గరివిడి నుండి బయలు దేరే బస్సులు శనివారం ఉదయం 5 గంటలకు చీపురుపల్లి మీదుగా లావేరు, హైవే కి వెళ్లి భోగాపురం చేరుకోనున్నాయి. కాగా శుక్రవారం బస్ ట్రయిల్ రన్‌గా అధికారులు, టిడిపి నాయకులు బస్‌లో ప్రయాణించి ప్రారంభానికి సిద్ధమైన విమానాశ్రయం తిలకించి తిరిగి వచ్చారు.

## నాటు సారాతో వ్యక్తి అరెస్టు

కురుపాం, జూలై 31, ప్రభాతవార్త:



10 లీటర్ల నాటు సారా తో వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు తెలిపారు శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమంలో అమలు లో భాగంగా కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధి లో ఉన్న జియ్యమ్మవలస మండలం లో గల పరజపాడు గ్రామ సమీపంలో లో విజయనగరం ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది తో దాడులు నిర్వహించినట్లు ఆయనన్నారు.ఈ దాడులు లలో నాటు సారా విక్రయిస్తున్న చినమేరంగ్ గ్రామానికి చెందిన బొత్స పద్మను 10 లీటర్ల నాటు సారా తో పట్టుకొని అరెస్టు చేసి న్యాయ స్థానం లో హాజరు పరచ గా ఆమెకి న్యాయ స్థానం రిమాండ్ ను విధించినట్లు తెలిపారు.ఈ దాడుల్లో విజయనగరం ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ సింహాద్రి, కురుపాం ఎక్సైజ్ స్టేషన్ ఎస్ ఐ జె.రాజ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన వారికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌తో నోటెన్షన్ : మంత్రి

సాలూరు, జూలై 31, ప్రభాతవార్త :



గత ప్రభుత్వంలో పింఛన్లు కోసం ఎన్నో ఇబ్బందులు పడ్డారని అలాకాకుండా నెలకు ఒక్కరోజు ముందుగానే ఏ టెన్షన్ లేకుండా పెన్షన్లు పంపిణీ చేయడంతో పింఛన్ దారులముఖాల్లో ఎంతో ఆనందం కనబడుతుందని మంత్రి సంధ్యారాణి అన్నారు.శుక్రవారం ఈ మేరకు పట్టణ 28 వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పండగ నిర్వహించగా వృద్ధులు, వితంతువులు,వికలాంగుల ఇంటింటికీ వెళ్లి మంత్రి చేతులు మీదుగా పింఛన్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతు పేదబలహీన వర్గాలకు గౌరవ ప్రదమైన జీవనం కల్పించడమే లక్ష్యమని అలాగే ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ పెన్షన్లు పెంచి పేదలకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచిందని సంధ్యారాణి స్పష్టం చేశారు. మున్సిపల్ డీఈ ప్రసాద్ మేనేజర్ శివప్రసాద్,నిమ్మాది. చిట్టి,హర్షవర్ధన్,కిలారి రవి,నాగోలు తాతాజీ,డబ్బి కృష్ణ,శోభారాణి , తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన చికిత్సలు అందించాలి



శృంగవరపుకోట,జూలై31,ప్రభాతవార్త :

వైరల్ జ్వరాలతో బారిన పడిన విద్యార్థులకు మెరుగైన చికిత్సలు అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు ఆదేశించారు.తాటిపూడి ఏపీ ఆర్జేసీ మహిళ జూనియర్ కళాశాలలో జ్వారాలతో బారిన పడిన విద్యార్థినీలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ కాంతారావు శుక్రవారం పరామర్శించారు.ముందుగా జ్వరాలు ఎలా సంభవించాయో అనే దానిపై ఆయన ఆరా తీశారు.అనంతరం వంటశాలను,హస్టల్ గదులు, తదితర ప్రదేశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్య శిబిరం నిర్వహిస్తున్న కొట్టాం పీహెచ్ సీ వైద్యాధికారిణి హరిక, సిబ్బందికి ఆయన ఆదేశించారు.ఆహార భద్రత విషయంలో కమిషన్ మెంబర్ విద్యార్థులకు పలు సూచనలు అందించారు.జ్వరాలతో బారిన పడిన సుమారు 51మంది విద్యార్థులందరూ దాదాపు కోలుకున్నారని వైద్యాధికారిణి హరిక, ప్రిన్సిపాల్ శారదాబాయి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాను నోటీస్ బోర్డుకు అంటించిన అధికారులు

దత్తిరాజేరు ,జులై 31, ప్రభాతవార్త :



ఓటర్లు జాబితాలో మీ ఓటు ఉందో లేదో తెలుసుకోవచ్చు అన్నారు శుక్రవారం ముసాయిదా ఓటర్ జాబితాను అధికారులు విడుదల చేశారు 2026 మే 25 నాటికి మండలంలో 45926 ఓట్లు ఉండగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియ తర్వాత 31/7/2026 కు 42,423 ఓట్లు ఉన్నాయన్నారు పురుషులు 21047 ఓట్లు స్త్రీలు 21376 ఓట్లు జాబితాలో పేర్లు నమోదు అయి ఉన్నాయన్నారు సుమారు 3,500 ఓట్లు పోయాయి అన్నారు ఫారం సిక్స్ ద్వారా కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు

## మౌంట్‌అబూలో ఆకట్టుకున్న గరివిడి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



గరివిడి, జూలై 31, ప్రభాతవార్త:

రాజస్థాన్‌లో గల మౌంట్ అబూలో బ్రహ్మ కుమారీలు 13 వ సెమినార్ లో భాగంగా నిర్వహిస్తున్న దివ్యా అంగజన్ కార్యక్రమంలో శ్రీరాం నగర్ స్త్రీ శిశు సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో గల వికలాంగ పాఠశాల కు చెందిన 13 మంది విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. గరివిడి నుండి 13 మంది విద్యార్థులను గరివిడి ఓం శాంతి కేంద్రం ఇంచార్జి బ్రహ్మ కుమారి హేమలత ,పాఠశాల ఉపాధ్యాయులు పి.కుమార్ తదితరులు రాజస్థాన్ మౌంట్ అబూలో జరిగే13 సెమినార్ కి తీసుకు వెళ్లారు. వికలాంగ విద్యార్థులు ఇప్పటికే రెండు ప్రదర్శనలు చేయగా మరో ప్రదర్శన చేయాలని ప్రేక్షకుల కోరారు. వికలాంగ విద్యార్థులు తమ హావభావాలతో ప్రదర్శించే సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను మంత్ర ముగ్ధులను చేశాయి.

## హక్కుల సాధనకై కదం తొక్కిన కార్మికులు

పార్వతీపురం, జూలై 31, ప్రభాతవార్త:



కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలి, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మిక నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం కార్మికులు ర్యాలీగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కలెక్టరేట్ వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ ఆశా, అంగన్‌వాడీ, సిహెచ్ డబ్ల్యు, మధ్యాహ్నభోజన పథకం, విఓఎ, ఆర్.పి., స్కూల్ శానిటేషన్ కార్మికులకు కనీస వేతనం 26,000/- రూ॥లు చెల్లించాలని, క్షేత్రస్థాయిలో పేద ప్రజలకు సేవలందించే మాకు వేతనాలు పెంచి 7సం॥రాలు అవుతోంది. ఈ నేపథ్యంలో మా కృషిని గుర్తించి మరియు గత ఎన్నికల్లో వేతనాలు పెంచుతామని ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నాము అని అన్నారు. మాకు పి.ఎఫ్., ఈఎస్ఐ , పెన్షన్, బోనస్, గ్రాట్యూటీ వంటి కార్మిక చట్టాలు అమలు చేయాలని, ఆర్.పిలకు, విఓఎలకు గడిచిన 4 నెలలుగా వేతనాలు చెల్లించని విషయం తమరి దృష్టికి తీసుకువస్తున్నాము అని అన్నారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురైతే వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని మరియు మరణించిన పక్షానా 10లక్షల రూ.లు భీమా కల్పించాలని కోరుతున్నాము అని అన్నారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనంతో ఏ మాత్రం సంబంధం లేకుండా విపరీతమైన పని భారం పెంచుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో పెడుతున్నాము. అంగన్‌వాడీకి ఏమాత్రం సంబంధం లేని నవ చేతన యాప్‌ను రద్దు చేయాలని. మధ్యాహ్న భోజన కార్మికులు వేతనాలు పెంచాలని కోరుతున్నాము అని అన్నారు. మహిళ యొక్క ప్రత్యేక సమస్యలైన నెలసరి సెలవులు, ప్రసూతి సెలవులు, మెడికల్ సెలవులు అమలు చేయాలని కోరుతున్నాము అని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు, అంగన్వాడి, మధ్యాహ్నం భోజనం కార్మికుల ఆశ వర్కర్స్, శ్రామిక జిల్లా యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలి



### టిడిపి సీనియర్ నేత రవి శేఖర్

నెల్లిమర్ల, జూలై 31, ప్రభాతవార్త :

భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు తరలిరావాలని, విజయవంతం చేయాలని టిడిపి సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా జరగనున్న విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం, సభా కార్యక్రమానికి నెల్లిమర్ల నుంచి ప్రజలను తరలించేందుకు ఏర్పాటు చేస్తున్న ప్రధాన సౌకర్యాలపై ఆయన గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమీక్ష చేశారు. నెల్లిమర్ల మండలం నుంచి సుమారు 15 వేలకు మందికి పైగా తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. ఉచిత రవాణా సౌకర్యం, ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు బయలుదేరాలని రవి శేఖర్ కోరారు. బస్సులో ఇన్చార్జిలకు రూట్ మ్యాప్ పై అవగాహన కోసం గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన జండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో సువాడ రవి శంకర్‌తో పాటు కూటమి పార్టీల నాయకులు కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, చనమల్లు వెంకటరమణ, లెంక అప్పలనాయుడు, దంతులూరి అజయ్ బాబు, అవనాపు సత్యనారాయణ,గురాణ చక్రధర్, పతివాడ గోవిందరావు,బూర్లె శ్రీధర్, మైపాడ ప్రసాద్, ఆల్తి నల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్.ఎ.1 పరీక్షల షెడ్యూల్ పై సందిగ్ధత

మెరకముడిదాం, జులై 31:ప్రభాత వార్త :

ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఈనెల 3న ప్రభుత్వ పాఠశాలలో జరగనున్న ఎఫ్ ఎ.1 పరీక్షలు జరగనున్నాయా? వాయిదా పడతాయా? అనే సందిగ్ధత విద్యార్థుల్లో నెలకొంది. వాళ్లకి టైం టేబుల్ కూడా ఇవ్వకపోవడంతో పరీక్షలకు సిద్ధమవ్వాలా లేదా అన్న అయోమయంలో విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయులు గాని , ఉన్నతాధికారులు గాని కనీసం వాయిదా పడతాయన్న సమాచారం కూడా ఇవ్వకపోవడం శోచనీయం. ఈ విద్యా సంవత్సరం మొదట్లోనే పరీక్షల నిర్వహణ పట్ల తగు సమాచారం లేకపోవడం విడ్డూరంగా ఉంది. ఇకనైనా అధికారులు తక్షణమే స్పందించి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్న ఎఫ్.ఎ.1 పరీక్షలపై స్పష్టత ఇవ్వాల్సిందిగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## సతివాడ మాజీ సర్పంచ్‌కు చనమల్లు పరామర్శ

నెల్లిమర్ల, జూలై 31, ప్రభాతవార్త:



మండలంలోని సతివాడ గ్రామ మాజీ సర్పంచ్, జనసేన పార్టీ నాయకుడు చందకు రామనాయుడు ను ఆ పార్టీ సీనియర్ నాయకుడు, డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ పరామర్శ చేశారు. రామునా యుడు కొద్దిరోజుల క్రితం గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ విశాఖలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ప్రస్తుతం సత్తివాడలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న చనమల్లు వెంకటరమణ శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శ చేశారు. అనారోగ్యం నుంచి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వెంకటరమణ వెంట పార్టీ నాయకుడు చింతపల్లి శ్రీనివాసరావు ,తదితరులు ఉన్నారు.

## ప్రధాని సభను విజయవంతం చేయాలి

### బిజెపి రాష్ట్ర కిషాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు రాజు



గరివిడి, జూలై 31, ప్రభాతవార్త :

భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు తరలివచ్చి,సభ విజయవంతం చేయాలని చీపురుపల్లి నియోజకవర్గ బిజెపి ఇంచార్జి, కిషాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ వి ఎల్ ఎన్ రాజు అన్నారు. శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా జరగనున్న అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం, సభా కార్యక్రమానికి చీపురుపల్లి నుంచి ప్రజలను తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. చీపురుపల్లి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున ప్రజలను తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. ఉచిత రవాణా సౌకర్యం, ఉచిత భోజన వసతి కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు బయలుదేరాలని రాజు కోరారు.

## బొబ్బిలి రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శంకరరావు

బొబ్బిలి, జూలై 31,ప్రభాతవార్త:

బొబ్బిలి రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా డీఎస్పీ శంకర్రావు జాయిన్ అయ్యారు. ఏలూరు జిల్లా అప్పలరాజు గూడెం నరసాపురం మండలంలో రెసిడెన్షియల్స్ స్కూల్లో పనిచేస్తూ రిటైర్ అయ్యానని స్టేట్ లెవెల్లో నెంబర్ వన్ స్థానంలో ఉన్నానని ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన 62 సంవత్సరాల జాబితాలో మళ్లీ నాకు బొబ్బిలి రెసిడెన్షియల్ స్కూల్లో పోస్టింగ్ ఇచ్చారని ఒక సంవత్సరం పాటు ఈ పాఠశాలను ప్రచారం చేయడమే నా లక్ష్యంగా చేసుకున్నానని ఎందరో ఈ పాఠశాలలో చదివి ఉన్నత వర్గాల్లో ఉన్నారని వారందరినీ పూర్తిగా తీసుకొని పూర్వవైభం నా స్థాయిలో తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు, సిబ్బంది కొరత లేరు అయినా నిబంధనలు వ్యతిరేకంగా ఎవరు పనిచేసిన సహించేది లేదని ఆయన తెలియజేశారు. అందరితో కోఆర్డినేషన్ చేసుకుని ముందుకు పోతానని అన్నారు

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి భోగాపురం ఎయిర్‌పోర్ట్ తొలిమెట్టు : కోళ్ల

లక్కవరపుకోట, జూలై 31, ప్రభాతవార్త :



రేపు ఒకటో తేదీన జరగబోయే భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవంతో ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరబోతోందని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చేయడమే కాకుండా, ఈ ప్రాంత అభివృద్ధికి ఒక మోడల్‌గా నిలవబోతోందని అన్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో 'ఉత్తరాంధ్ర అంటే వెనుకబడిన ప్రాంతం' అనే ముద్ర తొలగిపోయి, 'అభివృద్ధికి చిరునామా'గా మారబోతోందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ఈ ప్రాంత యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని లలితకుమారి పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది పలికి, జాతికి అంకితం చేసేందుకు విచ్చేస్తున్న గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గార్లకు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనంగా స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రజల కల నెరవేరుస్తున్నందుకు కూటమి ప్రభుత్వానికి, ప్రధానికి ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఇదే సమయంలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరిపై ఎమ్మెల్యే మండిపడ్డారు. 11 సీట్లకు పరిమితమైనా జగన్ అబద్ధపు ప్రచారాలు మానలేదని ధ్వజమెత్తారు. తన హయాంలోనే భోగాపురం ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి చెందిందని అని జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజు గారి సహకారంతో, చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోనే భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు నాంది పడిందనే వాస్తవం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని గుర్తు చేశారు.వైసీపీ నాయకులకు విషయ పరిజ్ఞానం లేదని, నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ఉన్న తేడా కూడా తెలియకుండా మాట్లాడటం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. మాజీ ముఖ్యమంత్రిగా కనీసం సబ్జెక్ట్ తెలుసుకుని మాట్లాడితే ప్రజలు వినే అవకాశం ఉంటుందని, ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని జగన్‌కు ఎమ్మెల్యే లలితకుమారి హితవు పలికారు.

## మోడీ సభను జయప్రదం చేయండి

రాజాం, జూలై 31, ప్రభాతవార్త :

నేడు జరుగనున్న ఎయిర్పోర్ట్ ప్రారంభానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తున్న శుభ సందర్భంగా కూటమి నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని భారతీయ జనతా పార్టీ విజయనగరం జిల్లా కార్యవర్గ సభ్యులు జొన్నాడ. రంజిత్ పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలో 49,040 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు పాటు పలు కేంద్ర ప్రాజెక్టులు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసరు ఆంధ్రప్రదేశ్లో . కేంద్ర మంత్రులు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా ఆగస్టు ఒకటో తేదీ జరుగునున్న ఓపెనింగ్ కి ప్రధానమంత్రి తో శంకుస్థాపనకి హాజరవుతున్నారు . రాష్ట్ర సమగ్ర అభివృద్ధి చేసేందుకు స్వర్ణాంధ్ర విజన్ 2047 రూపొందించుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రంజిత్ తెలిపారు. రాష్ట్రం పారిశ్రామికంగా, విద్య, వైద్యతో పాటు అన్నీ రంగాల్లో అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎప్పుడు శ్రమిస్తుది తరుణంలో భోగాపురం ఎయిర్పోర్ట్ ఓపెనింగ్ చేస్తున్న శుభ సందర్భంగా శనివారం నాడు ప్రధానమంత్రి సభకు బిజెపి టిడిపి జనసేన కూటమి నేతలు,నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని రంజిత్ కోరారు.



## ఛలో భోగాపురం

కోటబొమ్మాళి, జూలై 31, ప్రభాతవార్త:

మండలంలోని కరుడు పంచాయతీ పరిధి చౌదరి కొత్తూరు గ్రామంలో శుక్రవారం సాయంకాలం టీడీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అన్ని ప్రధాన వీధులలో ఛలో భోగాపురం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. శనివారం భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాని మోదీ ప్రారంభించనున్న నేపథ్యంలో టీడీపీ శ్రేణులు కార్యక్రమం చేపట్టారు. ర్యాలీలో టీడీపీ మండల కార్యనిర్వహక కార్యదర్శి నాళ్ల ఆదినారాయణ (చిన్ని) టి ఎన్ టి యు సి టెక్కలి నియోజకవర్గం అధ్యక్షులు జి.నరసింగరావు, తదితరులు ఉన్నారు.

## ఆరుతడి పంటలు వేసుకోవాలి

కోటబొమ్మాళి, జూలై 31 ప్రభాతవార్త :

ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురవడంతో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని అందుకే రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలను వేసకోవాలని జిల్లా రైతు శిక్షణ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ ఆర్.శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయశాఖ, జిల్లా వనరుల కేంద్రం అద్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పథకంలో భాగం ఆయన శుక్రవారం మండలంలోగల తిలారు గ్రామంలో రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపుపై శిక్షణ మరియు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఎల్ నినో ప్రభావం, పంటల మార్పిడి, పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు పై అవగాహన కల్పించారు. అలాగే వరి పంటకు ప్రధానమంత్రి పసల్ భీమా యోజన కింద పంటల భీమాను ఆగస్టు 15 లోపు వరి పండిస్తున్న రైతులందరూ నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

1-8pg9exHNWMJQE.qxd:1-8pg9exHNWMJQE.qxd 1/1/02 6:14 AM Page 1





### కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్

## భారత్ పురుషుల, మహిళల జట్లకు

# రెండు స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లలో భారత్‌కు రెండు స్వర్ణ పతకాలులభించాయి. పురుషుల, మహిళలజట్లు రెండూ తమఫైనల్స్‌లో మలేషియాను చిత్తు చేసి ఈ పతకాలను కైవసం చేసుకున్నాయి. 22వ కామన్వెల్త్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో, మనుష్ షా ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ విజయం సాధించడంతో, మలేషియాను 3-2 తేడాతో ఓడించిన భారత పురుషుల జట్టు, మహిళల జట్టుతో పాటు టీమ్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఈ విజయం, టోర్నమెంట్ ప్రారంభ రోజున మలేషియా చేతిలో లీగ్ దశలో ఎదురైన అనూహ్య ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నట్లయింది. వాంగ్ క్వి షెన్‌తో మనుష్‌కు జరిగిన ఉత్కంఠ భరితమైన పోరు ఫైనల్‌ను భారత్ వైపు మలుపు తిప్పింది. అయితే, వాంగ్‌పై మనుష్ అద్భుతమైన పునరాగమనం చేసే వరకు పురుషుల ఫైనల్ ఉత్కంఠభరితంగా సాగింది. నిర్ణయాత్మక గేమ్‌లో 4-6తో వెనుకబడి ఉన్నప్పుడు, మనుష్ కొట్టిన టాప్‌స్పిన్ బంతి నెట్‌లోకి వెళ్లడంతో వరుసగా ఏడు పాయింట్లు సాధించి అద్భుత విజయంతో భారత్‌కు టైటిల్‌ను ఖాయం చేశాడు. అంతకుముందు, శ్రీజ అకులా నేతృత్వంలోని భారత్, అనూహ్యంగా ఫైనలిస్ట్‌గా నిలిచిన మలేషియాను 3-0 తేడాతో ఓడించింది. స్కోరు అలా ఉన్నప్పటికీ, ఈ పోటీ ఏమాత్రం సులభంగా సాగలేదు. స్వస్తిక ఘోష్ భారత్‌కు ఆధిక్యం అందించిన తర్వాత, ఉత్కంఠభరితమైన తొలి బాల్‌లో ఎడమచేతి వాటం బౌలర్ కరెన్ అనక్, శ్రీజను తీవ్రంగా శ్రమకు గురిచేసింది. ఆ తర్వాత, చోపర్ ఆలిస్ చాంగ్ యొక్క గట్టి రక్షణను ఛేదించి యశస్విని ఘోర్పడే టైటిల్‌ను కైవసం చేసుకుంది.





### తైపే ఓపెన్.. సెమీఫైనల్‌కు

# ఉన్నతి, తన్వీ

**న్యూఢిల్లీ:** తైపీ ఓపెన్ 2026లో ఉన్నతి హుడా, తన్వీ శర్మ సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. ఈ టోర్నమెంట్‌లో ఉన్నతి హుడా తన తోటి క్రీడాకారిణి దేవికా సిహాగ్‌ను 23-21, 21-16 తేడాతో ఓడించి, తైపీ ఓపెన్ 2026 సెమీఫైనల్స్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఉన్నతి ఎనిమిది పాయింట్ల ఆధిక్యంతో స్కోరును 11-3కి చేర్చింది. ఆ తర్వాత దేవిక పుంజుకుని ఆటలోకి వచ్చి స్కోరును 21-21తో సమంచేసింది. కానీ ఉన్నతి తన సంయమనాన్ని కోల్పోకుండా తర్వాతి రెండు పాయింట్లు గెలుచుకుని ఆటను తనవశం చేసుకుంది. రెండవ గేమ్‌లో హుడా విరామ సమయానికి 11-9 స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. ఆ తర్వాత ఆమె ఆటను తన నియంత్రణలోకి తీసుకుని, కోల్పోయిన ప్రతి పాయింట్‌తో శక్తిని కోల్పోతున్నట్లు కనిపించిన తన ప్రత్యర్థిని అధిగమించింది. అలాగే థాయ్‌లాండ్‌కు చెందిన సుపనిదా కటేథాంగ్‌పై తన్వి శర్మ విజయం సాధించడంతో మరో సెమీఫైనల్‌కు భారత క్రీడాకారిణి చేరనుంది. 17 యేళ్ల తన్వి శర్మ తొలి గేమ్‌ను 21-15 తేడాతో గెలుచుకోగా, హోరాహోరీగా సాగిన రెండో గేమ్‌ను థాయ్ క్రీడాకారిణి 18-21 తేడాతో కైవసం చేసుకుంది. అయితే తన్వి సంయమనం కోల్పోకుండా నిర్ణయాత్మక గేమ్‌ను 21-14 తేడాతో గెలిచి, సెమీఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది.

### కామన్వెల్త్ గేమ్స్..

## మహిళల డిస్కస్ త్రోలో

# సీమాకు కాంస్యం




**న్యూఢిల్లీ:** 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల, మహిళ అథ్లెట్లు అద్భుత ప్రదర్శన చేస్తున్నారు. మహిళల డిస్కస్ త్రోలో భారత క్రీడాకారిణి సీమా కళిరామ్న కాంస్య పతకం సాధించి, ఈ సీజన్‌లో దేశానికి ఏకైక అథ్లెటిక్స్ పతకాన్ని అందించింది. గ్లాస్గోలో జరిగిన ఈ క్రీడల్లో ఆమె సహచరులైన తజిందర్‌పాల్ సింగ్ తూర్ మరియు పరుల్ చౌదరి తృటిలో పతకాలను కోల్పోయారు. నాలుగు ఫౌల్ ప్రయత్నాలతో కూడిన అస్థిరమైన ప్రదర్శన చేసినప్పటికీ, సీమ 58.65 మీటర్ల అత్యుత్తమ త్రోతో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఫౌల్‌తో ప్రారంభించిన తర్వాత, ఆమె 57.32 మీ మరియు 58.65 మీ చెల్లుబాటు అయ్యే త్రోలను నమోదు చేసి, చివరకు వరుసగా మూడు ఫౌల్స్‌తో ముగించింది. భారత్‌కే చెందిన నిధి రాణి 57.10 మీటర్ల ఉత్తమ త్రో తో నాలుగో స్థానంలో నిలిచి, పతకాన్ని తృటిలో కోల్పోయింది. ఇక పురుషుల+110 కేజీల వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన లవ్‌ప్రీత్ సింగ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అతను స్వర్ణ పతక విజేత న్యూజిలాండ్‌కు చెందిన డేవిడ్ లిటి కంటే కేవలం ఒక కిలోగ్రాము వెనుక నిలిచాడు. లవ్‌ప్రీత్ మొత్తం 388 కిలోల బరువును ఎత్తి, అగ్రస్థానాన్ని తృటిలో కోల్పోగా, లిటి 389 కిలోల సంయుక్త ప్రదర్శనతో కామన్వెల్త్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఇంగ్లాండ్‌కు చెందిన ఆండ్రూ గ్రిఫిత్స్ మొత్తం 356 కిలోలతో మూడవ స్థానంలో నిలిచాడు.



### వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్..

# నికితాకు రజతం

## కామ్నా, గరిమకు కాంస్యం





**న్యూఢిల్లీ:** అండర్17 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2026లో భారత మహిళా రెజ్లర్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ఒక రజత, రెండు కాంస్య పతకాలను సాధించి దేశ పతకాల పట్టికను బలోపేతం చేశారు. అజర్‌బైజాన్ లోని బాకులో శుక్రవారం జరిగిన 57 కేజీల విభాగంలో రజత పతకం సాధించడంద్వారా నికితా సెహ్రావత్ భారత్ తరపున అగ్రశ్రేణి ప్రదర్శకురాలిగా నిలిచింది. అక్కడ యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన ప్రస్తుత అండర్17 ప్రపంచ రజత పతక విజేత ఎపెనెసా ఎలిసన్‌తో తలపడింది. టైటిల్ బౌట్‌లో నికితా 0-6 తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. ఇక కామ్నా బాబల్, 49 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. జపాన్‌కు చెందిన సైకా ఉచిడా చేతిలో సెమీఫైనల్‌లో ఓటమి పాలైన కామ్నా, కాంస్య పతకం కోసం జరిగిన పోరులో రష్యాకు చెందిన ఇరినా సిడీవాపై 3-2 తేడాతో స్వల్ప విజయం సాధించి, పోడియంపై స్థానం దక్కించుకుంది. 73 కేజీల విభాగంలో గరిమ ద్వారా భారతదేశానికి మూడవ పతకం లభించింది. సెమీ ఫైనల్స్‌లో అమెరికన్ రెజ్లర్ కైలీ మాన్యుయల్ చేతిలో 5-7 తేడాతో ఓటమి పాలైన తర్వాత, మాజీ అండర్15 ఆసియా ఛాంపియన్ అయిన ఆమె అద్భుతంగా పుంజుకుంది. కాంస్య పతకం కోసం జరిగిన పోరులో ఆమె స్పెయిన్‌కు చెందిన పౌలా బెనైక్సా పెరెజ్‌ను టెక్నికల్ సుపీరియారిటీ ద్వారా 10-0 తేడాతో చిత్తుగా ఓడించిం

## స్పెయిన్‌లో తెలంగాణ గ్రాండ్ మాస్టర్

# రాజా రిత్విక్‌కు కాంస్యం

### పోంటెవేద్రా ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో అజేయ ప్రదర్శన

### 9 రౌండ్లలో 7 పాయింట్లతో మూడో స్థానం




**హైదరాబాద్,జులై 31:** తెలంగాణకు చెందిన గ్రాండ్ మాస్టర్ రాజా రిత్విక్ స్పెయిన్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక పోంటెవేద్రా ఇంటర్నేషనల్ చెస్ ఛాంపియన్‌షిప్2026లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఈనెల 24 నుంచి 30 వరకు స్పెయిన్‌లోని పోంటె వేద్రా నగరంలో నిర్వహించిన ఈ టోర్నీలో రిత్విక్ అద్భుతమైన అజేయ ప్రదర్శనతో మొత్తం 9 రౌండ్లలో 7 పాయింట్లు సాధించి మొత్తం మూడో స్థానంలో నిలిచారు. దీంతో రెండో రన్నరప్ ట్రోఫీ బ్రాంజ్ మెడల్‌ను అందుకున్నారు. ఈ టోర్నీలో ఫ్రాన్స్, గ్రీస్, భారత్, స్పెయిన్, హంగేరీ, ఇటలీ, స్విట్జర్లాండ్, క్యూబా, ఉక్రెయిన్, మెక్సికో, పోర్చుగల్, బ్రెజిల్, బల్గేరియా, ఇరాన్ తదితర దేశాలకు చెందిన 92 మంది అగ్రశ్రేణి క్రీడాకారులుపాల్గొన్నారు. కఠినమైనపోటీలో రాజారిత్విక్ ఒక్క పరాజయం కూడా చవిచూడ కుండా 5విజయాలు, 4డ్రాలతో 7పాయింట్లు సాధించి తన ప్రతిభను చాటారు. టోర్నీ ముగిసే సమయా నికి భారత ఇంటర్నేషనల్ మాస్టర్ ముత్తయ్య అల్, క్యూబాకు చెందిన ఇంటర్నేషనల్ మాస్టర్ రోడ్రిగ్జ్ హెర్నాండెజ్ లూయిస్ డేనియల్, గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ ముగ్గురూ చెరో 7 పాయింట్లతో సమంగా నిలిచారు. టైబ్రేక్ ఆధారంగా ముత్తయ్య అల్ 46.67 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, రోడ్రిగ్జ్ హెర్నాండెజ్ 46 పాయింట్లతో రజతపతకాన్ని, రాజా రిత్విక్ 44.11 టైబ్రేక్ పాయింట్లతో కాంస్య పతకాన్ని అందు కున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కెల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న రాజారిత్విక్, ప్రముఖ కోచ్ ఎన్ రామరాజు ఆధ్వర్యంలోని రేస్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఉక్రెయిన్ సూపర్ గ్రాండ్‌మాస్టర్ అలెగ్జాండర్ గోలోష్చపోవ్ ఆన్‌లైన్ ద్వారా ఆయనకు మార్గదర్శకత్వం అందిస్తున్నారు.

# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలకు లాభాలు




**ముంబై,జులై 31:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు వారాంతంలో ట్రేడింగ్‌ను లాభాలతో ముగించాయి. బజాజ్ ఫైనాన్స్ షేరు భారీగా పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు పెంచడం, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం మార్కెట్లకు ఊతమిచ్చాయి. అయితే ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ కారణంగా ప్రారంభ లాభాలు కొంత పరిమితమయ్యాయి. ట్రేడింగ్‌లో బిఎస్‌ఇ సెన్సెక్స్166.49 పాయింట్లు పెరిగి 78,094.64 వద్ద, ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 66.45 పాయింట్లు లాభపడి 24,383.60 వద్ద ట్రేడయ్యాయి. ముఖ్యంగా బజాజ్ ఫైనాన్స్ షేరు 6 శాతానికి పైగా ఎగిసింది. తొలి త్రైమాసికంలో కంపెనీ సమీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 28 శాతం పెరిగి రూ.6,081 కోట్లకు చేరినట్లు వెల్లడించింది. కోర్ ఆదాయం పెరగడం, ఆస్తుల నాణ్యత మెరుగుపడటం ఇందుకు ప్రధాన కారణాలుగా కంపెనీ తెలిపింది. సెన్సెక్స్‌లో బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఎలక్ట్రానిక్స్, మారుతి సుజుకి, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా షేర్లు కూడా లాభాల్లో ట్రేడయ్యాయి. మరోవైపు ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల గణాంకాల ప్రకారం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు రూ.3,623.51 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. విదేశీ పెట్టుబడుల ప్రవాహం మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్నిచ్చింది. బ్రెంట్ క్రూడ్ ధర 0.38 శాతం తగ్గి బ్యారెల్‌కు 89.37 అమెరికన్ డాలర్ల వద్ద కొనసాగింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 95.3650వద్ద నిలిచింది. అంతకుముందురోజు 95.5050వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు రూ.1.41,934గా కొనసాగాయి.

# నిరాశ పరిచిన ఐటిసి




## నికరలాభాల్లో 27.1% క్షీణత

**ముంబయి,జులై 31:** దేశీయ ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం ఐటీసీ తొలి త్రైమాసికంలో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 27.1 శాతం తగ్గి రూ.3,579 కోట్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.4,911 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మార్కెట్ అంచనాలు రూ.4,368 కోట్లుగా ఉంటే కంపెనీ ఫలితాలు ఆ అంచనాలకు తక్కువగా నమోదయ్యాయి. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం కూడా 14.5 శాతం తగ్గి రూ.16,907 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.19,761 కోట్లుగా ఉండగా, విశ్లేషకుల అంచనా రూ.18,630 కోట్లుగా ఉంది. వడ్డీ, పన్నులు, తరుగుదల, అమోర్టైజేషన్‌కు ముందు లాభం ఎబిడిటా 27.9 శాతం క్షీణించి రూ.4,514 కోట్లకు పడిపోయింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.6,261 కోట్లుగా నమోదైంది. మార్కెట్ అంచనా రూ.5,356 కోట్లుగా ఉండగా, ఆ స్థాయికి కూడా చేరుకోలేకపోయింది. దీంతో కంపెనీ ఎబిట్డా మార్జిన్ 31.7 శాతం నుంచి 26.7 శాతానికి పడిపోయి 500 బేసిస్ పాయింట్లు క్షీణించింది. కంపెనీ సిగరెట్ వ్యాపారం ఆదాయం మాత్రం బలమైన వృద్ధిని నమోదు చేసింది.

సిగరెట్ విభాగం ఆదాయం 81 శాతం పెరిగి రూ.15,383 కోట్లకు చేరింది. మరోవైపు అగ్రి వ్యాపార రాబడి 17 శాతం తగ్గి రూ.8,082 కోట్లకు పడిపోయింది. ఎఫ్‌ఎంసిజి విభాగం ఆదాయం 53 శాతం పెరిగి రూ.21,866 కోట్లకు చేరింది. నిర్వహణ పరంగా చూస్తే సిగరెట్ వ్యాపారంలో లాభదాయకతపై ఒత్తిడి కనిపించింది. ఈ విభాగం ఎబిడిటా 35 శాతం తగ్గి రూ.3,341 కోట్లకు చేరగా, అగ్రి వ్యాపారఎబిడిటా 18 శాతం క్షీణించి రూ.354 కోట్లకు పరిమితమైంది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఐటిపి షేరు జూలై చివరి ట్రేడింగ్ రోజున ఎన్‌ఎస్‌ఇలో 1.42 శాతం క్షీణించి రూ.281 వద్ద ముగిసింది. అదే రోజు నిఫ్టీ సూచీ 0.27 శాతం లాభపడింది. ఐటీసీ షేరు ధర ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు 30.27 శాతం, గత 12 నెలల్లో 31.79 శాతం పడిపోయింది.

## మారుతిసుజుకి ఆదాయం

# రూ.52,456 కోట్లు



**ముంబయి,జులై 31:** దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి ఇండియా తొలి త్రైమాసికంలో అమ్మకాలు గణనీయంగా పెరగడంతో రాబడులు రికార్డు స్థాయికి చేరుకున్నప్పటికీ, ముడి పదార్థాల వ్యయం భారీగా పెరగడంతో కంపెనీ లాభదాయకతపై ప్రభావం పడింది. ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.3,352 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత యేడాది ఇదే కాలంలో నమోదైన రూ.3,758 కోట్లతో పోలిస్తే 10.8 శాతం తగ్గుదల నమోదైంది. అమ్మకాలతో వచ్చిన ఆదాయం 35.9 శాతం పెరిగి రూ.52,456 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఈ ఆదాయం రూ.38,593 కోట్లుగా ఉంది. దేశీయ విక్రయాలు, ఎగుమతులు బలంగా పెరగడం వల్ల ఆదాయంలో ఈ వృద్ధి నమోదైంది. అయితే నిర్వహణ లాభదాయకత ఎబిడిటాపై ఒత్తిడి కనిపించింది. కంపెనీ ఎబిడిటా రూ.4,312 కోట్లకు పడిపోయింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.5,043 కోట్లుగా ఉండగా, ఈసారి 14.5 శాతం తగ్గుదల నమోదైంది. అలాగే ఎబిడిటా మార్జిన్ 13.1 శాతం నుంచి 8.2 శాతానికి క్షీణించింది. కంపెనీ లాభాలు తగ్గడానికి ప్రధాన కారణం ముడి పదార్థాల వ్యయం భారీగా పెరగడమే. మెటీరియల్ ఖర్చు 46 శాతం పెరిగి రూ.32వేల కోట్లకు చేరుకోవడంతో అధిక అమ్మకాల వల్ల వచ్చిన ప్రయోజనం తగ్గిపోయి, నిర్వహణ మార్జిన్లు ఒత్తిడికి గురయ్యాయి. కంపెనీ రికార్డు స్థాయిలో 6,82,724 వాహనాల విక్రయాలు నమోదు చేసింది. ఇది గత యేడాదితో పోలిస్తే 29.3 శాతం అధికం. ఎగుమతులు 28.6 శాతం, ఎస్‌యూవీ విక్రయాలు 44.6 శాతం పెరగడం కంపెనీ యుటిలిటీ వాహనాలపై వినియోగదారుల నుంచి కొనసాగుతున్న బలమైన డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది.




## ఒక్కరోజులో మైక్రోసాఫ్ట్ రాబడులు

# రూ.42 లక్షల కోట్లు

**శాన్‌ఫ్రాన్సిస్కో,జులై 31:** టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. ఒక్కరోజు ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు 15 శాతానికి పైగా దూసుకెళ్లడంతో దాని మార్కెట్ విలువకు ఒక్కరోజే రికార్డు స్థాయిలో 450 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 42లక్షల కోట్లు జతయ్యాయి. స్టాక్ మార్కెట్ చరిత్రలో లిస్టయిన ఏ కంపెనీకైనా ఒకే ట్రేడింగ్ సెషన్‌లో ఇంత భారీ స్థాయిలో లాభం రావడం ఇదే తొలిసారి. ఈ అనూహ్య పెరుగుదలతో మైక్రోసాఫ్ట్ మొత్తం మార్కెట్ విలువ 3.35 ట్రిలియన్ డాలర్లకు చేరింది. గతంలో 2025 ఏప్రిల్‌లో ఎన్విడియా నెలకొల్పిన 441 బిలియన్ డాలర్ల సింగిల్ డే గెయిన్ రికార్డును మైక్రోసాఫ్ట్ బద్దలుకొట్టింది. మైక్రోసాఫ్ట్ ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసిక ఫలితాలు, భవిష్యత్ అంచనాలు ప్రకటించిన తర్వాత ఈ అద్భుతం చోటుచేసుకుంది. ముఖ్యంగా కంపెనీ క్లౌడ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్ అయిన అజూర్ పనితీరు పెట్టుబడిదారుల్లో బలమైన విశ్వాసాన్ని నింపింది. ఈ త్రైమాసికంలో అజూర్ ఆదాయవృద్ధి 43 శాతంగా నమోదై అంచనాలను అధిగమించింది. రాబోయే త్రైమాసికంలో ఇది 45 శాతానికి పెరుగుతుందని కంపెనీ అంచనా వేయడం మార్కెట్‌ను మరింత ఉత్సాహపరిచింది. ఈ ఫలితాలతో అజూర్ వార్షిక ఆదాయం తొలిసారిగా 100 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటింది. దీంతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై మైక్రోసాఫ్ట్ పెడుతున్న భారీ ఖర్చుల గురించి ఆందోళన పక్కకు వెళ్లి, వాణిజ్యపరమైన రాబడిపై ఇన్వెస్టర్ల దృష్టి మళ్లింది. కంపెనీ తన ఖర్చుల ప్రణాళికలో పెద్దగా మార్పులు చేయలేదు. రాబోయే త్రైమాసికంలో సుమారు 50 బిలియన్ డాలర్లు, 2026 క్యాలెండర్ సంవత్సరానికి గాను దాదాపు 175 బిలియన్ డాలర్ల మూలధన వ్యయాన్ని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఆరంభంలో ఇతర టెక్ కంపెనీలతో పోలిస్తే మైక్రోసాఫ్ట్ షేరు వెనుకబడింది.




## ఐఒసికి తొలి త్రైమాసికంలో

# రూ.2,661 కోట్ల నష్టం

**న్యూఢిల్లీ,జులై 31:** ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తొలి త్రైమాసికంలో రూ.2,661 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. అయితే మార్కెట్ అంచనాలతో పోలిస్తే కంపెనీ ఫలితాలు మెరుగ్గా ఉన్నాయి. ఐఒసికి రూ.20,295 కోట్ల నష్టం వస్తుందని విశ్లేషకులు అంచనా వేశారు. ఈ త్రైమాసికంలో ఐఒసి కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం త్రైమాసిక ప్రాతిపదికన 26.2 శాతం పెరిగి రూ.2.62 లక్షల కోట్లకు చేరుకుంది.

మార్చి త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.2.08 లక్షల కోట్లుగా నమోదైంది. ఎబిట్డా రూ.1,947 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంలో ఐఒసి ఎబిట్డా రూ.1,947 కోట్లుగా నమోదైంది. గత త్రైమాసికంలో నమోదైన రూ.20,716 కోట్ల నిర్వహణ లాభంతో పోలిస్తే ఎబిట్డా భారీగా తగ్గింది. గత త్రైమాసికంతో పోలిస్తే ఐఒసి ఆదాయాలు గణనీయంగా తగ్గినప్పటికీ, మార్కెట్ అంచనాలతో పోలిస్తే ఫలితాలు మెరుగ్గా ఉన్నాయి. ముఖ్యంగా నిర్వహణ స్థాయిలో కంపెనీ అంచనాలకు మించి రాణించింది.

## జీతంతోపాటు ఇతర రాబడులపైనా

# జెన్‌జడ్ ఫోకస్




**న్యూఢిల్లీ,జులై 31:** దేశంలో ఐటి రిటర్నుల దాఖలులో భారీ మార్పులు చోటుచేసు కుంటు న్నాయి. కేవలం జీతంపైనే ఆధార పడకుండా పెట్టుబడులు, ఫ్రీలాన్సింగ్, వ్యాపారం, కన్సల్టింగ్ వంటి పలు ఆదాయ వనరుల నుంచి ఆదాయం పొందుతున్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య వేగంగా పెరుగుతోందని ట్యాక్స్ ఫైలింగ్ ప్లాట్‌ఫామ్ క్లియర్‌ట్యాక్స్ వెల్లడించింది. యువతలో ఈ ధోరణి మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఈనెల 20 వరకు దాఖలైన ఐటి రిటర్నులను చూస్తే, 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పన్ను చెల్లింపుదారుల్లో 76 శాతం మంది ఒకటి కంటే ఎక్కువ ఆదాయ వనరులను ప్రకటించారు. 2022-23 అసెస్‌మెంట్ ఇయర్‌లో ఈ శాతం కేవలం 14 మాత్రమే ఉండగా, ప్రస్తుతం భారీగా పెరగడం గమనార్హం.

జీతంతో పాటు స్టాక్ మార్కెట్ పెట్టుబడులు, క్యాపిటల్ గెయిన్స్, ఫ్రీలాన్స్ పనులు, స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాల ద్వారా ఆదాయం సంపాదిస్తున్నట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. క్లియర్‌ట్యాక్స్ చరిత్రలో తొలిసారిగా కేవలం జీతం ద్వారానే ఆదాయం పొందుతున్న పన్ను చెల్లింపుదారుల వాటా మొత్తం రిటర్నుల్లో 50 శాతం కంటే దిగువకు పడిపోయింది. ప్రస్తుతం కేవలం 42 శాతం మంది మాత్రమే జీతాన్ని ఏకైక ఆదాయ వనరుగా ప్రకటించగా, 2022-23లో ఈ సంఖ్య 82 శాతం నమోదుకావడం గమనార్హం. ఉద్యోగంతో పాటు పెట్టుబడులు, డిజిటల్ కంటెంట్ సృష్టి, కన్సల్టింగ్, సైడ్ బిజినెస్‌లు వంటి అదనపు ఆదాయ మార్గాలను ఎక్కువ మంది ఎంచుకుంటున్నారు. క్యాపిటల్ గెయిన్స్‌ను ప్రకటిస్తున్న వారిశాతం 39కుచేరుకుంది. వ్యాపార ఆదాయాన్ని ప్రకటిస్తున్న పన్ను చెల్లింపు దారుల వాటా కూడా గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 26శాతం మంది వ్యాపార ఆదాయాన్ని ప్రకటించగా, 2022-23లో ఈ సంఖ్య 4 శాతం మాత్రమే. గిగ్ ఎకానమీ, ఫ్రీలాన్స్ సేవలు, కన్సల్టింగ్, స్వయం ఉపాధి అవకాశాలు విస్తరించడం దీనికి కారణంగా క్లియర్‌ట్యాక్స్ విశ్లేషించింది.

1skl15:1skl15.qxd 31-07-2026 23:07 Page 1



# ఐతంలో హ్యాకథాన్-2026 పోస్టర్ ఆవిష్కరణ



**టెక్కలి, జూలై 31, ప్రభాతవార్త :**

విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలు, సాంకేతిక ప్రతిభను పెంపొందించే లక్ష్యంతో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న హ్యాకథాన్-2026 పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హ్యాకథాన్‌లు విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడంతో పాటు వాస్తవ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అన్వేషించే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో జట్టు భావన, నాయకత్వ లక్షణాలు, పరిశోధనా దృక్పథం, సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు దోహదపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్.శ్రీనివాసరావు, విభాగాధిపతి డా. వై.రమేష్, డీన్లు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్-2026 నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా హెచ్ ఒ డి డా. వై.రమేష్, సహా కన్వీనర్లుగా డా. ఎం.జయంతిరావు, డా. జి.రామకృష్ణ వ్యవహరిస్తున్నారు.

# రైతులు ఉద్యాన పంటలు పండించేందుకు శిక్షణ



**సరుబుజ్జిలి, జూలై 31, ప్రభాతవార్త :**

మండలంలో గల కొండగూడెం గ్రామంలో రైతు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించడం జరిగింది. జీడిమామిడి, మామిడి విస్తరణ పథకానికి 40%సబ్సిడీ, ఫార్మ్ పాండ్ (20×20×3 మీటర్లకు) 90,000 సబ్సిడీ, మామిడి, జీడిమామిడి పునరుద్దరణ పథకం 24,000 సబ్సిడీ, రైతులు తమ పొలాల్లోనే ఉద్యాన పంటలను గ్రేడింగ్, క్లీనింగ్, ప్యాకింగ్ చేసుకోవటానికి ప్యాక్ హౌస్ గాను 2,40,000 సబ్సిడీ, (30×20 అడుగులు) పోలీహౌస్‌కు చదరపు మీటర్‌కు 355 రూపాయలు సబ్సిడీ ఉద్యాన శాఖ నుండి అందుబాటులో ఉంది. అనంతరం పామ్ ఆయిల్ మొక్కల పైన శత శాతం సబ్సిడీ శ్రీనివాస్ పామ్ ఆయిల్ కంపెనీ ద్వారా ఉద్యాన శాఖ పామ్ ఆయిల్ విస్తరణ పథకం అందజేస్తున్నారు. ఎం.ఎం.ఈ ఓ.(నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్) పథకం కింద 50,000 బోరు లేదా బావికి సబ్సిడీ 10,000 రూపాయలు మోటార్‌కి ఉంటుందని ఉద్యాన శాఖ అధికారిని ప్రియాంక తెలిపారు. ఎల్‌నినో సంరక్షణ చర్యలు మరియు జీడిమామిడి శాస్త్రీయ మెళకువలు గురించి డా. రాజశేఖర్ శాస్త్రవేత్త, డా.నరసింహులు శాస్త్రవేత్త, హెచఈఓ తిరుపతిరావు, హార్టికల్చర్ అసిస్టెంట్ రేవతి మరియు రైతులు పాల్గొని వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

# పదవీ విరమణ పొందిన దుర్గాప్రసాద్‌కు ఘన సన్మానం



**సీతంపేట, జూలై 31, ప్రభాతవార్త :**

సీతంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ శుక్రవారం పదవి విరమణ చేసిన చుక్కల దుర్గా ప్రసాద్ సతీమణి చుక్కల వరలక్ష్మిలకు ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, అధికారులు ఘనంగా సన్మానం చేశారు. స్థానిక సామాజిక భవనంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఆనందరావు ఉపాధ్యాయులు మాట్లాడుతూ పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో అనితర సాధ్యమైన పురోగతి చూపించి కర్తవ్య దీక్ష, అంకిత భావంతో పని చేసి విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసిన ఎందరో ఉపాధ్యాయులకు దుర్గాప్రసాద్ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ2 చంద్రమౌళి, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# వెలవెలబోయిన ఐటీడీఏ ప్రజాగ్రీవెన్స్

**సీతంపేట, జూలై 31 ప్రభాతవార్త :**

ఐటీడీఏ ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌కు అధికారులు అర్జీదారులు లేక వెలవెల బోయింది. అధికారులందరూ ఆగస్టు 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో ప్రధానమంత్రి ప్రారంభోత్సవానికి రానుండడంతో అధికారులకు వివిధ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. దీంతో గ్రీవెన్స్ వెలవెలబోయింది. కేవలం ఆరు అర్జీలు మాత్రమే రావడంతో వీటిని ఏపీఓ జి.చిన్నబాబు స్వీకరించారు.

# రైతులకు అందుబాటులో ఎరువులు : విప్ అశోక్



**కవిటి, జూలై 31, (ప్రభాతవార్త):**

రైతులకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ అధికారి (ఏఓ) శ్రీదేవి ఆధ్వర్యంలో రైతులకు పొటాష్, యూరియా ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, ఎరువుల కొరతపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు బి.రమేష్, పి.కృష్ణారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాస్‌దేవ్ ప్రధాన్, మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, రైతు సంఘం కార్యదర్శి పుల్లటి సంతోష్, బెందాళం తిరుమలరావు, కుర్రాయి వాసుదేవరావు, ప్రగడ మణిబాబు, వజ్జా రంగారావు, బెందాళం చక్రధర్, బెందాళం ఆనంద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

# సంక్షేమానికి-అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వం



## మాజీ జడ్పిటిసి రమేష్

**కవిటి, జూలై 31, ప్రభాతవార్త :**

సంక్షేమానికి, అభివృద్ధికి చిరునామా కూటమి ప్రభుత్వమని మాజీ జడ్పిటిసి రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో 92వ బూత్ పరిసరాల్లో నమ్మకం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కుటుంబ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి రమేష్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్ళుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భావిస్తున్నారని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నారని అన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందాలన్నది ఆయన ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పి.కృష్ణారావు, మాజీ సర్పంచ్ ఆరంగి మధు, నేతలు బెందాళం తిరుమలరావు, వజ్జా రంగారావు, కొల్లాయి సింహాచలం, భావన రవి, కే.వాసుదేవరావు, ప్రగడ మణి బాబులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# భూ పోరాట విజయోత్సవ సభను సక్సెస్ చేయండి



**జలుమూరు, జూలై 31, ప్రభాతవార్త :**

జలుమూరు మండలం ఎస్టి మాకివలస గ్రామంలో గత రెండున్నర సంవత్సరాలుగా ఆదివాసీ ప్రజలు సాగించిన సుదీర్ఘ భూ పోరాటం విజయవంతమైన సందర్భంగా భూ పోరాట విజయోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షులు వాబయోగి శనివారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆగస్టు 8వ తేదీన భూ పోరాట విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని ఈ సందర్భముగా శుక్రవారం గ్రామంలో సభకు సంబంధించిన పోస్టర్లును ఆవిష్కరిం చడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా "ఈ అడవి మాదే –ఈ భూమి మాదే" అనే నినాదంతో రెండున్నర ఏళ్ళు పాటు మాకివలస ఆదివాసి గ్రామస్తులు చేసిన పోరాట ఫలితముగా భూమిని సాధించుకోవడం జరిగిందని తెలిపారు. ఇది కేవలం ఎస్టీ మాకివలస గ్రామం యొక్క విజయం మాత్రమే కాదని, జిల్లా మొత్తం ఆదివాసి సమాజం యొక్క విజయమని అన్నారు. ఐక్యతగా పోరాడితే ఏదైనా సాధించగలమని ఎస్టీ మాకివలస ఆదివాసి ప్రజలు మరోసారి నిరూపించారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో బోడవలస పాపారావు మండల అధ్యక్షులు, కొర్రై ప్రసాదు, సురపు నాయుడు,పడాల పోలయ్య, బోడవలస ఆనందరావు, పులికట్టు భద్రమ్మ, చిన్నింటి శ్రీనుమ్మ, ఉత్తరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ్‌చంద్ సాహిత్యం సమాజానికి దిక్సూచి



**కంచిలి, జూలై 31, ప్రభాతవార్త :**

సాహిత్యం సమాజానికి దర్పణమైతే, మున్షీ ప్రేమ్‌చంద్ రచనలు సామాన్య ప్రజల జీవితాలకు అద్దం పట్టాయని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ హిందీ సాహితీవేత్త, ఉపన్యాస సమ్రాట్ మున్షీ ప్రేమ్‌చంద్ జయంతి సందర్భంగా కంచిలి మండలం బూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రేమ్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రోజారాణి మాట్లాడారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, చలపతి, కాంతారావు, ఎం.వి. రమణ, నిరంజన్ ఖడంగా, గణేష్, సోమేశులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ ఆక్రమణలు నిలిపివేసి న్యాయం చేయాలి



## దళిత రైతుల ఆందోళన

**కోటబొమ్మాళి, జూలై 31, ప్రభాతవార్త :**

మండలం చిన్నసాన గ్రామ సమీపంలోని సర్వే నెంబర్ 340 చిన్నసాన కొండపై జరుగుతున్న క్వారీ యాజమాన్యం అక్రమణలు ఆపాలని ఆ గ్రామానికి చెం దిన దళితులు సింగారి పాపారావు, పి. దుర్గారావు, పంచిరెడ్డి లక్ష్మణ్, తులా రామారావు, సంకిల్లి సింహాచలం, బోనేల ఎల్లయ్య తదితరులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే అప్పటి దివంగత కేంద్రమంత్రి కింజరాపు యర్రన్నాయుడు 1998లో సర్వే నెంబర్ 340లో అరుగురికి ఒక్కొక్కరికి 50 సెంట్లు చొప్పున్న డి పట్టాలను అందజేశారని, ఆ స్థలంలో టేకు, నీలగిరి మె లక్కలు నాటుకున్నామని గత రెండు సంవత్సరాలుగా గ్రానైట్ యాజమాన్యం కనీసం మా అనుమతులు లేకుండా ఆ ప్రాంతంలో క్వారీలను నిర్వహిస్తున్నారని వారు ఆందోళన చెందారు. అయితే పలుమార్లు మా స్థలాలపై పనులు చేస్తున్న క్వారీ యాజమాన్యంకు అడుగుదామంటే రెండేళ్లుగా సిబ్బంది తప్ప ఎవ్వరు కనిపించకపోవడంతో ఎవ్వరికి అడగాలో అన్న విషయం తెలియటం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు అదే కొండపై 1992 ఎస్సీ కార్పోరేషన్ ద్వారా తోటలు పెంపకం కోసం బోనేల బొడెన్న, శ్రీనివాసరావు, దుండంగి చిన్నమ్మి, అప్పయ్యతో పాటు మరో 15 మందికి మొక్కలు ఇచ్చి కొండపై నాటేందుకు అన్ని అనుమతులు ఇచ్చారు. అయితే ఆ స్థలంపై ఇదే యాజమాన్యం క్వారీ నిర్వహించడంతో మొక్కలు పూర్తిగా పాడైపోయాయని వారు అందోళన చెందారు. అయితే ఈ విషయంపై గనులశాఖ ఏడీ, జిల్లా కలెక్టర్కు పిర్యాదు చేస్తామని బాదితులు తెలిపారు.



# అమ్మవార్లకు ఆషాఢమాసం సారె

**కోటబొమ్మాళి, జూలై 31, ప్రభాతవార్త :**

మండలంలోగల ఊడికలపాడు గ్రామంలో వెలిసిన కొత్తమ్మతల్లి, దుర్గమ్మతల్లి, చెవిటమ్మతల్లిలకు గ్రామస్థులు అషాడ మాసాన్ని పురస్కరించుకొని పలు రకాల వంటకాలులతో అమ్మవారులకు అషాడమాస సారేను శుక్రవారం అందజేశారు. శ్రీ రామమందిరం నుంచి గ్రామస్థులంతా స్వీట్స్, పండ్లు, చీరలతో అమ్మవార్లుకు సమర్పించారు. శ్రీరాముడు అవతారమైన శ్రీకృష్ణుడు ఆడపడుచులైన అమ్మవార్లుకు శ్రీరామ మందిరం నుంచి తీసుకువెళ్ళి అమ్మవార్లుకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో వేకువజామునే అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళల ఆధ్వర్యంలో గ్రామోత్సవం చేసి మంగళ వాయిద్యాల నడుమ వచ్చి అమ్మవార్లుకు నైవేద్యంగా సమర్పించారు. ప్రవచన కారుడు సనపల కరుణ్‌కుమార్, గ్రామస్తులు హనుమంతు వెంకటరావు, నేతింటి వెంకటరావు, మెండ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన డాక్యుమెంట్ రైటర్ల సమ్మె



**ఇచ్ఛాపురం, జూలై 31, ప్రభాతవార్త:**

జిఓ 396కి నిరసనగా ఈ నెల 20 నుండి 31వరకు తలపెట్టిన డాక్యుమెంట్ రైటర్‌ల సమ్మె శుక్రవారంతో ముగిసింది. శనివారం నుండి రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు యధావిధిగా కొనసాగుతాయి. డిమాండ్ల సాధనలో ఎటువంటి హామీలు లేకుండానే సమ్మె విరమించారు. 11 రోజుల పాటు పెన్‌డౌన్ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్‌లు, స్టాంప్ వెండర్‌లు పాల్గొన్నారు.

# మహిళా ఎస్సైపై దాడి దారుణం

## టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు ఆనెపు శ్రీదేవి ఆవేదన



**బూర్జ, జూలై 31, ప్రభాతవార్త :**

విధి నిర్వహణలో ఉన్న ఓ మహిళా ఎస్.ఐ ప్రవల్లికపై ఆముదాలవలస నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్?జ చింతాడ రవికుమార్‌తోపాటు వైసీపీ నాయకులు, ఆయన అనుచరులు దారుణంగా ప్రవర్తించటం దురదృష్టకరమణి తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఆనెపు శ్రీదేవి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కడగల ఇందుమతి, మండల తెలుగుదేశం పార్టీ మహిళా కార్యదర్శి కొంచాడ శారద ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దపేట గ్రామంలో శుక్రవారం మహిళా సంఘాలు సమావేశం అయ్యారు. గురువారం వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి పర్యటనలో భాగంగా జరిగిన ఈ సంఘటన పై బూర్జ మండలంలోని మహిళా సంఘాలు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకున్నాను, విద్యావేత్తను అని సభల్లో సమావేశాల్లో గొప్పలు చెప్పుకుంటున్న చింతాడ సంస్కారాన్ని కోల్పోవడం బాధాకరమని, మహిళలను గౌరవించాల్సిన ఆయన విధుల్లో ఉన్న మహిళా ఎస్సైను బలవంతంగా, దారుణంగా, బయటకు నెట్టేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం కోసం, వారి రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీస్ మహిళా అధికారి పైనే వారు ఇంత దారుణంగా వ్యవహరిస్తే ఇక సాధారణమైన మహిళలు బయట తిరగలేని పరిస్థితి నెలకొంటుందని చింతాడ తీరుపై వారు ఆగ్రహించారు. మహిళలు తల దించుకుని సిగ్గుపడెలా చేసి, మానసిక వ్యధకు గురి చేశారు. ఏమిటి అరాచకాలు... ఎందుకీ దౌర్జన్యం.... మహిళలు ఉద్యోగాలు చేయకూడదా...అని వారు ధ్వజమెత్తారు. మహిళ ఎసఐపై దాడి చేసిన వారి తీరుపై మహిళలు ఆగ్రహించారు. మహిళలపై ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వైసిపి నేతలను, వారీ అనుచరులపై చట్టరిత్య చర్యలు తీసుకోనీ భవిష్యత్తులో మహిళలకు రక్షణ కల్పించి భరోసా ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు పోలీస్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అనేకమంది మహిళలు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్



**ఆమదాలవలస, జూలై 31, ప్రభాతవార్త :**

ప్రజా సమస్యల కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపు మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకొని వెళ్తామని అన్నారు.అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే రవికుమార్ ఉంటారని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవచ్చనని అన్నారు. ప్రజాపాలన దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పివికే రాజు, కూన ఆంజనేయులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**కోటబొమ్మాళి, జూలై 31 ప్రభాతవార్త :**

కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కెవి దంత ఫీడర్ పైన చెట్లకొమ్మలు తొలగింపు వలన శనివారం ఉదయం 8గంటలనుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ నరసింహకుమార్ తెలిపారు.



శ్రీకాకుళం వార్త

# దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్ నిరసనలకు విరామం



**రణస్థలం, జూలై 31 ప్రభాతవార్త :**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా సేవలు అందించేలా ప్రభుత్వం జారీ చేసిన జీవో 396ను నిరసిస్తూ రణస్థలం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖర్లు గత 12 రోజులుగా చేపట్టిన పెన్ డౌన్ నిరసన కార్యక్రమాలను శుక్రవారంతో ముగించారు. ఈ నిరసన కార్యక్రమాలు ముగియడంతో శనివారం నుండి దస్తావేజు లేఖర్లు విధులను యథావిధిగా నిర్వహిస్తున్నట్లు దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు వెల్లడించారు. జీవో 396కు వ్యతిరేకంగా రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ఇప్పటికే గౌరవ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనికి తోడు ప్రభుత్వం నుంచి కూడా ఈ అంశంపై కొంత సానుకూల దృక్పథం వ్యక్తమవ్వడంతో, ప్రస్తుతం చేపట్టిన నిరసన కార్యక్రమాలకు తాత్కాలికంగా విరామం ప్రకటిస్తున్నట్లు దస్తావేజుల సంఘం తెలిపింది. కక్షిదారులకు, సహకరించిన వారికి ధన్యవాదాలు : గత 12 రోజులుగా సాగిన ఈ ఆందోళన వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, తమకు అండగా నిలిచిన కక్షిదారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజలందరికీ దస్తావేజు లేఖర్ల సంఘం ప్రత్యేక ధన్యవాదాలు సంఘం ప్రతినిధులు తెలిపింది. రాష్ట్ర సంఘం సూచనల మేరకు చేపట్టబోయే కార్యాచరణను రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ఇచ్చే సూచనల మేరకు నిర్ణయిస్తామని స్పష్టం వారు చేశారు. మారుతున్న పరిస్థితులను కక్షిదారులు అర్థం చేసుకుని సహకరించాలని వారు కోరారు. శనివారం నుంచి రిజిస్ట్రేషన్ దస్తావేజుల పనులు యథావిధిగా సాగుతాయని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంఘం ప్రతినిధులు కోరారు. దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు అరసాడ విజయసారధి, సురావజ్జుల శివకుమార్, పాలుమూడి వెంకటేశ్వర్లు, పులగుర్త మల్లిబాబు, బలివాడ శ్రీనివాసరావు, బైరి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఫోటో పాయింట్ ఏర్పాటు చేసిన విశ్రాంతి ఉపాధ్యాయులు



**సంతబొమ్మాళి, జూలై 31, ప్రభాతవార్త:**

సంతబొమ్మాలి మండలం దండు గోపాలపురం ప్రభుత్వ జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఆంగ్ల ఉపాధ్యాయులు తూట భాస్కరరావు నిర్మించిన ఐ లవ్ మై స్కూల్ 'ఫోటో పాయింట' అందరికి ఆకట్టుకుంది. సుమారు రూ. 31000 లతో ఇరువైపులా మొక్కలతో సుందరంంగా తయారైంది. ఈసందర్భంగా శుక్రవారం ఫోటో పాయింటును పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిట్ట గంగన్న ప్రారంభోత్సవము చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ భాస్కరరావు మాస్టారు ఈ పాఠశాలలో 9 సంవత్సరాలకు పైగా పనిచేశారని చాలా నిబద్ధతగల టీచరు అని అతనికి ఈ పాఠశాలతో, విద్యార్థులతో చాలా అనుబంధం ఉందని, పాఠశాల అభివృద్ధిలో తన పాత్ర గణనీయమైనదని తెలిపారు. తనకు పాఠశాల అంటే ఎంత ఇష్టమో తెలిపే ఫోటో పాయింటు నిర్మించి ఇవ్వటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇటువంటి ఫోటో పాయింటు ఏ ప్రభుత్వ పాఠశాలలో లేదని, పూర్వ విద్యార్థులు గ్రామస్థులు ఇక్కడ ఫోటో తీసుకొని ఒక మరచిపోలేని మధురానుభూతిగా ఉంచుకుంటారని తెలిపారు. ఇది ఎంతోమందికి పూర్తిగా నిలుస్తుందని తెలిపారు. భాస్కరరావుకి పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, అన్నాజీరావు, శారదాంబ, మురళీధర రాజు, రాము, సూర్య ప్రకాష్, ఉమ, శ్రీధరు, విజయలక్ష్మి, రోషిని, మల్లేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, దయాసాగర్, శ్రీధర్, మార్కండేయులు, విశ్రాంత ఉపాధ్యాయులు తిరుపతిరావు పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నేడు వీరఘట్టం ఉపకేంద్రం పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

**వీరఘట్టం, జూలై 31, ప్రభాతవార్త :**

మండలంలో వీరఘట్టం యొక్క ఉప కేంద్ర పరిధిలో ఆగస్టు 1వ తేదీ శనివారం 11కేవీ బిటివాడ ఫీడరు నందు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.విష్ణుమూర్తి విలేకరులకు తెలిపారు. ఈ ఫీడర్ నందు చెట్లు తొలగించుట, ఆర్‌డిఎస్ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున బీటివాడ ఫీడర్ పరిధిలో పనులు చేయుట వలన యు.వెంకంపేట, చిదిమి, సిఎస్ ఆర్ పేట, పివిఆర్ పురం, ఎజిఎల్‌కు సంబంధించి కొట్టిగుమ్మడ, గెడగమ్మ, కిమ్మి గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు. దయచేసి విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

# రాజాం ఐ లవ్ యు బోర్డు పని చేయడం లేదు




**రాజాం, జూలై 31, ప్రభాతవార్త:**

రాజాం మున్సిపాలిటీ పరిధిలో శ్రీకాకుళం రోడ్‌లో ఉన్న ఎస్సీ బాలురు వసతి గృహం ప్రక్కన ఎంతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన ఐ లవ్ యు డిజిటల్ బోర్డ్ చాలా రోజులుగా పని చేయడం లేదు. రాత్రివేళల్లో ఎంతో మిరిమిట్లు మెరిచేలా ఉండే ఈ బోర్డు పని చేయకపోవడంతో స్థానికులు నిరుత్సాహం చెందుతున్నారు. ప్రసిద్ధి గాంచిన రాజాం మున్సిపాలిటీలో ఎంతో అభిమానంతో ఏర్పాటు చేసుకున్న ఈ బోర్డు పని చేయకపోవడంతో స్థానికులు నుంచి విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి ఆ డిజిటల్ బోర్డు పని చేసే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇదిగో గిరిజన థింసా నృత్యానికి వరల్డ్ గిన్నిస్ రికార్డ్

**సీతంపేట, జూలై 31 ప్రభాతవార్త:**

భోగాపురంలో 13 వేల మంది గిరిజన విద్యార్థులతో ఏర్పాటు చేసిన గిరిజన థింసా నృత్యానికి వరల్డ్ గిన్నిస్ రికార్డ్ లభించడంతో గిరిజన సంక్షేమ శాఖ గుమ్మడి సంధ్యారాణి వివిధ ఐటీడీఏలకు చెందిన అధికారులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో థింసా నృత్యాన్ని పరిశీలించిన గిన్నిస్ ప్రతినిధులు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రకటించడంతో విద్యార్థులు సంబరాలు మిన్నంటైె ప్రభుత్వం తరపున గిన్నిస్ ప్రతినిధులు చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డు ధ్రువీకరణ పత్రంని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అందుకున్నారు. ప్రపంచ చరిత్రలో గిరిజన విద్యార్థులు థింసా నృత్యంలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం ఎంతో గర్వకారణమని విద్యార్థులను అభినందించారు.



01-08pg10exHMNWJQEBPRCKLT.qxd OK OK:01-08pg10exHMNWJQEBPRCKLT.qxd 1/1/02 7:00 AM Page 1






సత్యమేవ జయతే
భారత ప్రభుత్వం



# అభివృద్ధి. అవకాశాలు. సంపద.
# ఆంధ్రప్రదేశ్ అగ్రగామి

## సుమారు ₹18,000 కోట్ల విలువైన
విద్యుత్ ట్రాన్స్‌మిషన్, పౌర విమానయాన,
జాతీయ రహదారుల మరియు సెమీకండక్టర్ ప్రాజెక్టుల
ప్రారంభోత్సవం & శంకుస్థాపన



గౌరవ ప్రధాన మంత్రి
## శ్రీ నరేంద్ర మోదీ
గారి చేతుల మీదుగా

**శనివారం, 01 ఆగస్టు 2026, ఉదయం 10:00 గంటల నుండి | భోగాపురం, ఆంధ్రప్రదేశ్**

### ప్రారంభోత్సవం

- **అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం**
- **అనంతపురం (అనంతపూర్) (2500 MW), కర్నూలు (1000 MW) సౌర విద్యుత్ జోన్ కోసం ట్రాన్స్‌మిషన్ స్కీం**
- **ఖమ్మం-దేవరపల్లి ప్యాకేజీ-V**
  గుర్వాయగూడెం నుంచి దేవరపల్లి సెక్షన్ వరకు NH-365BGలో నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే
- **కర్నూలు పవన విద్యుత్ జోన్ / సౌర విద్యుత్ జోన్ (ఆంధ్రప్రదేశ్) కోసం ట్రాన్స్‌మిషన్ సిస్టం - పార్ట్-A & పార్ట్-B**
- **ఖమ్మం-దేవరపల్లి ప్యాకేజీ-IV**
  NH-365BGలో రేచర్ల నుంచి గుర్వాయగూడెం సెక్షన్ వరకు నాలుగు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవే
- **నాలుగు లేన్ల తాడిపత్రి బైపాస్**
  ఎన్‌హెచ్-67పై నాలుగు లేన్ల తాడిపత్రి బైపాస్

### శంకుస్థాపన

- **కర్నూలు-IV REZ తొలి దశ (4.5 గిగావాట్లు) సమీకరణ కోసం ట్రాన్స్ మిషన్ సిస్టం**
- **ఎన్‌హెచ్-565 పై హై-లెవల్ బ్రిడ్జి**
  ఎన్‌హెచ్-565 లోని పెంచలకోన-యేర్పేడు సెక్షన్‌లో లింగసముద్రం వద్ద హై-లెవల్ బ్రిడ్జి
- **విశాఖపట్నంలోని తర్లువాడలో సెమీకండక్టర్ ప్యాకేజింగ్ మరియు టెస్టింగ్ కేంద్రం ప్రాజెక్టులు - తొలి దశ**

### ప్రయోజనాలు

- ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికాభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామికీకరణ మరియు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయి.
- అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తర ఆంధ్ర, దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లకు వాయు అనుసంధానాన్ని మెరుగుపరుస్తూ, పర్యాటకం, వాణిజ్యం, లాజిస్టిక్స్‌కు తోడ్పడుతుంది.
- విద్యుత్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్ట్ జాతీయ గ్రిడ్ లోనికి కర్నూలు నుండి అనంతపురం RE జోన్ వరకు పునరుద్ధరణ విద్యుత్ సమీకృతాన్ని సులభతరం చేస్తాయి మరియు దక్షిణ భారత దేశంలో విద్యుత్ లభ్యతను మెరుగు పరుస్తాయి.
- భారతదేశపు పరిశుభ్రమైన ఇంధన మార్పిడి మరియు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఈ ప్రాజెక్టులు తోడ్పడతాయి.
- లింగసముద్రం వద్ద పెంచలకోన-యేర్పేడు అనుసంధాన రహదారిపై నిర్మించబడనున్న హై లెవెల్ బ్రిడ్జి ద్వారా పెంచలకోన, తిరుపతి (శ్రీ బాలాజీ) మరియు శ్రీకాళహస్తి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు రాకపోకలు పెంపొందించి మరింత సులభతరం చేస్తాయి.
- ఖమ్మం-దేవరపల్లె నాలుగు లేన్ల జాతీయ రహదారి ద్వారా ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల మధ్య ప్రాంతీయ అనుసంధానం, రహదారి భద్రత మరియు ప్రయాణ సౌలభ్యం మెరుగుపడుతుంది.
- తాడిపత్రి బైపాస్ నిర్మాణంతో ట్రాఫిక్ రద్దీ తగ్గి, రహదారి భద్రత మరింత మెరుగుపడుతుంది.
- తర్లువాడ, విశాఖపట్నం లో సెమికండక్టర్ ప్రాజెక్ట్ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది మరియు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది, భారత దేశ సెమీ కండక్టర్ వాల్యూ చైన్ ను పటిష్టం చేస్తుంది.

### వీరి సమక్షంలో

శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ – గవర్నర్, ఆంధ్రప్రదేశ్
శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు – ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్
శ్రీ నితిన్ గడ్కరీ – కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ మంత్రి
శ్రీ మనోహర్ లాల్ – కేంద్ర గృహనిర్మాణ & పట్టణ వ్యవహారాల మరియు విద్యుత్ శాఖ మంత్రి
శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు – కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి
శ్రీ అశ్విని వైష్ణవ్ – కేంద్ర రైల్వే, సమాచార & ప్రసార మరియు ఎలక్ట్రానిక్స్ & సమాచార సాంకేతిక శాఖ మంత్రి
శ్రీ శ్రీపాద నాయక్ – కేంద్ర విద్యుత్ మరియు నూతన & పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి
శ్రీ జితిన్ ప్రసాద – కేంద్ర వాణిజ్య & పరిశ్రమల మరియు ఎలక్ట్రానిక్స్ & సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి
శ్రీ అజయ్ తమ్టా – కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల శాఖ సహాయ మంత్రి
శ్రీ హర్ష్ మల్హోత్రా – కేంద్ర రోడ్డు రవాణా & రహదారుల మరియు కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి
డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని – కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు సమాచార శాఖ సహాయ మంత్రి
శ్రీ భూపతి రాజు శ్రీనివాస – కేంద్ర భారీ పరిశ్రమల మరియు ఉక్కు శాఖ సహాయ మంత్రి
శ్రీ మురళీధర్ మోహోల్ – కేంద్ర సహకార మరియు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి
శ్రీ కె. పవన్ కళ్యాణ్ – ఉప ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్
శ్రీ నారా లోకేష్ – మంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
శ్రీ బి.సి. జనార్దన్ రెడ్డి – రోడ్లు & భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్
శ్రీ గొట్టిపాటి రవి కుమార్ – విద్యుత్ శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్
శ్రీ అప్పలనాయుడు కలిశెట్టి – పార్లమెంటు సభ్యులు
శ్రీ బస్తిపాటి నాగరాజు పంచలింగాల – పార్లమెంటు సభ్యులు
శ్రీమతి డాక్టర్ బైరెడ్డి శబరి – పార్లమెంటు సభ్యురాలు
శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు – పార్లమెంటు సభ్యులు
శ్రీ అంబికా జి. లక్ష్మీనారాయణ వాల్మీకి – పార్లమెంటు సభ్యులు
శ్రీ మద్దిల గురుమూర్తి – పార్లమెంటు సభ్యులు
శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి – పార్లమెంటు సభ్యురాలు
శ్రీ పుట్టా మహేష్ కుమార్ – పార్లమెంటు సభ్యులు

DD NEWS ఈ కార్యక్రమాన్ని DD న్యూస్‌లో ప్రత్యక్షంగా వీక్షించండి.


Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.